శుక్రవారం
20-10-2023
విజయవాడ ప్రచురణ
సంపుటి : 72, సంచిక : 120
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from
Vijayawada, Hyderabad, Visakapatnam,
Kurnool, Tirupathi, Karimnagar, Khammam
www.visalaandhra.com
స్థాపితం : 1952

విశాలాంధ్ర

అక్షరాక్షరం అభ్యుదయం
VISALAANDHRA Regd No.VJ/042/2021-23

సిసోడియా కస్టడీ పొడిగింపు

న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో అరెస్టు అయిన మనీశ్ సిసోదియాకి కోర్టులో మళ్లీ ఊరట లభించలేదు. ఆయనకు విధించిన జ్యుడిషియల్ కస్టడీని ఢిల్లీ కోర్టు పొడిగించింది. నవంబరు 22 వరకు ఆయన కస్టడీ కొనసాగుతుందని న్యాయస్థానం పేర్కొంది.

వలస బాట

- కర్నూలు జిల్లాలో తీవ్ర వర్షాభావం
- ఎండిపోయిన పంటలు
- పనుల్లేక గ్రామాలు వీడుతున్న కూలీలు

విశాలాంధ్ర బ్యూరో–కర్నూలు: కర్నూలు జిల్లాలో వలసల బండి కదిలింది. తీవ్ర వర్షాభావ పరిస్థితుల కారణంగా పంటలు ఎండిపోయాయి. దీంతో రైతులకు పెట్టుబడులు కూడా చేతికి రాని పరిస్థితి ఏర్పడింది. పనులు లేకపోవడంతో గ్రామాల్లో వ్యవసాయ కూలీలు వలస బాట పట్టారు. ముఖ్యంగా జిల్లాలోని పశ్చిమ ప్రాంతం పత్తికొండ, మంత్రాలయం, ఆలూరు, ఎమ్మిగనూరు, కోడుమూరు నియోజకవర్గాలలో వ్యవసాయ కూలీలు వలసలు పోతుంటారు. ఈ ఏడాది తీవ్ర వర్షాభావ పరిస్థితుల కారణంగా ముందుగానే వలస బాట పట్టారు. కోసిగి మండల పరిధిలోని కోసిగి, నేల కోసిగి, వందగల్లు, చింతకుంట, పల్లెపాడు, ఆర్లబండ, సజ్జలగూడెం, దుద్ది, కోల్మన్ పేట, కామన్ దొడ్డి... ప్రతి గ్రామంలో 50 కుటుంబాలు చొప్పున మండలంలో 500 నుంచి 700 కుటుంబాలు తెలంగాణ రాష్ట్రంలోని రంగారెడ్డి, కామారెడ్డి, మహబూబ్ నగర్, హైదరాబాద్, గుంటూరు తదితర జిల్లాలకు పత్తి తీయడానికి వలస వెళ్లారు. కర్నాటకలోని హొస్పేట్ డ్యామ్ నుంచి దిగువ తుంగభద్ర నదిలోకి నీరు రాకపోవడంతో నది తీర గ్రామాల ప్రజలు సైతం బతుకు తెరువు కోసం వలసబాట పట్టారు. ఇప్పటివరకు నదిలో తాగడానికి సైతం చుక్కనీరు లేదు. జూన్ నుంచి ప్రారంభమయ్యే ఖరీఫ్ సీజన్‌లో వర్షాలు కురవక పంటలు పండక పోవడంతో రైతులు కన్నీరు మున్నీరవుతున్నారు. మరి కొంతమంది రైతులు ఎండిన పంటను పశువుల మేతకు వదిలేస్తున్నారు. పంటల కోసం తెచ్చిన అప్పులు తీర్చలేక పిల్లాపాపలతో సుదూర ప్రాంతాలకు సుగ్గి బాట పడుతున్నారు. గతంలో సంక్రాంతి పండగకు వలసలుపోయి ఉగాది పర్వదినం నాటికి పనులు పూర్తిచేసుకొని ఇంటి బాట పట్టేవారు. కానీ ఈ ఏడాది తీవ్ర వర్షాభావ పరిస్థితుల కారణంగా ముందుగానే వలస బట పట్టారు. గతంలో 90 రోజులు మాత్రమే వలసలు పోయే కూలీలు ఈ ఏడాది సుమారు 180 రోజులు వలసలు పోవలసి వస్తోంది. ఈనెల 23న దసరా పండగ ఉండటం వల్ల మరి కొంత మంది పండుగ కోసం ఇంటి వద్దనే ఉన్నారు. పండగ అయిన మరుసటి రోజు నుండి పశ్చిమ ప్రాంతంలో గ్రామాలకు గ్రామాలు ఖాళీ అయ్యే పరిస్థితి ఉంది. ప్రతి సంవత్సరం ఇంటి వద్ద వృద్ధులు, పిల్లల్ని వదిలేసి ఇతర ప్రాంతాలకు వెళ్లి తీవ్ర ఇబ్బందులు పడటం ఈ గ్రామాల వ్యవసాయ కూలీల కుటుంబాలకు అలవాటైపోయింది. కర్నూలు జిల్లాలో కరువు రక్కసిని పారదోలేందుకు శాశ్వత పరిష్కారం చేస్తామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిన ప్రస్తుత పాలకులు... ఆ దిశగా చర్యలు చేపట్టింది లేదు. ఇక్కడ కరువును నివారించాలంటే

- మిగతా 2 లో

కరువు కరాళ నృత్యం

- ఆదుకోని ప్రభుత్వం
- వలసబాట పట్టిన అన్నదాత
- రైతును పట్టించుకోపోతే జగన్ ఇంటికే
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ
- నంద్యాల, అనంత జిల్లాల్లో సీపీఐ బృందం పర్యటన

విశాలాంధ్ర–రాప్తాడు: రాష్ట్రంలో కరువు కరాళనృత్యం చేస్తోందని, అయినా పాలకులు పట్టించుకోవడం లేదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ విమర్శించారు. వర్షాభావంతో ఖరీఫ్ పంటలు ఎండిపోయాయని చెప్పారు. రైతులు

- మిగతా 2 లో

స్కిల్ కేసు

చంద్రబాబు రిమాండ్ పొడిగింపు

బెయిల్ పిటిషన్ వెకేషన్ బెంచ్‌కు బదిలీ



విశాలాంధ్ర బ్యూరో– అమరావతి: స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడుకు రిమాండ్‌ను నవంబర్ ఒకటో తేదీ వరకు పొడిగిస్తూ ఏసీబీ కోర్టు ఉత్తర్వులు జారీచేసింది. సెప్టెంబరు 10 నుంచి చంద్రబాబు రాజమండ్రి జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్నారు. గురువారంతో రిమాండ్ ముగియడంతో విజయవాడ ఏసీబీ కోర్టులో ఆయన కేసు విచారణ జరిగింది. చంద్రబాబు వర్చువల్‌గా విచారణకు హాజరయ్యారు. చంద్రబాబు రిమాండ్‌తో పాటు ఇతర కేసులలో కోర్టుల్లో విచారణ పెండింగ్‌లో ఉండటంతో నవంబర్ 1 వరకు రిమాండ్ పొడిగిస్తున్నట్లు న్యాయమూర్తి తెలిపారు. జైల్లో తన భద్రతపై అనుమానాలు ఉన్నాయని చంద్రబాబు కోర్టుకు తెలుపుగా ఏమున్నా రాతపూర్వకంగా తెలియజేయాలని జడ్జి హిమబిందు ఆయనకు సూచించారు. చంద్రబాబు లేఖను తనకు పంపాలని జైలు అధికారులను ఆదేశించారు. విచారణ సమయంలో రెండు పక్షాల న్యాయవాదులు వాదనలు వినిపించారు. చంద్రబాబు తరపున దమ్మాలపాటి, సీఐడీ తరపున వివేకానంద వాదించారు. సుప్రీంకోర్టులో క్వాష్ పిటిషన్ విచారణ జరుగుతున్నందున నవంబర్ 1వరకు రిమాండ్ పొడిగిస్తున్నట్లు చంద్రబాబుతో జడ్జి హిమబిందు చెప్పారు. తాను జెడ్ ప్లస్ భద్రత కల్పించిన వ్యక్తినని, జైలులో కల్పించిన భద్రతకు అనుమానాలున్నాయని చంద్రబాబు తెలిపారు. చంద్రబాబు వ్యక్తం చేసిన అనుమానాలు, సందేహాలను రాతపూర్వకంగా తెలియ చేయాలని న్యాయమూర్తి సూచించారు. వైద్యులు రోజువారీ తనిఖీలు నిర్వహిస్తున్నారా? లేదా? అని ఆరాతీశారు. ఆరోగ్య సమస్యలపై కోర్టు దృష్టికి తీసుకువెళ్లాలని అంశాలు ఉంటే రాతపూర్వకంగా తెలుపవచ్చని చంద్రబాబుకు ఆమె సూచించారు. చంద్రబాబు లేఖను సీల్డ్ కవర్‌లో పంపాలని జైలు అధికారులకు ఆదేశాలిచ్చారు. ఇదిలావుంటే, చంద్రబాబు బెయిల్ పిటిషన్‌పై విచారణ వెకేషన్ బెంచ్‌కు బదిలీ అయింది. బెయిల్ పిటిషన్‌పై విచారణను

- మిగతా 2 లో

రాబోయేది కురుక్షేత్ర

సంగ్రామం

- పేదలు-పెత్తందారుల మధ్య పోరు
- బాబు పాలనంతా దోపిడీయే
- ఎమ్మిగనూరు సభలో సీఎం వైఎస్ జగన్
- 'జగనన్న చేదోడు' నిధుల విడుదల

విశాలాంధ్ర–ఎమ్మిగనూరు: రాబోయే ఎన్నికలు కురుక్షేత్ర సంగ్రామమని... పేదలకు పెత్తందారుల మధ్య పోరు జరగనుందని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహరెడ్డి పేర్కొన్నారు. గురువారం

- మిగతా 2 లో

'కార్పొరేట్'కు దసరా సెలవులు లేవా?

- తరగతులు యథాతథం
- ఐఐటి, నీట్ ఫౌండేషన్‌పై దృష్టి
- పది, ఇంటర్ సిలబస్ బోధనలో జాప్యం
- తనిఖీల్లో అధికారుల నిర్లక్ష్యం

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం దసరా సెలవులు ప్రకటించినప్పటికీ చాలా కార్పొరేట్ విద్యాసంస్థలు యథాతథంగా తరగతులు కొనసాగించడం అధికారులకు సవాలుగా మారింది. యేటా పండుగ దినాలు, వేసవి సెలవుల్లోను కార్పొరేట్ విద్యాసంస్థలు పది, ఇంటర్ తరగతి విద్యార్థులకు సెలవులు ఇవ్వడం లేదు. ప్రభుత్వ విద్యాసంస్థలకు సెలవులు ఇస్తుండగా కార్పొరేట్ సంస్థలు మాత్రం దొడ్డిదారిన తరగతులు కొనసాగించడం ఆనవాయితీగా మారింది. ఈనెల 14 నుంచి 24 వరకు రాష్ట్ర ప్రభుత్వం దసరా సెలవులు ప్రకటించింది. ప్రభుత్వ ఆదేశాలను కార్పొరేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు పాటించడం లేదు. సెలవు దినాల్లోనూ బలవంతంగా తరగతులు నిర్వహించడంతో విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురవుతున్నారు. సిలబస్ రివిజన్, వారాంతపు పరీక్షల పేరుతో విద్యార్థులను తరగతులకు రప్పించడం పరిపాటిగా మారింది. వాటితోపాటు సిబ్బంది సమావేశం, కార్యశాల, రిజిస్టర్ వర్కు పేరుతో అదనపు తరగతులు నిర్వహిస్తున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా అన్ని కార్పొరేట్ ప్రైవేటు విద్యాసంస్థల్లోనూ ఇదే దుస్థితి నెలకొనడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనంగా మారింది.

సిలబస్ పేరుతో ప్రత్యేక తరగతులు

పది, ఇంటర్ తరగతులకు సిలబస్ సకాలంలో పూర్తి కావడం లేదనే సాకుతో కార్పొరేట్ విద్యాసంస్థలు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాయి. వాస్తవంగా కార్పొరేట్ విద్యాసంస్థలు పది, ఇంటర్ విద్యార్థులకు ఐఐటీ, నీట్ ఫౌండేషన్ కోర్సులపైనే దృష్టి పెడుతున్నాయి. బోర్డు పరీక్షలకు నెల రోజుల ముందు విద్యార్థులను సన్నద్ధం చేస్తారు. ఆ నెల రోజుల్లోనే ఏడాదికి సరిపడా సిలబస్‌ను ఒకేసారి విద్యార్థులు చదివే దిశగా ఒత్తిడి పెంచుతున్నాయి. మరోవైపు పరీక్షల కోసం ముఖ్యమైన ప్రశ్నలు అంటూ పాఠ్యాంశాల బోధననే విస్మరించాయి. దీంతో గత్యంతరం లేక కార్పొరేట్ యాజమాన్యం సూచించిన ప్రశ్నలను విద్యార్థులు బట్టీపడుతున్నారు. పరీక్షల్లో విజయం సాధించడం, మార్కుల సాధనే కొలబద్ధగా చదవాల్సిన దుస్థితి ఏర్పడింది. ఫలితంగా విద్యార్థులకు సబ్జెక్టుపై పూర్తి అవగాహన కరువవుతోంది. ప్రధానంగా ఇంగ్లీషు,

- మిగతా 2 లో

రేపు గగన్‌యాన్ టీవీ-డీ1 మిషన్

విశాలాంధ్ర–సూళ్లూరుపేట: భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) చేపట్టిన మానవరహిత 'గగన్‌యాన్'కు దశలవారీగా పరీక్షలు నిర్వహిస్తోంది. ఇదే క్రమంలో శనివారం ఉదయం 8 గంటలకు శ్రీహరికోట రాకెట్ ప్రయోగ కేంద్రంలోని మొదటి ప్రయోగ వేదికపై నుంచి టెస్ట్ వెహికల్ (టీవీ)- డి1 మిషన్‌ను చేపడుతుంది. ఇందులో భాగంగా రాకెట్ ద్వారా క్రూ మాడ్యూల్‌ను ప్రయోగించనుంది. 4,520 కిలోల బరువు కలిగిన క్రూ మాడ్యూల్ ప్రయోగం అనంతరం 17 కిమీల ఎత్తు వరకు వెళ్లి అక్కడ నుంచి ప్యారాచూట్లతో శ్రీహరికోటకు సరిగ్గా 10 కిలోమీటర్ల దూరంలో బంగాళాఖాతంలో పడిపోతుంది. నేవీ సాయంతో మాడ్యూల్‌ను తిరిగి వెనక్కు తెస్తారు. భవిషత్‌లో ఇలాంటి మాడ్యూళ్లలో మనుషులను పంపేందుకు, సురక్షిత ల్యాండింగ్‌ను పరీక్షిస్తారు. ఇలాంటి ప్రయోగాలు విజయవంతమైతే అంతరిక్షయానం సులభమవుతుంది.

ఉత్కంఠ!

- 'సెక్షన్ 17ఏ'పై సుప్రీం తీర్పు నేడు
- తీర్పు ఎలా ఉన్నా చరిత్రాత్మకమే
- రాజకీయవర్గాల్లో చర్చనీయాంశం
- టీడీపీ, వైసీపీ నేతల్లో టెన్షన్...టెన్షన్

విశాలాంధ్ర బ్యూరో– అమరావతి: స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో టీడీపీ అధినేత చంద్రబాబు అరెస్ట్ అయ్యేవరకు అవినీతి నిరోధక చట్టంలోని సెక్షన్ 17ఏ గురించి పెద్దగా ఎవరికీ అవగాహన లేదు. చివరకు రాజకీయనేతలు, న్యాయవాదులు, మీడియా మిత్రులకు సైతం దీనిగురించి అంతగా తెలియదు. తెలిసినా దీని ప్రాముఖ్యతను ఎవరూ పట్టించుకోలేదు. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబుని స్కిల్ కేసులో సెప్టెంబరు 9వ తేదీ తెల్లవారుఝామున సీఐడీ పోలీసులు అరెస్ట్ చేసి కోర్టుకు హాజరుపర్చిన తర్వాత 17ఏ సెక్షన్ ఒక్కసారిగా రాష్ట్రంలోనే కాక దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. చంద్రబాబును అరెస్ట్ చేసి విజయవాడలో

- మిగతా 2 లో

ఇదీ లోకం!

గాజాకు మానవతా సాయం

- ఈజిప్టు, ఇజ్రాయిల్ అంగీకారం
- తెరుచుకున్న రాఫా సరిహద్దు
- ఫలించిన అమెరికా దౌత్యం
- బయల్దేరిన 20 ట్రక్కులు
- రష్యా నుంచి 27 టన్నుల ఆహారం

జెరూసలేం/టెల్ అవీవ్: ఇజ్రాయిల్ భీకర దాడులతో పలస్తీనా ప్రజలకు జీవన్మరణ పరిస్థితి నెలకొంది. తాము ఎక్కడికి వెళ్లినా సురక్షితం కాదని వారు వాపోతున్నారు. 13 రోజులుగా జరుగుతున్న యుద్ధం రోజురోజుకు తీవ్రమవుతోంది. తిండితిప్పలు లేక పిల్లలు, పెద్దలు అల్లాడిపోతున్నారు. విద్యుత్, ఇంధనం ఇతరత్ర నిత్యావసరాలు అందక అత్యవసర సేవలు స్తంభించిపోతున్నాయి. ఈ విపత్తుక పరిస్థితుల్లో ఆపన్నహస్తం కోసం గాజా ఎదురుచూస్తోంది. ఈ యుద్ధం సాధ్యమైనంత త్వరగా అంతం కావాలని, ప్రత్యేక పలస్తీనా ఏర్పాటుకు మద్దతిస్తామని చైనా స్పష్టంచేసింది. తాజా పరిస్థితులపై దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. మరోవైపు మానవతా సాయానికి అనుమతివ్వాలని ఇజ్రాయిల్‌కు అంతర్జాతీయ సమాజం విన్నవిస్తోంది. ఇజ్రాయిల్ పర్యటనలో ఉన్న అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ ఇదే అంశమై ఈజిప్టు ప్రధాని సిసీతో చర్చలు జరిపారు. అవి ఫలించాయి. దీంతో గాజాకు మానవతా సాయం పంపేందుకు మార్గం సుగమమైంది. రాఫా సరిహద్దు ద్వారా సహాయ సామాగ్రిని పంపేందుకు ఈజిప్టు అంగీకరించింది. దీంతో 20 ట్రక్కులు బయల్దేరగా శుక్రవారం నుంచి గాజాకు సాయం అందుతుందని అమెరికా, ఈజిప్టు దేశాలు వెల్లడించాయి. రష్యా కూడా 27 టన్నుల ఆహారాన్ని

- మిగతా 2 లో

వైఎస్ఆర్ అవార్డుల ప్రకటన

పురస్కారగ్రహీతల్లో చక్రధర్, హెచ్చార్కే, బేతవోలు, గోపిచంద్, కరణం మల్లీశ్వరి, అట్టాడ, ఇండ్ల తదితరులు

ఇండ్ల రామసుబ్బారెడ్డి

మహెజబీన్

గోపిచంద్

బేతవోలు రామబ్రహ్మం

కరణం మల్లీశ్వరి

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి పేరు మీద అందిస్తున్న వైఎస్సార్ జీవిత సాఫల్య పురస్కారం, వైఎస్సార్ సాఫల్య పురస్కారాలను నవంబరు ఒకటో తేదీన ప్రదానం చేయనున్నట్లు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రకటించింది. ఈ పురస్కారాలకు ఎంపికైన వారి జాబితాను విడుదల చేసింది. వెలగపూడి సచివాలయం పబ్లిసిటీ సెల్‌లో గురువారం రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల కమిషనర్ తుమ్మా విజయ్ కుమార్ రెడ్డి, ఇతర కమిటీ సభ్యులతో కలిసి విజేతల పేర్లను జీవీడీ కృష్ణమోహన్ ప్రకటించారు. వైఎస్సార్ జీవిత సాఫల్య పురస్కారం రూపేణ రూ.10 లక్షల నగదు, వైఎస్సార్ కాంస్య ప్రతిమ, జ్ఞాపిక, ప్రశంసాపత్రం అందజేస్తారు. సాఫల్య పురస్కార గ్రహీతలకు రూ.5 లక్షల నగదుతో పాటు జ్ఞాపిక, ప్రశంసాపత్రం

- మిగతా 2 లో

పశ్చిమాసియాలో సుస్థిరతకు కలిసి పనిచేద్దాం

బీజింగ్: ఇజ్రాయిల్-హమాస్ మధ్య యుద్ధం క్రమంలో పశ్చిమాసియాలో సుస్థిరత కోసం ఈజిప్టుతో కలిసి పనిచేసేందుకు చైనా సిద్ధమని ఆ దేశాధ్యక్షుడు జిన్‌పింగ్ తెలిపారు. ఆయన గురువారం బీజింగ్‌లో ఈజిప్టు ప్రధాని ముస్తఫా మడ్బౌలీని కలిసి తాజా పరిణామాలను చర్చించారు. గాజాను వీడేవారి కోసం మానవతా కారిడార్లు తెరవాలని కోరారు.

ప్రస్తుత హింసకు ముగింపు పలికేందుకు పలస్తీనా విమోచనానికి చైనా మద్దతిస్తుందని జిన్‌పింగ్ నొక్కిచెప్పారు. అదే సమయంలో ఈజిప్టుతో సత్సంబంధాలు, స్నేహాన్ని పెంచుకునేందుకు కట్టుబడి ఉన్నట్లు తెలిపారు. మరింత సహకారాన్ని అందించేందుకు, అంతర్జాతీయ, ప్రాదేశిక సుస్థిరతకు కలిసి కృషి చేద్దామని కోరారు. చైనా, ఈజిప్టు మిత్రదేశాలని జిన్‌పింగ్ చెప్పారు.

ఐక్య లక్ష్యాలతో పరస్పరం విశ్వాసంతో మంచి భాగస్వాముల వలే చేయి చేయి కలిపి అభివృద్ధి, సమ్మిళిత సుస్థిరత సాధన కోసం పనిచేస్తున్నాయని చెప్పారు. ప్రస్తుతం అంతర్జాతీయంగానే కాకుండా ప్రాదేశికంగానూ క్లిష్టమైన పరిస్థితులు ఉన్నాయని, శతాబ్ద కాలంలో జరగనన్నీ పరిణామాలు ఒక్కసారిగా చోటుచేసుకుంటున్నాయని ఆయన అన్నారు. అభివృద్ధి చెందుతున్న దేశాల ఉమ్మడి ప్రయోజనాలతో పాటు అంతర్జాతీయ న్యాయం, పారదర్శకత పరిరక్షణకు కలిసి పనిచేసేందుకు సిద్ధమని జిన్‌పింగ్ నొక్కిచెప్పారు. బ్రిక్స్ సహకార యంత్రాంగంలో భాగమైనందుకు ఈజిప్టుకు శుభాకాంక్షలు తెలిపారు.

ఈజిప్టుకు చైనా హామీ

చైనా, కంబోడియా దౌత్య బంధానికి 65ఏళ్లు

చైనా, కంబోడియా మధ్య దౌత్య బంధానికి 65ఏళ్లు పూర్తి కాగా కంబోడియాతో తమ దేశానిది విడదీయలేని బంధమని జిన్‌పింగ్ అన్నారు. బీజింగ్‌లో బెల్ట్ అండ్ రోడ్ ఫోరం మూడవ అంతర్జాతీయ సహకార సదస్సు క్రమంలో కంబోడియా ప్రధాని హున్ మానెట్‌తో భేటీ అయ్యారు. నవశకం లక్ష్యాలను చర్చించారు. తమ విపణిలోని కంబోడియా ఉత్పత్తులను చైనా స్వాగతిస్తోందని జిన్‌పింగ్ చెప్పారు. కంబోడియాలో పర్యటించాలని చైనా పర్యాటకులను ప్రోత్సహిస్తున్నామన్నారు. హున్ మానెట్ మాట్లాడుతూ చైనాతో దీర్ఘకాల బంధాన్ని, ఆ దేశం అందించిన విలువైన తోడ్పాటును కొనియాడారు. జిన్‌పింగ్ చేపట్టే ప్రాజెక్టుల ద్వారా కంబోడియాకు అనేక రంగాల్లో మంచి అవకాశాలు లభించినట్లు తెలిపారు. అభివృద్ధికి ఆస్కారం కలిగిందన్నారు.

ప్రపంచ శాంతి, అభివృద్ధికి కంబోడియా కట్టుబడి ఉన్నట్లు ఆయన తెలిపారు.

మంగోలియా మాకు సహజ భాగస్వామి: జిన్‌పింగ్

మంగోలియా అధ్యక్షుడు ఉఖ్నా ఖుర్లేసుఖ్‌తో బీజింగ్‌లో జిన్‌పింగ్ భేటీ అయ్యారు. బెల్ట్ అండ్ రోడ్ సహకారంలో మంగోలియా తమకు సహజ భాగస్వామి అని అన్నారు. యూరప్, ఆసియాను అనుసంధానం చేసేలా బెల్ట్ అండ్ రోడ్ సహకారాన్ని వ్యాప్తి చేయడంలో కీలక పాత్రను మంగోలియా పోషిస్తుందని జిన్‌పింగ్ ఆకాంక్షించారు. ఆర్థిక వ్యవస్థను పునరుత్తేజపర్చేడంలో, సరిహద్దు పోర్టుల నిర్మాణాల్లో, రెండు దేశాల మధ్య అనుసంధానాన్ని పెంచుకునేందుకు కొత్త మార్గాల కసరత్తులో చైనా ఎల్లప్పుడు మంగోలియాకు అండగా నిలుస్తుందని జిన్‌పింగ్ హామీనిచ్చారు. త్రైపాక్షిక సహకారాన్ని చైనా, మంగోలియా, రష్యా మధ్య విస్తరించాలని భావిస్తున్నట్లు తెలిపారు. దీనిని మంగోలియా అధ్యక్షుడు స్వాగతించారు. త్రైపాక్షిక సహకార బలోపేతానికి కృషిచేస్తామని చెప్పారు. చైనాతో బహుపాక్షిక సహకారాన్ని పెంచుకోవాలని భావిస్తున్నట్లు తెలిపారు. ఇదే క్రమంలో హరిత, డిజిటల్ ఎకానమీ, లో కార్బన్ రంగాల్లో కుదిరిన ఒప్పందాలపై ఇద్దరు అధినేతలు సంతకాలు చేశారు.

రాబోయేది కురుక్షేత్ర సంగ్రామం

(మొదటిపేజీ తరువాయి)

ఎమ్మిగనూరులో జరిగిన కార్యక్రమంలో జగనన్న చేదోడు పథకానికి సంబంధించిన నిధులను సీఎం బటన్ నొక్కి విడుదల చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన బహిరంగ సభలో మాట్లాడుతూ... 'కౌరవులందరూ ఒక వైపు చేరారు. వారికి ఒక దత్తపుత్రుడూ ఉన్నాడు. వారు చేసింది ఏమి లేదు. అధికారం ఉన్నప్పుడు దోచుకోవడం, దాచుకోవడం తప్ప పేదలకు చేసింది ఏమిలేదు' అని విమర్శించారు. అప్పట్లో గజదొంగల ముఠా రాష్ట్రాన్ని దోచేసిందని... అప్పుడు అభివృద్ధి ఎందుకు జరగలేదో ప్రజలు ఆలోచించాలన్నారు. అప్పుడు ఇప్పుడు అదే రాష్ట్రం, అదే బడ్జెట్ అని, మారింది కేవలం ముఖ్యమంత్రి మాత్రమేనన్నారు. చంద్రబాబు పాలన చూస్తే కుప్పంలో కూడా ఆయన మావాడే అని చెప్పుకునే పరిస్థితి లేదని సీఎం జగన్ అన్నారు. చంద్రబాబు సొంత నియోజకవర్గంలో ఒక్క పేదవాడికి కూడా స్థలం ఇవ్వలేదని... వైసీపీ ప్రభుత్వం కుప్పంలో కొన్ని వేలమంది పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చి... ఇళ్ల నిర్మాణాలు చేపట్టిందన్నారు. 'ఈ రోజు నేను మీ బిడ్డగా మీ అన్నగా మీ తమ్ముడిగా... సగర్వంగా తలెత్తుకుని చెబుతా ఉన్నాను. ఈ 52 నెలల పరిపాలనలో నవరత్నాల్లోని ప్రతీ ఒక్క కార్యక్రమం ద్వారా నా ఎస్సీలను, నా ఎస్టీలను, నా బీసీలను, నా మైనారిటీలను, నా నిరుపేద వర్గాలను చేయి పట్టుకుని నడిపించగలిగాను. వారి జీవిత ప్రయాణంలో తోడుగా ఉండగలిగామని సగర్వంగా, మీ బిడ్డగా చెప్పుకోవడానికి గర్వపడుతన్నాను' అని జగన్ పేర్కొన్నారు. చేతి వృత్తులను నమ్ముకొని చిన్న చిన్న వ్యాపారాలు చేసుకుంటూ జీవనోపాధి పొందుతున్న వారి గురించి గత ప్రభుత్వం ఎప్పుడూ కూడా ఈ ఆలోచన చేయలేదన్నారు. మన ప్రభుత్వం వచ్చాక వారిని ఆదుకునేందుకు చేదోడు, వాహన మిత్ర, స్వయం ఉపాధిని ప్రోత్సహించే అనేక పథకాల ద్వారా తోడుగా నిలుస్తున్నామని సీఎం జగన్ తెలిపారు.

ఎన్నికల మేనిఫెస్టోను అప్పట్లో చంద్రబాబు చెత్తబుట్టలో వేశాడని... కనీసం 10 శాతం కూడా అమలు చేయలేదని ఎద్దేవా చేశారు. అదే వైసీపీ ప్రభుత్వం మేనిఫెస్టోలో 99 శాతం వాగ్దానాలు పూర్తి చేసి ప్రతి గడప వద్దకు మేనిఫెస్టోను తీసుకెళ్లిందన్నారు. చంద్రబాబు పాలనలో రాజధాని భూముల నుంచి స్కిల్ స్కామ్ వరకు... ఫైబర్ గ్రిడ్ నుంచి మద్యం కొనుగోళ్ల వరకు అన్నింటా దోచుకోవటమే అని సీఎం ఆరోపించారు. అదే మీ బిడ్డ ఎటువంటి వివక్ష చూడకుండా 2లక్షల 38 వేల రూపాయిలు ప్రజలకు ఇచ్చాడని అన్నారు. 'రాబోయేది కురుక్షేత్ర సంగ్రామంలో యుద్ధం జరుగబోయేది ఎవరికో తెలుసా... రేపు జరిగేది క్లాస్ వార్...పేదవాడు ఒకవైపు, పెత్తందారు మరోవైపు ఉండే యుద్ధం జరుగబోతోంది. వీరి మాదిరిగా మీ బిడ్డకు ఎల్లో మీడియా సపోర్టుగా లేవు, వీళ్ల మాదిరిగా దత్తపుత్రుడి అండ, తోడు ఉండదు. ఆలోచన చేయండి' అని సీఎం జగన్ ప్రజలను కోరారు. రేపు జరుగబోయే కురుక్షేత్ర సంగ్రామంలో కౌరవులందరూ ఏకమవుతారని...తోడేళ్లన్ని ఏకమవుతాయని, కానీ మీ బిడ్డ కోరుకునేది పైన దేవుడి దయ, మీ చల్లని దీవెనలు మాత్రమే అని సీఎం పునరుద్ఘాటించారు. రేపు జరుగబోయే కురుక్షేత్రంలో ఓటువేసేందుకు వెళ్తున్నప్పుడు ఒక్కటే ఒక్కటి కొలమానంగా తీసుకోవాలని... మీకు మంచి జరిగితే మీ బిడ్డకు మీరే సైనికులుగా నిలబడాలని జగన్ అన్నారు. చేదోడు పథకం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా 3,25,020 మంది అర్హులైన రజక, నాయీ బ్రాహ్మణ, టైలర్ అన్నదమ్ములు, అక్కచెల్లెమ్మలకు రూ.325.02 కోట్ల ఆర్థిక సాయాన్ని బటన్ నొక్కి నేరుగా వారి ఖాతాల్లో జమ చేసినట్లు సీఎం జగన్ ప్రకటించారు. ఏటా రూ.10 వేల ఆర్థికసాయం చేస్తూ ఈ నాలుగేళ్లలో ఈ పథకానికి రూ.1,252.52 కోట్లు ఖర్చు చేశామని సీఎం తెలిపారు. ఈ కార్యక్రమంలో మంత్రులు బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి, గుమ్మనూరు జయరాం, ఎమ్మెల్యేలు చెన్నకేశవరెడ్డి, వై.బాలనాగిరెడ్డి, సాయిప్రసాద్‌రెడ్డి, హాఫీజ్‌ఖాన్, మేయర్ బీవై రామయ్య, ఎమ్మెల్సీలు సునీత, మధుసూదన్, వై రుద్రాగౌడ్, జిల్లా కలెక్టర్ సృజన, ఇతర అధికారులు, వైసీపీ నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

చంద్రబాబు రిమాండ్ పొడిగింపు

(మొదటిపేజీ తరువాయి)

వెకేషన్ బెంచ్‌కు బదిలీ చేయాలని చంద్రబాబు తరపు న్యాయవాదులు కోరగా కోర్టు అంగీకరించింది. దసరా సెలవుల్లో హైకోర్టు వెకేషన్ బెంచ్ ఈ కేసు విచారణ చేపట్టనుంది. చంద్రబాబు బెయిల్ పిటిషన్‌పై హైకోర్టులో విచారించింది. చంద్రబాబు ఆరోగ్య పరిస్థితి దృష్ట్యా మధ్యంతర బెయిల్ ఇవ్వాలని ఆయన తరపు న్యాయవాది సిద్ధార్థ లూథ్రా కోరారు. ఈ కేసులో ఇతర నిందితులు బెయిల్‌పై ఉన్నారని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. 40 రోజులుగా దర్యాప్తులో ఎలాంటి పురోగతి లేదన్నారు. చంద్రబాబు ఆరోగ్యంపై తాజా పరిస్థితి తెలుసుకునేందుకు మధ్యాహ్నం వరకు సమయం ఇవ్వాలని కోర్టును ఏఏజీ కోరారు. దీంతో మధ్యాహ్నం మరోసారి వాదనలు విన్న ధర్మాసనం.. విచారణను వెకేషన్ బెంచ్‌కు బదిలీ చేస్తూ ఆదేశాలు జారీ చేసింది. చంద్రబాబు ఆరోగ్య పరిస్థితిపై హైకోర్టులో ఐఏ పిటిషన్ దాఖలైంది. ఐఏ పిటిషన్‌పైనా విచారణను వెకేషన్ బెంచ్ చేపడుతుందని జడ్జి తెలిపారు. చంద్రబాబు ఆరోగ్య నివేదికను వెకేషన్ బెంచ్‌కు వెంటనే ఇవ్వాలని రాజమహేంద్రవరం జైలు అధికారులను ఆదేశించారు.

వలస బాట

(మొదటిపేజీ తరువాయి)

ముఖ్యంగా రాష్ట్రప్రభుత్వం హంద్రీనీవా ద్వారా 106 చెరువులకు నీరు నింపడంతోపాటు, గుండ్రేవుల, వేదవతి, ఆర్డీఎస్ ప్రాజెక్టును పూర్తి చేయడం ఒక్కటే మార్గం. సీపీఐ, ఏపీ రైతుసంఘం అధ్వర్యంలో పెండింగ్ ప్రాజెక్టులు పూర్తిచేయాలని పాలకులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా ఏమాత్రం ప్రయోజనం లేకుండా పోయింది.

ఈ సారి జిల్లాలో ఏర్పడిన తీవ్ర వర్షాభావ పరిస్థితుల వల్ల పెద్ద సంఖ్యలో వలసలు పోవడమే కాకుండా గ్రామాలు ఖాళీ అయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ప్రభుత్వం వెంటనే కర్నూలు జిల్లాను కరువు ప్రాంతంగా ప్రకటించడమే కాకుండా వలసల నివారణకు వెంటనే ఉపాధి హామీ పథకం పనులు ప్రారంభించి వలసలను అరికట్టాల్సిన అవసరం ఉంది.

ఇంటి నిర్మాణానికి రూ.లక్షన్నర లంచం

ఏసీబీకి చిక్కిన టౌన్‌ప్లానింగ్ సూపర్‌వైజర్

విశాలాంధ్ర-హైదరాబాద్: హైదరాబాద్, సరూర్‌నగర్‌లోని జీహెచ్ఎంసీ సర్కిల్ కార్యాలయంలో అవినీతి నిరోధక శాఖ అధికారులు దాడులు నిర్వహించారు. ఓ వ్యక్తి నుంచి రూ.1.50 లక్షలు లంచం తీసుకుంటుండగా హయత్‌నగర్ సర్కిల్ టౌన్‌ప్లానింగ్ సూపర్‌వైజర్ ఉమతో పాటు పొరుగు సేవల ఉద్యోగి లక్ష్మణ్‌ను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. కొద్దిరోజుల క్రితం గుర్రంగూడకు చెందిన సుధాకర్‌రెడ్డి తన ఇంటి నిర్మాణం కోసం టౌన్‌ప్లానింగ్ సూపర్‌వైజర్ ఉమను కలిశారు. అనుమతి ఇచ్చేందుకు లక్షన్నర రూపాయలు ఇవ్వాలని ఆమె డిమాండ్ చేశారు. అందుకు ఇష్టపడని బాధితుడు సుధాకర్‌రెడ్డి ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. దీంతో అధికారులు ప్రణాళిక ప్రకారం గురువారం ఉమ, లక్ష్మణ్‌ను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఈ మేరకు వివరాలను ఏసీబీ డీఎస్పీ మాజిద్ అలీ వెల్లడించారు.

ఉత్కంఠ!

(మొదటిపేజీ తరువాయి)

ఏసీబీ కోర్టుకు హాజరుపర్చిన తర్వాత ఆయన తరపు న్యాయవాదులు చంద్రబాబుకు బెయిల్ అడగకుండా సెక్షన్ 17ఏను తెరపైకి తెచ్చారు. దీని ప్రకారం గవర్నర్ అనుమతి లేకుండా మాజీ ముఖ్యమంత్రిని అరెస్ట్ చేయడమే తప్పు అని వాదించారు. ఏసీబీ కోర్టు చంద్రబాబుకి రిమాండ్ విధించిన అనంతరం హైకోర్టులో క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. అక్కడ తిరస్కరణకు గురి కావడంతో సుప్రీంను ఆశ్రయించారు. చంద్రబాబు క్వాష్ పిటిషన్‌పై సుప్రీంకోర్టులో జస్టిస్ అనిరుద్ధ బోస్, జస్టిస్ బేలా ఎం.త్రివేదితో కూడిన ద్విసభ్య ధర్మాసనం సుదీర్ఘ విచారణ చేపట్టింది. చంద్రబాబు తరపున సీనియర్ న్యాయవాదులు సిద్ధార్థ లూథ్రా, హరీశ్ సాల్వే... సీఐడీ తరపున ముకుల్ రోహత్గీ వాదనలు బలంగా వినిపించారు. రెండుపక్షాల వాదనలు మొత్తం చంద్రబాబు అరెస్ట్‌లో 17ఏ వర్తింపుపైనే కొనసాగాయి. చంద్రబాబు కేసులో 17ఏ తప్పకుండా వర్తిస్తుందని సాల్వే,లూథ్రా వాదించారు. స్కిల్ వ్యవహారంపై ప్రాథమిక దర్యాప్తు కోసం 2021 సెప్టెంబరు 7వ తేదీన ఏపీఎస్ఎస్‌డీసీ చైర్మన్ సీఐడీ డీజీకి లేఖ రాశారని, అప్పటికే ఆయన మాజీ ముఖ్యమంత్రి అయినందున చట్టం వర్తిస్తుందని, అందుకు గతంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులను ఉటంకించారు. ముకుల్ రోహత్గీ వాదిస్తూ ఈ సెక్షన్ 2018 జులైలో వచ్చిందని, 2021లో ఎఫ్ఐఆర్ నమోదైనప్పటికీ ఈ వ్యవహారంలో అవినీతిపై దర్యాప్తు చేపట్టాలని 2018 జూన్‌లోనే ఏసీబీ డీజీకి లేఖ వచ్చిందని తెలిపారు. ఆ సమయంలో 17 (ఏ) ఉనికిలో లేదన్నారు. అందువల్ల ఈ కేసులో సెక్షన్ 17 (ఏ) ఉత్పన్నమే కాదని రోహత్గీ వాదించారు. రెండు పక్షాల న్యాయవాదులు సీనియర్‌లు కావడంతో వాదనలు ఆసక్తికరంగా, వాడివేడిగా సాగాయి. అక్టోబరు 3న సుప్రీంకోర్టులో క్వాష్ పిటిషన్‌పై విచారణ ప్రారంభించగా, ఈనెల 17న వాదనలు ముగిశాయి. తీర్పు రిజర్వు చేసిన అత్యున్నత న్యాయస్థానం దీనిపై ఈనెల 20వ తేదీ తుది తీర్పు వెల్లడిస్తామని ప్రకటించింది. దీంతో ఈ తీర్పుపై ప్రజల్లో, ముఖ్యంగా రాజకీయవర్గాల్లో తీవ్ర ఆసక్తి నెలకొంది. ఈ తీర్పు చరిత్రాత్మకం కానుంది. ఇప్పటివరకు దేశవ్యాప్తంగా వచ్చిన సంచలనాత్మక తీర్పుల్లో ఇది కూడా రికార్డుల్లో నమోదయ్యే అవకాశం ఉంది. ప్రస్తుతం దేశవ్యాప్తంగా రాజకీయ కక్షసాధింపు చర్యలు పతాకస్థాయికి చేరిన నేపథ్యంలో ఈ తీర్పు రాజకీయ ప్రముఖుల భవిష్యత్తుకు కీలకం కానుంది. చంద్రబాబు అరెస్ట్ విషయంలో ఈ సెక్షన్ వర్తిస్తుందని కోర్టు తీర్పు వెలువడితే ....దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లోని ప్రస్తుతం అధికార, ప్రతిపక్షస్థానాల్లో ఉండే సీఎం, మాజీ సీఎంలందరికీ 17 (ఏ) రక్షణ కవచంగా మారనుంది. లేనిపక్షంలో చంద్రబాబుపై పెట్టిన కేసుల ఆధారంగా ప్రతి రాష్ట్రంలోనూ రాజకీయ కక్ష సాధింపు కోసం అధికారంలో ఉన్నవారు ప్రతిపక్ష నేతలపై ఏదో ఒక అభియోగంతో కేసు బనాయించి జైళ్లలో నిర్బంధించే పరిస్థితులు తీవ్రమయ్యే ప్రమాదం ఉంది. అందుకే ఈ తీర్పు కోసం అన్ని రాజకీయపార్టీలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నాయి. ఇక ఏపీలో సుప్రీం తీర్పు చంద్రబాబుకి అనుకూలంగా వస్తుందో, వ్యతిరేకంగా వస్తుందోనని అధికార, ప్రతిపక్షపార్టీ శ్రేణుల్లో నరాలు తెగే ఉత్కంఠ నెలకొంది. చంద్రబాబును అరెస్ట్ చేసిన తర్వాతే ఆయనపై ఇన్నర్‌రింగ్ రోడ్డు అలైన్‌మెంట్‌లో అక్రమాలకు పాల్పడ్డారని, ఫైబర్ గ్రిడ్ ప్రాజెక్టులో అక్రమాలు చోటుచేసుకున్నాయని మరో రెండు కేసులు బనాయించారు. ఇవిగాక అమరావతి రాజధాని ప్రాంతంలో అసైన్డ్ భూముల కేసును రీ ఓపెన్ చేశారు. అందువల్ల సుప్రీంకోర్టు తీర్పు చంద్రబాబు విషయంలో అత్యంత కీలకం కానుంది. చంద్రబాబుకి అనుకూలంగా తీర్పు వచ్చిన పక్షంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి దూకుడుకు కళ్లెం పడుతుంది.

చంద్రబాబు అరెస్ట్ విషయంలో 17ఏ వర్తించదని తీర్పు వచ్చిన పక్షంలో ఆయనపై మరిన్ని కేసులు బనాయించి 2024 ఎన్నికలయ్యే వరకు జైలుకే పరిమితం చేసే అవకాశాలున్నాయని టీడీపీ శ్రేణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న వేళ ఈ కేసులో తీర్పు అనుకూలంగా వస్తే వైసీపీ ప్రభుత్వ అరాచకాలను ప్రజల్లో మరింత తీవ్రస్థాయిలో ఎండగట్టవచ్చని టీడీపీ నేతలు, చంద్రబాబుకి వ్యతిరేకంగా తీర్పు వస్తే వైసీపీ విజయం స్వీప్ అవుతుందని అధికారపార్టీ నేతలు రకరకాల విశ్లేషణలతో చర్చించుకుంటున్నారు.

గాజాకు మానవతా సాయం

(మొదటిపేజీ తరువాయి)

గాజా స్ట్రిప్‌లోని బాధితుల కోసం ఈజిప్టుకు చేర్చింది. మానవతా సాయం కేవలం గాజా ప్రజల కోసమే దీనిని అపహరించేందుకు హమాస్ ప్రయత్నిస్తే వెంటనే ఆపేస్తామని కూడా అమెరికా, ఈజిప్టు దేశాలు స్పష్టంచేశాయి. సహాయ సామాగ్రితో ట్రక్కులు ప్రయాణించేందుకు వీలుగా రోడ్డుకు మరమ్మతులు అవసరమని, ఇజ్రాయిల్ దాడుల్లో అది ధ్వంసమైందని ఓ అధికారి తెలిపారు. మూడువేల టన్నుల కంటే ఎక్కువ సామాగ్రితో 200కుపైగా ట్రక్కులు సరిహద్దు వద్ద బారులు తీరినట్లు చెప్పారు.

అందుకే ఒప్పుకున్నాం: ఇజ్రాయిల్

బైడెన్ విజ్ఞప్తి మేరకు మానవతా సాయానికి అనుమతించినట్లు ఇజ్రాయిల్ ప్రకటించింది. ఈజిప్టు నుంచి ఆహారం, తాగునీరు, మందులు వంటివి హమాస్‌కు చేరనంత వరకు దక్షిణ గాజా ప్రజలకు సరఫరా చేయొచ్చని, వాటిని అడ్డుకోబోమని నెతన్యాహు కార్యాలయం తెలిపింది. జో బైడెన్ ఇప్పటికే గాజాకు మానవతా సాయంగా 100 మిలియన్ డాలర్లు ప్రకటించారు. సరిహద్దులు తెరిపించడానికి ఈజిప్టు అధ్యక్షుడు అబ్దెల్ ఫతా అల్ సిసీతో చర్చలు జరిపారు. రాఫా కాసింగ్ తెరిచేందుకు సిసీ అంగీకరించారు. రష్యా కూడా తమ వంతుగా 27 టన్నుల సామాగ్రిని గాజా స్ట్రిప్‌లోని పౌరుల కోసం ఈజిప్టుకు పంపిందని మాస్కో అత్యవసర సేవల శాఖ వెల్లడించింది. 'మాస్కో దగ్గరున్న రామేన్స్‌కోయే విమానాశ్రయం నుంచి ప్రత్యేక విమానం ఈజిప్టులోని ఎల్ అరిష్‌కు బయల్దేరి వెళ్లింది. రష్యా మానవతా సాయాన్ని గాజా స్ట్రిప్‌కు చేరవేసేందుకు ఈజిప్టు రెడ్ క్రెసెంట్‌కు అందజేస్తారు. గోదుములు, పంచదారు, బియ్యం, పాస్తా పంపినట్లు మంత్రి ఇల్యా డెనిసోవ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మరోవైపు మానవతా సాయంతో వందలాది ట్రక్కులు రాఫా సరిహద్దు వద్ద బారులు తీరాయి.

మేమెక్కడా సురక్షితం కాదు: పలస్తీనా ప్రజల ఆవేదన

హమాస్‌పై ఇజ్రాయిల్ ప్రతీకార దాడులతో గాజా నగరం పూర్తిగా ధ్వంసమైపోతోంది. ఎటుచూసినా శిధిలాలు, శవాలు కనిపిస్తున్నాయి. లక్షలాది మంది నిరాశ్రయులుగా మారారు. తమకు ఎక్కడ రక్షణ లేదని పలస్తీనా ప్రజలు వాపోతున్నారు. ఇజ్రాయిల్ వైమానిక దాడులతో విరుచుకుపడుతుండగా సురక్షిత ప్రాంతమన్నది ఏమీలేదన్నారు. రక్షిత జోన్లులుగా దక్షిణ గాజా ప్రాంతాలను ఇజ్రాయిల్ సైన్యం ప్రకటించింది కానీ అక్కడ కూడా భీకరంగా దాడులు చేస్తోంది. సెంట్రల్ గాజాలో నాలుగు నిర్వాసిత భవనాలు వైమానిక దాడుల్లో ధ్వంసమయ్యాయి. దక్షిణ గాజాలో ఇజ్రాయిల్ దాడి చేయగా తొమ్మిది మంది పెద్దలు, ఏడుగురు చిన్నారులు ప్రాణాలు కోల్పోయారు.

ఇప్పటికే 1,524 మంది చిన్నారుల మృతి

దక్షిణ గాజాపై ఇజ్రాయిల్ దాడులు కొనసాగుతున్నాయి. గురువారం రాఫా సరిహద్దు సమీపంలో జరిగిన వైమానిక దాడిలో కనీసం 30 మంది చనిపోగా 21 మందికి గాయాలయ్యాయని నాసర్ ఆసుపత్రి వైద్య సిబ్బంది వెల్లడించారు. గాజా స్ట్రిప్‌లో మరణాలపై యూరోపియన్ గాజా ఆసుపత్రి డైరెక్టర్ యూసుఫ్ అల్ అక్కడ్ తీవ్ర ఆవేదన వ్యక్తంచేశారు. చిన్నారుల మృతదేహాలను చూపుతూ వీరి చంపుతున్నది ఎవరు? స్వేచ్ఛ ప్రపంచం ఎక్కడ ఉంది? ఇంతలా దాడులు, మారణహోమం జరుగుతుంటే ఎవరూ స్పందించరేం? అంటూ భావోద్వేగానికి గురయ్యారు. మరోవైపు దక్షిణ లెబనాన్‌లోని హిజ్బుల్లా స్థావరాలపై ఇజ్రాయిల్ దాడులలో ఇద్దరు చనిపోయారు. వెస్ట్‌బ్యాంకులో ఐదురుగు పలస్తీనీయన్లు ప్రాణాలు కోల్పోయారు. ఖాన్ యూనిస్ నగరంలో కనీసం 12 మంది చనిపోగా 40 మంది గాయపడ్డారు. దక్షిణ గాజాలో 20 లక్షల మంది ఉన్నారు. యుద్ధంలో ఇప్పటికే 3,785 మంది ప్రాణాలు కోల్పోగా వీరిలో 1524 మంది చిన్నారులు, వెయ్యి మంది మహిళలు ఉన్నట్లు పలస్తీనా ఆరోగ్యశాఖ తెలిపింది. 12వేల మంది గాయపడ్డారని పేర్కొంది. ఇజ్రాయిల్‌లో 1300 మంది చనిపోగా, 203 మంది హమాస్ అధీనంలో ఉన్నట్లు ఇజ్రాయిల్ సైన్యం తెలిపింది. గాజాపై బాంబు దాడుల్లో గాయపడిన వారికి చికిత్స చేయలేని పరిస్థితులు ఉన్నాయని వైద్యులు వాపోయారు. మందులు లేక వెనిగర్‌తో గాయాలను శుభ్రం చేయాల్సి వస్తోందని చెప్పారు.

ఐరాసలో వీగిపోయిన బ్రెజిల్ తీర్మానం

ఇజ్రాయిల్, హమాస్ యుద్ధం క్రమంలో మానవతా కారిడార్ ఏర్పాటు కోసం బ్రెజిల్ తీర్మానాన్ని ఐక్యరాజ్య సమితి భద్రతా మండలి తిరస్కరించింది. 15 మంది సభ్యులు సమావేశమై ఈ తీర్మానంపై చర్చించారు. ఓటింగ్ నిర్వహించగా 12 ఓట్లు మాత్రమే అనుకూలంగా వచ్చాయి. ఈ తీర్మానాన్ని అమెరికా వ్యతిరేకించింది. వీటో చేసింది. బ్రిటన్, రష్యా గైర్హాజరు కాగా తీర్మానం వీగిపోయింది. శాశ్వత సభ్య దేశాల్లో ఒక దేశం వ్యతిరేకించినా తీర్మానం వీగిపోతుంది. దీనిపై చైనాకు అమెరికా దౌత్యాధికారి జాంగ్ జున్ స్పందిస్తూ అమెరికాకు నిందించారు. ఈ విధంగా ఓటింగ్ జరుగుతుందన్నది ఊహించలేదన్నారు.

కరువు కరాళ నృత్యం

(మొదటిపేజీ తరువాయి)

వేరుశెనగ సాగుచేసినా వర్షాలు లేక పంటలు ఎండిపోయాయన్నారు. అనంతపురం జిల్లా రాప్తాడు మండలం హంపాపురం, రామనేపల్లి గ్రామాల్లో ఎండిన పంటలను రామకృష్ణ బృందం గురువారం పరిశీలించింది. రామకృష్ణ వెంట సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు డి.జగదీశ్, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లా కార్యదర్శులు సి.జాఫర్, వేమయ్యయాదవ్, సహాయ కార్యదర్శి సి.మల్లికార్జున తదితరులు ఉన్నారు. అనంతపురం, నంద్యాల జిల్లాల్లో ఎండిన పంటలను సీపీఐ బృందం పరిశీలించింది. రైతుల సాధకబాధకాలు ఆలకించింది. అనంతరం రామకృష్ణ విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 680 మండలాలు ఉండగా దాదాపు 300 మండలాల్లో లోటు వర్షపాతం నమోదైందని చెప్పారు. వర్షాలు లేక పంటలు ఎండి రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. రైతులు ఆర్థికంగా దివాలా తీశారని, ఇతర ప్రాంతాలకు వలస వెళ్లడానికి సిద్ధంగా ఉన్నారని రామకృష్ణ తెలిపారు. ముఖ్యమంత్రి జగన్, మంత్రులు, ఎమ్మెల్యేలు క్షేత్రస్థాయిలో పర్యటించి...రైతులకు కనీసం భరోసా కల్పించడం లేదన్నారు. స్థానిక ఎమ్మెల్యేలు సైతం పంటలు పరిశీలించడం లేదని ఆరోపించారు. పంటనష్టం అంచనా వేయాలన్న ఆలోచన ప్రభుత్వానికి రాకపోవడం దారుణమని విమర్శించారు. ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదు...అధికారులు అంతకన్నా సోమరుల్లా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వెలిబుచ్చారు. పల్లె ప్రజలు, రైతులు, వ్యవసాయ కూలీలపై కొంచెమైనా గౌరవం కనిపించడం లేదన్నారు. అనంతపురం, ఇతర రాయలసీమ జిల్లాల్లో వేరుశనగ సాగు ఎక్కువని, వానలు లేక పంటలు పూర్తిగా ఎండిపోయాయన్నారు. ఎకరాకు రూ.50 వేలు పెట్టుబడి పెట్టినట్లు రైతులు చెబుతున్నారని, ఆ పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేదని వివరించారు. కొన్నిచోట్ల పంటను అర్ధాంతరంగా తొలగించడం బాధేస్తోందని రామకృష్ణ చెప్పారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో 1.30 లక్షల ఎకరాల్లో సాగు చేయలేదన్నారు. పంటనష్టపోయిన రైతులు అల్లాడిపోతున్నారన్నారు. పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.30 వేల చొప్పున పరిహారం ఇవ్వాలని, సొసైటీలు, బ్యాంకుల ద్వారా తీసుకున్న రుణాలు మాఫీ చేయాలని రామకృష్ణ డిమాండ్ చేశారు. ఉపాధి హామీ పథకం కింద పనులు కల్పించకపోవడం దారుణమన్నారు. గ్రామాల్లో 200 రోజుల పాటు ఉపాధి కూలీలకు పనులు కల్పించాలన్నారు. వ్యవసాయ అధికారులతో సీఎం జగన్ సమీక్ష చేయాలని, అవసరమైతే కేంద్ర బృందాలను రాష్ట్రానికి తీసుకొచ్చి జాతీయ విపత్తుగా ప్రకటించేలా చర్యలు చేపట్టాలన్నారు. ఆయకట్టు ప్రాంతాల్లోనూ నీరు లేక సాగు నిలిచిపోయిందన్నారు. తుంగభద్ర, శ్రీశైలం, నాగార్జునసాగర్ డ్యామ్‌లలో నీరు లేకపోవడమే దీనికి కారణమన్నారు. పాలకులు రైతు సమస్యలను పక్కనపెట్టి దొంగ ఓట్లు చేర్పించుకునే పనిలో నిమగ్నమయ్యారని ఆరోపించారు. ప్రత్యర్థులపై కేసులు బనాయించి...జైలుకు పంపడమే జగన్ ప్రభుత్వం పనిగా పెట్టుకుందని వ్యాఖ్యానించారు. విద్యుత్ సైతం రైతుకు అందుబాటులో లేదన్నారు. రాష్ట్రవ్యాప్తంగా పర్యటించిన తర్వాత ఈనెల 27, 28 తేదీల్లో విజయవాడలో అన్ని రాజకీయ పార్టీలను, రైతు సంఘాలను కలుపుకొని భవిష్యత్తు కార్యాచరణ రూపొందిస్తామన్నారు. సీఎం జగన్ ఇప్పటికే విలువైన కాలాన్ని వృథా చేశారన్నారు. రైతులను ఆదుకోకపోతే తాడేపల్లి ప్యాలెస్ నుంచి బయటకు వచ్చేలా చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి పీట్ల రామకృష్ణ, జిల్లా కార్యవర్గ సభ్యులు గోపాల్, సాకే నాగరాజు, మహాదేవ, మండల కార్యదర్శులు రవీంద్ర, రమేశ్, సనప రామకృష్ణ, సహాయ కార్యదర్శులు చలపతి వీరనారప్ప, రైతుసంఘం నాయకులు హంపాపురం నాగరాజు, గిరిజన సమాఖ్య నాయకులు వైఎల్ రామాంజనేయులు, సీపీఐ నాయకులు మహమ్మద్ రఫీ, చౌడప్ప, నారాయణస్వామి, అక్కులప్ప, హరీశ్ పాల్గొన్నారు.

వైఎస్ఆర్ అవార్డుల ప్రకటన

(మొదటిపేజీ తరువాయి)

ఇస్తారు. ఆంధ్రప్రదేశ్ వతరణ దినోత్సవం సందర్భంగా నవంబర్ 1న అవార్డులను ప్రదానం చేస్తారు. సామాన్యుల్లో అసామాన్యులకు, వివిధ రంగాల్లో సమాజానికి విశిష్ట సేవలందించి తమదైన ముద్రవేసిన వారికి సాఫల్య పురస్కారాలతో సన్మానిస్తారు. ఈ అవార్డులను వరుసగా మూడవ సంవత్సరం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అందజేయనుంది. అవార్డుల కమిటీలో సభ్యులుగా సజ్జల రామకృష్ణారెడ్డి, దేవులపల్లి అమర్, జీవీడీ కృష్ణమోహన్, ముఖ్యమంత్రి రాజకీయ కార్యదర్శి ముత్యాల రాజు, ఐ&పీఆర్ కమిషనర్ తుమ్మా విజయ్‌కుమార్ రెడ్డి, వివిధ శాఖల ప్రధాన కార్యదర్శులు ఉన్నారు. ఈ అవార్డుల కోసం తమకు తాముగా దరఖాస్తు చేసుకున్న వారితో పాటు కలెక్టర్లు, జిల్లా యంత్రాంగం ద్వారా వచ్చిన నామినేషన్లను కమిటీ క్షుణ్ణంగా పరిశీలించి, అర్హులను ఎంపిక చేస్తుంది. ఈ ఏడాది మొత్తం 27 అవార్డులు ప్రదానం చేయనున్నారు. ఇందులో 23 జీవిత సాఫల్య పురస్కారాలు కాగా నాలుగు సాఫల్య పురస్కారాలు ఉన్నాయి.

అప్పలనాయుడు

హెచ్ఆర్‌కే

ఖదీర్ బాబు

శివాజీ

పురస్కార గ్రహీతల వివరాలు

వ్యవసాయం:

1) పంగి వినీత (అచీవ్‌మెంట్ అవార్డు), 2) వైవీ మల్లారెడ్డి- అనంతపురం

ఆర్ట్ అండ్ కల్చర్:

1) యడ్ల గోపాలరావు- రంగస్థల కళాకారుడు (శ్రీకాకుళం)
2) తలిసెట్టి మోహన్- కలంకారీ (తిరుపతి)
3) కోట సచ్చిదానంద శాస్త్రి- హరికథ (బాపట్ల)
4) కోన సన్యాసి- తప్పెటగుళ్ళు (శ్రీకాకుళం)
5) ఉప్పాడ హ్యాండ్‌లూమ్ వీవర్స్ కోఆపరేటివ్ సొసైటీ-కాకినాడ
6) ఎస్.వి.రామారావు- చిత్రకారుడు (కృష్ణా)
7) రావు బాల సరస్వతి- నేపథ్య గాయని (నెల్లూరు)
8) తల్లావఝుల శివాజీ- చిత్రకారుడు, రచయిత, పాత్రికేయుడు (ప్రకాశం)
9) చింగిచెర్ల కృష్ణారెడ్డి- జానపద కళలు (అనంతపురం)
10) కలీసాహెబీ మహబూబ్-షేక్ మహబూబ్ సుబానీ దంపతులకు - నాదస్వరం (ప్రకాశం)

తెలుగు భాష-సాహిత్యం:

1) ప్రొఫెసర్ బేతవోలు రామబ్రహ్మం- పశ్చిమ గోదావరి
2) ఖదీర్ బాబు- నెల్లూరు- (అచీవ్‌మెంట్ అవార్డు)
3) మహెజబీన్- నెల్లూరు (అచీవ్‌మెంట్ అవార్డు)
4) నామిని సుబ్రహ్మణ్యం నాయుడు- చిత్తూరు
5) అట్టాడ అప్పలనాయుడు- శ్రీకాకుళం

క్రీడలు:

1) పుల్లెల గోపీచంద్- గుంటూరు, 2) కరణం మల్లీశ్వరి- శ్రీకాకుళం

వైద్యం:

1) ఇండ్ల రామ సుబ్బారెడ్డి-మానసిక వైద్యం (ఎన్టీఆర్)
2) ఈసీ వినయ్‌కుమార్‌రెడ్డి-ఈఎన్‌టీ- కాక్లియర్ ఇంప్లాంట్స్ (వైఎస్సార్)

మీడియా:

1) గోవిందరాజు చక్రధర్- కృష్ణా, 2) హెచ్చార్కే-కర్నూలు

సమాజ సేవ: 1) బెజవాడ విల్సన్- ఎన్టీఆర్,
2) శ్యాం మోహన్- అంబేద్కర్ కోనసీమ (అచీవ్‌మెంట్)
3) నిర్మల హృదయ్ భవన్- ఎన్టీఆర్,
4) జి. సమరం- ఎన్టీఆర్

దసరా సెలవులు లేవా?

(మొదటిపేజీ తరువాయి)

తెలుగు సబ్జెక్టులపై విద్యార్థులు పట్టుకోల్పోతున్నారు.

ఐఐటీ ఫౌండేషన్‌లో భాగంగా లెక్కలు, సైన్స్ సబ్జెక్టులపై కార్పొరేట్ విద్యాసంస్థలు దృష్టి పెట్టడం వల్ల ఇలాంటి పరిస్థితులు ఉత్పన్నమవుతున్నాయి. దీంతో భాషా సబ్జెక్టులపై విద్యార్థులు పట్టుకోల్పోతున్నారు. అక్కడి పుస్తకాలు, సిలబస్ వేరుగా ఉండటం, వాటి ఆధారంగానే విద్యా సంవత్సరం ఆరంభం నుంచి విద్యార్థులకు బోధించడం వల్ల చదువులు గందరగోళంగా మారాయి. రెండేళ్ల క్రితం పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో ఇంగ్లీషు, తెలుగు, హిందీ, సోషల్ సబ్జెక్టుల్లో చాలామంది విద్యార్థులు మాస్ కాపీయింగ్‌కు పాల్పడిన సంఘటనలు వెలుగుచూశాయి. ఇందులో కొంతమంది ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయులు కీలకపాత్ర వహించిన విషయం విదితమే. దానిపై ఓ ప్రైవేటు విద్యాసంస్థల అధినేత సైతం ఇప్పటివరకు కేసులు ఎదుర్కొంటున్నారు. పదో తరగతి, ఇంటర్మీడియట్ బోర్డు సిలబస్ ఆధారంగా కార్పొరేట్, ప్రైవేటు విద్యాసంస్థల్లో ఎక్కడా బోధన కొనసాగడం లేదు. పరీక్షల సిలబస్ బోధనా తీరుపై విద్యాశాఖ ఉన్నతాధికారులు తనిఖీలు నిర్వహించడంలో విఫలమైనట్లు విమర్శలున్నాయి ఇప్పటికైనా విద్యాశాఖ అధికారులు స్పందించి దసరా సెలవుల్లో తరగతులు కొనసాగిస్తున్న కార్పొరేట్ విద్యాసంస్థల్లో తనిఖీలు నిర్వహించి...యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

విజయవాడలోనే కేఆర్ఎంబీ కార్యాలయం

- ఆంధ్ర రైతుల నీటి హక్కులను కాపాడాలి
- కేంద్రానికి సాగునీటి వినియోగదారుల సమాఖ్య వినతి

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్): కృష్ణానదీ యాజమాన్య బోర్డు కార్యాలయా(కేఆర్ఎంబీ)న్ని విజయవాడలోనే ఏర్పాటు చేసి ఆంధ్ర రాష్ట్ర రైతుల నీటి హక్కులను పరిరక్షించాలని సాగునీటి వినియోగదారుల సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు ఆళ్ల వెంకట గోపాలకృష్ణారావు డిమాండ్ చేశారు. గురువారం ఆయన కృష్ణానదీ యాజమాన్య బోర్డు కార్యాలయాన్ని విశాఖలో ఏర్పాటు చేయడం వల్ల కృష్ణా బేసిన్ లోని రైతులకు జరిగే నష్టం గురించి తెలియపరుస్తూ జల వనరుల శాఖ అధికారులకు, కేంద్ర జల శక్తి శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెఖావత్‌కు పూర్తి వివరాలతో ఇ-మెయిల్ ద్వారా వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమా వేశంలో ఆయన మాట్లాడారు. ఆంధ్ర ప్రదేశ్ పునర్విభజన చట్టం 2014 ప్రకారం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ లోని కృష్ణా నదీజలాల వినియోగాన్ని అన్ని విధాలుగా పర్యవేక్షించడానికి కృష్ణానది యాజమాన్య బోర్డు ఏర్పడిందని, దాని ప్రధాన కార్యాలయాన్ని విజయవాడలోనే ఏర్పాటు చేయడానికి కేంద్ర జలశక్తి శాఖ ఆదేశాలకను గుణంగా గత టీడీపీ ప్రభుత్వం 2018 జనవరిలో ఇబ్రహీంపట్నం ప్రాంతంలో భవనాలను కూడా పరిశీలించడం జరిగిందన్నారు. వైసీపీ ప్రభుత్వం ఏర్పడిన తరువాత జూన్ 2020 లో అప్పటి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయవాడలోనే కేఆర్ఎంబీ కార్యాలయం ఏర్పాటు చేయాలని... కేంద్ర జలశక్తి శాఖ కార్యదర్శికి లేఖ రాస్తూ దాని ప్రతిని కేఆర్ఎంబీ కార్యవర్గ సభ్య కార్యదర్శికి పంపడం జరిగిందని తెలిపారు. 2019 నవంబర్, 2020 ఆగస్టులో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ జల వనరుల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ విజయవాడలోనే కేఆర్ఎంబీ కార్యాలయం ఏర్పాటు చేయాలని కేంద్ర జలశక్తి శాఖకు లేక రాయడం జరిగిందన్నారు. వీటికి విరుద్ధంగా 2020 డిసెంబర్ లో కేఆర్ఎంబీ కార్యాలయాన్ని విశాఖపట్నంలో ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం విజ్ఞప్తి చేయగా... దీని మీద 2021 జనవరిలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం స్పందిస్తూ... హైదరాబాద్ నుంచి విశాఖపట్నం 618 కిలోమీటర్లు దూరంగా కృష్ణ బేసిన్ కు అవతల గోదావరి బేసిన్ దాటి ఉందని లిఖితపూర్వకంగా అభ్యంతరం వ్యక్తం చేసిందని ఆళ్ల గుర్తు చేశారు. 2021 అక్టోబర్ లో జరిగిన రెండవ అపెక్స్ కౌన్సిల్ సమావేశంలో కూడా విజయవాడలోనే బోర్డు ప్రధాన కార్యాలయాన్ని ఏర్పాటు చేస్తామని ఆంధ్రప్రదేశ్ చెప్పిన మీదటే తాము అంగీకారం తెలిపామని, విశాఖపట్నం తరలించడానికి తాము వ్యతిరేకమని... విజయవాడలోనే ఏర్పాటు చేయాలని తెలంగాణ ప్రభుత్వం విజ్ఞప్తి చేసిందని చెప్పారు. విశాఖ చుట్టుపక్కల కృష్ణానది లేనప్పుడు మన రాష్ట్రానికి హక్కుగా దక్కిన కృష్ణానది యాజమాన్య బోర్డు ప్రధాన కార్యాలయాన్ని విశాఖపట్నంలో ఎలా ఏర్పాటు చేస్తారని ఆళ్ల ప్రశ్నించారు. కృష్ణా నది పరీవాహక ప్రాంతంలో శ్రీశైలం, నాగార్జునసాగర్, ప్రకాశం బ్యారేజీ కింద ఉమ్మడి కర్నూలు, ప్రకాశం, గుంటూరు, కృష్ణ, పశ్చిమగోదావరి జిల్లాల్లో 30 లక్షల ఎకరాల ఆయకట్టు ఉందని, విజయవాడ నగరం కృష్ణా నది ఒడ్డున రైల్, రోడ్డు, విమాన సౌకర్యాలు కలిగి ఆంధ్ర, తెలంగాణ అధికారులు, ఆయకట్టుదారులు, నీటి సంఘాల ప్రతినిధులు తమ సమస్యలను కేఆర్ఎంబీ దృష్టికి తీసుకు రావడానికి అనుకూలంగా ఉందన్నారు. ఇన్ని సానుకూల అంశాలు ఉన్న విజయవాడలో కాకుండా కృష్ణా డెల్టా కు 400 కిలోమీటర్లు, ఎన్ఎస్పీకి 700 కిలోమీటర్లు, శ్రీశైలానికి 800 కిలోమీటర్ల దూరంగా గోదావరి బేసిన్ అవతల ఉన్న విశాఖపట్నంలో కేఆర్ఎంబీ కార్యాలయాన్ని ఏర్పాటు చేస్తారా అని రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. గతంలో కేంద్ర జలశక్తి శాఖ- ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మధ్య జరిగిన నిర్ణయాలను పరిగణలోకి తీసుకొని, విజయవాడలోనే కేఆర్ఎంబీ కార్యాలయాన్ని ఏర్పాటు చేయడానికి అన్ని రకాల చర్యలు తీసుకోవాలని కేంద్ర జల శక్తి శాఖ మంత్రికి విజ్ఞప్తి చేశారు. ఈ విషయంలో జోక్యం చేసుకొని ఆంధ్ర రైతుల నీటి హక్కులను కాపాడాలని కోరారు. ఈ సమావేశంలో సాగునీటి వినియోగదారుల సంఘాల రాష్ట్ర సమాఖ్య కార్యవర్గ సభ్యులు తుమ్మల లక్ష్మణరావు, మాదాల నరేంద్ర, తుమ్మల నాగేశ్వరరావు (ఏలూరు జిల్లా), గుండపునేని శ్రీనివాసరావు (కృష్ణాజిల్లా), వేగినేటి గోపాలకృష్ణమూర్తి, దొండపాటి భాస్కరరావు,జంగా చెంచు రెడ్డి (ఎన్టీఆర్ జిల్లా), ఉప్పలపాటి చక్రపాణి (బాపట్ల జిల్లా), అంకాళ్ళ ప్రభుదాసు (గుంటూరు జిల్లా) తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకిచ్చిన హామీని నిలుపుకోవాలి

ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు రవీంద్రనాథ్ డిమాండ్

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: రాష్ట్రవ్యాప్తంగా లక్ష మందికి పైగా పనిచేస్తున్న అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలకు తెలంగాణ ప్రభుత్వం కన్నా ఎక్కువ గౌరవ వేతనం ఇస్తానని సీఎం జగన్ ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు ఆర్.రవీంద్రనాథ్ గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. దీనిపై అన్ని కార్మిక సంఘాలు పెద్ద ఎత్తున ఆందోళనలు చేసిన తర్వాత బుధవారం నిర్వహిం చిన ఐసీడీఎస్ సమీక్షాసమావేశంలో వేతనాలు పెంపు అంశం తప్ప అన్ని చర్చించి కార్యకర్తలపై మరింత భారంపడే విధంగా నిర్ణయాలు చేయడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. నాలుగున్నర సంవత్సరాలుగా వేతనాలు పెంపుదల కోసం జరుగుతున్న ఆందోళనలను ప్రభుత్వం పోలీసు వ్యవస్థను అడ్డం పెట్టుకొని ఉక్కు పాదంతో అణచివేస్తున్నదన్నారు. తీవ్ర ఆందోళనలో ఉన్న కార్యకర్తలు సమీక్ష సమావేశ నిర్ణయాల కోసం ఎదురుచూస్తున్నారు. ఈ సమావేశంలో ముఖ్యమంత్రి ఆ ఒక్కటీ అడక్కు అన్నట్లు వేతనాలు పెంపుదల సమస్యను తప్ప అన్ని చర్చించి యాప్‌లు మరిన్ని పెంచి మరింత అదనపు భారం కార్యకర్తలపై మోపారు తప్ప కార్యకర్తలకు ఏ ప్రయోజనం చేకూర్చకక పోవడాన్ని రవీంద్రనాథ్ తీవ్రంగా విమర్శించారు. ముఖ్యమంత్రి హామీ ఇచ్చిన తర్వాతనే తెలంగాణ ప్రభుత్వం రెండుసార్లు వేతనం పెంచడమే గాక మరిన్ని ప్రయోజనాలు కార్యకర్తలకు వచ్చే విధంగా హామీ ఇచ్చారు. ఇప్పటికైనా ఈ విషయాన్ని గ్రహించిన రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే వేతనాలు పెంచి పని భారం తగ్గించాలని రవీంద్రనాథ్ కోరారు.

ప్రజా ప్రణాళికల అమలునకు పోరు

సీపీఎం ఏపీ కార్యదర్శి శ్రీనివాసరావు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: అసమానతలు లేని అభివృద్ధి కోసం సీపీఎం రూపొందించిన ప్రజా ప్రణాళిక అమలు కోసం పోరాడాలని పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. ప్రజా ప్రణాళికలను గురువారం విజయవాడలోని పార్టీ కార్యాలయంలో ఆవిష్కరించారు. కార్యక్రమానికి సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు, డి.రమాదేవి, వి.వెంకటేశ్వర్లు హాజరయ్యారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ నవంబరు 15న 'ప్రజా రక్షణ భేరి' పేరుతో విజయవాడలో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. దీనికి ముందు మూడు ప్రాంతాల నుంచి బస్సు యాత్రలు బయలుదేరుతాయన్నారు. రాష్ట్ర రాజకీయాలు ప్రజా సమస్యల చుట్టూ కాకుండా రాజకీయ పార్టీల సొంత అజెండాల చుట్టూ తిరుగుతున్నాయని, వాటిని ప్రజాసంక్షేమం చుట్టూ మళ్లించాలనే ప్రయత్నం చేస్తున్నామని చెప్పారు. ఇందులో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. 339 మండలాల్లో కరువు పరిస్థితులు ఉన్నాయని, కృష్ణా డెల్టాలో వేలాది ఎకరాల్లో పంట ఎండిపోతోందన్నారు. దీనిపై ఎన్యూమరేషన్ చేసి రైతులను ఆదుకోవాలని కోరారు. రైతు భరోసా కేంద్రాలకు అదనపు సిబ్బందిని నియమించి కరువు నుంచి కాపాడాలని సూచించారు. పంట దెబ్బతినడం వల్ల వరిలో తాలు, తప్ప వస్తుందే తప్ప ఉపయోగం ఉండబోదన్నారు. చాలా ప్రాంతాల్లో ప్రజలకు రక్షిత తాగునీరు లేదని, జ్వరాలు పెరుగుతున్నాయని చెప్పారు. సమస్యల పరిష్కారానికి ప్రభుత్వపరంగా చర్యలేవీ కనిపించడం లేదని, దీనిపై కేబినెట్ నిర్ణయం తీసుకుని ఒక పద్ధతి ప్రకారం ముందుకెళ్లడం ఎంతైనా అవసరమని నొక్కి చెప్పారు. కులగణన చేయాలని నిర్ణయించడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. అయితే బీసీలకు న్యాయం చేయాలనే చిత్తశుద్ధి కనిపించడం లేదన్నారు. అన్ని కులాల లెక్కలు తేలితే భవిష్యత్‌లో అణగారిన వర్గాలకు మేలు జరిగేందుకు అవకాశం ఉంటుందన్నారు. అసైన్డు భూముల వివరాలు వెల్లడించాలని డిమాండు చేశారు. పేదలకు 300 యూనిట్లు విద్యుత్ ఇవ్వాలని, రూ.400కే గ్యాస్, రూ.60కే లీటర్ పెట్రోలు, డీజిల్, ఉచితంగా ఇసుక తదితరాలు ఇవ్వాలని ప్రణాళికలను రూపొందించినట్లు చెప్పారు.

సాగునీటి ప్రాజెక్టులపై శీతకన్ను

జగన్ తీరుపై కడప జిల్లా సదస్సు విమర్శ

విశాలాంధ్ర బ్యూరో-కడప: కడప జిల్లా సాగునీటి ప్రాజెక్టులపై ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి శీతకన్ను వేశారని, జిల్లాలో భారీ, మధ్య, చిన్నతరహా నీటి ప్రాజెక్టుల ద్వారా 9 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీరందించే అవకాశం ఉన్నప్పటికీ ప్రధాన కాలువలు, ఉపకాలువలు, పంట కాలువలు లేనందున 9 వేల ఎకరాలకు కూడా నీరు అందడం లేదని కాంగ్రెస్ సీనియర్ నేత ఎన్.తులసిరెడ్డి విమర్శించారు. నీటి ప్రాజెక్టులపై సీఎం జగన్‌కు చిత్తశుద్ధి లేదని మండిపడ్డారు. జనచైతన్య వేదిక అధ్వర్యంలో కడప జిల్లా సమగ్రాభివృద్ధిపై గురువారం చర్చా వేదిక జరిగింది. జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి అధ్యక్షత వహించారు. తులసిరెడ్డి ప్రసంగిస్తూ జగన్ శంకుస్థాపనల స్పెషలిస్ట్‌గా మారారని, కడప ఉక్కు ఫ్యాక్టరీకి రెండుసార్లు శంకుస్థాపన చేసి ఒక్క రూపాయి ఖర్చుపెట్టలేదని ఆరోపించారు. కొప్పర్తి పారిశ్రామికవాడ నిర్వీర్యమైందని, పులివెందుల అసాంఘిక శక్తుల అడ్డాగా మారిందని, జగన్ అభివృద్ధి నిరోధకుడిగా చరిత్రలో నిలిచిపోతారని విమర్శించారు. టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు ఆర్.శ్రీనివాసులరెడ్డి ప్రసంగిస్తూ జగన్ ప్రభుత్వం మ్యాచింగ్ గ్రాంట్ ఇవ్వకపోవడంతో కడప-పెండ్లిమర్రి-రాయచోటి-బెంగళూరు నూతన బ్రాడ్‌గేజ్ రైలు మార్గం పనులు నిలిచిపోయాయని ఆరోపించారు. జగన్ లేఖ కారణంగా కడప-బెంగళూరు రైల్వే ప్రాజెక్టు సైతం ఆచరణకు నోచుకోలేదన్నారు. జగన్ రాయలసీమ ద్రోహిగా నిలిచిపోయారన్నారు. రాజధానిని విశాఖకు తరలిస్తే కడప సహా రాయలసీమకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. కడప జిల్లాలో ఖనిజ సంపద, వృక్ష సంపద సమృద్ధిగా ఉన్నా పారిశ్రామికీకరణ ఎందుకు జరగలేదని ప్రశ్నించారు. జనసేన పార్టీ రాష్ట్ర నేత సుంకర శ్రీనివాస్ మాట్లాడుతూ కడప జిల్లాలో పాలెగాళ్ల పెత్తనంతో పేదలు నలిగిపోతున్నారని, సహజ వనరులు దోపిడీకి గురవుతున్నాయన్నారు. రాష్ట్రంలో చట్టబద్ధ పాలన కరువైందని, ప్రతిపక్ష పార్టీల గొంతు నొక్కుతున్నారని, వ్యవస్థలన్నీ నిర్వీర్యమవుతున్నాయని అన్నారు. వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి ప్రసంగిస్తూ తలసరి ఆదాయంలో ఆంధ్రప్రదేశ్ అట్టడుగున ఉందని, వరదలో కొట్టుకుపోయిన అన్నమయ్య ప్రాజెక్టుకు మరమ్మతు చేయలేని దుస్థితిలో ప్రభుత్వం ఉందన్నారు.

సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జి.ఈశ్వరయ్య మాట్లాడుతూ జగన్ సర్కారు అనుసరిస్తున్న విధానాల కారణంగా ప్రజలు బిచ్చగాళ్లుగా మారుతున్నారని విమర్శించారు. జిల్లాలో గల అపార ఖనిజ సంపద, ఎర్రచందనం అధికార పార్టీ నేతల కాసులు కురిపిస్తున్నాయన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్ ప్రసంగిస్తూ నిధుల కొరత కారణంగా ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీలో విద్యాప్రమాణాలు పడిపోతున్నాయన్నారు. తెలుగు సూర్యుడుగా ప్రసిద్ధి గాంచిన యోగి వేమనను తెలుగు ప్రజలకు పరిచయం చేసిన సీపీ బ్రౌన్ గ్రంథాలయ అభివృద్ధిని విస్మరించడం శోచనీయమన్నారు. లోక్‌సత్తా పార్టీ జిల్లా అధ్యక్షుడు దేవర శ్రీకృష్ణ, ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా కన్వీనర్ డాక్టర్ బేరిల్ల శ్రీనివాస్, బహుజన సమాజ్ వాదీ పార్టీ రాష్ట్ర కార్యదర్శి సగిల గుర్రప్ప, రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ నేత కె.లింగమూర్తి, జనవిజ్ఞాన వేదిక జాతీయ ఉపాధ్యక్షుడు బి.విశ్వనాథ, జిల్లా కార్యదర్శి పి.శంకరయ్య, పీఈటీ జిల్లా కార్యదర్శి పి. రమేశ్ తదితరులు ప్రసంగించారు.

కృష్ణాజలాల పంపిణీలో రాష్ట్రానికి అన్యాయం జరిగితే

ఉద్యమం ఉధృతం: ఓబులేసు

విశాలాంధ్ర - డోన్: కృష్ణ జలాల పునర్‌పంపకంలో ఆంధ్రాకు అన్యాయం జరిగితే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జి. ఓబులేసు హెచ్చరించారు. నంద్యాల జిల్లా డోన్ లోని సీపీఐ కార్యాలయంలో గురువారం ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి పి.సుంకయ్యతో కలిసి విలేకరులతో మాట్లాడారు. కృష్ణా జలాలను 1976లోనే ఆంధ్రతో పాటు మహారాష్ట్ర, కర్నాటక, ఉమ్మడి ఆంధ్ర రాష్ట్రాలకు పంపిణీ చేశారన్నారు.ఆ పంపకంలో తెలంగాణకు ఆంధ్రకు 810 టీఎంసీలు నీటిని అప్పటి అధికారులు పంపిణీ చేశారన్నారు. తెలంగాణ ఎన్నికల దృష్ట్యా మోదీ ప్రభుత్వం ఓటర్లను మభ్యపెట్టేందుకు కృష్ణ జలాల పునర్విభజన పేరుతో కుయుక్తులు పన్నుతున్నదన్నారు. కేంద్రం నిర్ణయంతో రాయలసీమ జిల్లాలకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. కృష్ణాజలాలను తెలంగాణకు ఎక్కువగా తరలిస్తే దాదాపు 38 లక్షల ఎకరాలు ఎడారిగా మారే అవకాశం ఉందని చెప్పారు కృష్ణ నది కేంద్ర బోర్డ్ కార్యాలయాన్ని విశాఖ తరలించడం వెనక ఏదో మతలబు ఉందని ఓబులేసు అన్నారు. సీపీఐ నంద్యాల జిల్లా కార్యదర్శి ఎన్ రంగనాయుడు మాట్లాడుతూ జిల్లాలో 29 మండలాల్లో 19 మండలాల్లో తీవ్ర కరువు చాయాలు అలుముకున్నాయన్నారు. ఖరీఫ్‌లో సరైన సమయానికి వర్షపాతం నమోదు కాకపోవడంతో పెట్టుబడులు కూడా రాని పరిస్థితి నెలకొందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కరువు సహాయక చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

గాజాలో మరణ హోమాన్ని ఆపాలి: ఇజ్రాయిల్-హమాస్ మధ్య జరుగుతున్న యుద్ధాన్నిఅపి, ప్రజలను కాపాడాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యులు జి. ఓబులేసు కోరారు. గురువారం డోన్‌లోని సీపీఐ సర్కిల్లో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ప్రజలను కాపాడాలంటూ నల్ల బ్యాడ్జీలు ధరించి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఓబులేసు మాట్లాడుతూ ఇజ్రాయిల్ హమాస్ మధ్య యుద్ధం 12 రోజులుగా కొనసాగుతున్న దన్నారు.ఇప్పటికే దాదాపు 5,000 మంది ప్రజలు చనిపోవడం జరిగిందన్నారు. గాజా శవాలదిబ్బగా మారి ప్రజలు తిండి కోసం నాన్న తిప్పలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. హమాస్ ను అంతం చేసే వరకు యుద్ధం ఆగదని ఇజ్రాయిల్ ప్రకటించడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రఘురామ్మూర్తి, పి.సుంకయ్య నాయకులు లక్ష్మీనారాయణ, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

భవిష్యత్‌కు అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దాలి: సురేశ్ కుమార్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ప్రపంచం శరవేగంగా అభివృద్ధి చెందుతున్న క్రమంలో భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా విద్యార్థులను తీర్చి దిద్దడం ముఖ్యమని నైపుణ్యాభివృద్ధి శాఖ ముఖ్యకార్యదర్శి సురేశ్ కుమార్ అన్నారు. పరిశ్రమ-అకాడమీ మధ్య బలమైన భాగస్వామ్యం ఉండాలని సూచించారు. పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా పాఠ్యప్రణాళిక ఉండాలని, విద్యార్థులు జ్ఞానాన్ని మాత్రమే కాకుండా ఆచరణాత్మక నైపుణ్యతనూ పెంపొందించుకొనేలా విద్యా వ్యవస్థ ఉండాలన్నారు. పరిశ్రమలు, విద్యా రంగాల మధ్య సంబంధాల బలోపేతం ధ్యేయంగా సాంకేతిక విద్యా శాఖ ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో, ప్రభుత్వ, ప్రైవేటు పాలిటెక్నిక్ లకు చెందిన ప్రిన్సిపాళ్లు, ట్రైనింగ్, ప్లేస్ మెంట్ అధికారులకు గురువారం సదస్సు నిర్వహించింది. దీనికి ముఖ్య అతిథిగా సురేశ్ కుమార్ హాజరయ్యారు. మంచి విద్యా బోధనకు అధ్యాపకుల శిక్షణను తప్పనిసరి చేయాలని, కెరీర్ పురోగతి లేదా పదోన్నతుల కోసం కాకుండా విద్యను సమగ్రంగా పెంపొందించేలా ఉండాలని ఆయనన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన సాంకేతిక విద్య కమిషనర్ చదలవాడ నాగరాణి మాట్లాడుతూ పాలిటెక్నిక్‌ల ముంగిటకు బహుళజాతి కంపెనీలను తేవడం ద్వారా డిప్లొమో విద్యార్థులకు ఉపాధి అవకాశాలు అందించగమన్నారు. పరిశ్రమలతో అవగాహన ఒప్పందాల అమలు, పాఠ్యప్రణాళిక పునరుద్ధరణలో పరిశ్రమల భాగస్వామ్యం, ఫ్యాకల్టీ, పరిశ్రమల అనుసంధాన కార్యక్రమాల నిర్వహణతో అర్థవంతమైన సాంకేతిక విద్యను అందించామన్నారు. పరిశ్రమ-విద్యా సహకారాన్ని సులభతరం చేయడంలో అమూల్యమైన మద్దతు ఇచ్చినందుకు వీల్స్ ఇండియా, రాయల్ ఎన్ఫీల్డ్, హెచ్ఎల్ మండో ఆనంద్, ఎఫ్ట్రానిక్స్ సిస్టమ్ సంస్థలకు ఇండస్ట్రీ కనెక్ట్ ఎక్సలెన్స్ అవార్డును ప్రదానం చేశారు. ప్లేస్ మెంట్లలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన పాలిటెక్నిక్ అభ్యర్థులకు 'బెస్ట్ ప్లేస్‌మెంట్ పెర్ఫార్మం' పురస్కారాలు అందజేశారు. వర్క్‌షాపులో జాయింట్ డైరెక్టర్ వి.పద్మారావు, ఆర్జేడీ-ఏయూ రీజియన్ జె.సత్యనారాయణమూర్తి, ఆర్జేడీ-ఎస్వీయూ రీజియన్ ఏ.నిర్మల్ కుమార్ ప్రియ, ఎస్ బీటీఈటీ కార్యదర్శి కేవీ రమణబాబు పాల్గొన్నారు.

నిరసన హక్కు హరిస్తున్నారు

జాతీయ మానవ హక్కుల సంఘానికి టీడీపీ ఫిర్యాదు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో మానవ హక్కుల ఉల్లంఘన జరుగుతోందని, నిరసన హక్కును హరిస్తున్నారని జాతీయ మానవ హక్కుల సంఘానికి తెలుగుదేశం పార్టీ ఫిర్యాదు చేసింది. సంఘం చైర్మన్‌కు టీడీపీ ఎంపీ కనకమేడల రవీంద్ర కుమార్ గురువారం ఫిర్యాదు అందజేశారు. కొద్ది రోజులుగా టీడీపీ కార్యకర్తలతో పోలీసుల ప్రవర్తన సరిగా లేదని, అనవసరంగా కేసులు పెడుతున్నారని నివేదించారు. టీడీపీ నేతలు, మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలను నిర్బంధిస్తున్న తీరును వివరిం చారు. పార్టీ అధినేత చంద్రబాబును అక్రమ కేసులో ఇరికించారని, ఆయన ప్రస్తుతం రాజమహేంద్రవరం జైలులో ఉన్నారని తెలిపారు. కుటుంబ సభ్యులను పరామర్శించడానికి కూడా పోలీసులు అనేక ఆంక్షలు విధిస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నారని చైర్మన్ దృష్టికి రవీంద్రకుమార్ తీసుకెళ్లారు.

రోజుకు మూడుసార్లు లీగల్ ములాఖత్

రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో చంద్రబాబుతో ములాఖత్‌లు పెంచాలని టీడీపీ తరపు న్యాయవాదులు విజయవాడలోని ఏసీబీ కోర్టును కోరారు. ఈ మేరకు వారు పిటిషన్ దాఖలు చేశారు. లీగల్ ములాఖత్ రోజుకు మూడు సార్లు ఇవ్వాలని పేర్కొన్నారు. పిటిషన్లపై చంద్రబాబుతో మాట్లాడేందుకు అవకాశం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ములాఖత్ ఇవ్వకుండా జైలు అధికారులు ఇబ్బం దులు పెడు తున్నారని పిటిషన్‌లో న్యాయవాదులు వెల్లడించారు.

టీడీఆర్‌ల పేరుతో దోపిడీ

- జీవీఎంసీ సమావేశంలో నిలదీసిన ప్రతిపక్షాలు
- రూ.3500 కోట్ల కుంభకోణం జరిగిందని ఆందోళన
- మేయర్ పోడియాన్ని చుట్టుముట్టి నిరసన

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: విశాఖ నగరంలో మురికివాడల ముసుగులో టీడీఆర్‌ల దోపిడీపై సమగ్ర విచారణ జరిపించాలని కోరుతూ సీపీఐ, సీపీఎం, జనసేన, బీజేపీ కార్పొరేటర్లు మేయర్ పోడియాన్ని చుట్టుముట్టి బైఠాయించారు. గురువారం గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ కౌన్సిల్ (జీవీఎంసీ)సమావేశం మేయర్ హరి వెంకట కుమారి అధ్యక్షతన జరిగింది. కౌన్సిల్ ప్రారంభంలోనే ప్రతిపక్ష కార్పొరేటర్లు పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. నగరంలోని ఏఎస్ఆర్ నగర్, మధురవాడ, ఈస్ట్ పాయింట్ కాలనీల్లో అధికార వైసీపీ నేతలకు లబ్ధి చేకూరేలా జీవీఎంసీలో టీడీఆర్ పేరిట రూ.3500కోట్ల మేర కుంభకోణం జరిగిందని ధ్వజమెత్తుతూ కార్పొరేటర్లు ఆందోళన చేపట్టారు. అజెండాలో పెట్టకుండా, కౌన్సిల్ ఆమోదం లేకుండా భారీ ఎత్తున టీడీఆర్‌లు జారీ చేసేస్తున్నారని...వాటి వివరాలు తక్షణమే అందజేయాలని పట్టుబట్టారు. ప్లకార్డులు పట్టుకుని నినదించారు. టీడీపీ, జనసేన, బీజేపీ ఫ్లోర్ లీడర్ల అధ్వర్యంలో సభ్యులు పెద్ద ఎత్తున నినదిస్తూ చర్చకు డిమాండ్ చేశారు. జీరో అవర్ లో అవన్నీ మాట్లాడుకుందామని అధికార వైసీపీ కార్పొరేటర్లు నచ్చజెప్పే ప్రయత్నం చేసినా ఊరుకోలేదు. దీంతో కమిషనర్ సాయికాంత్ వర్మ స్పందించి ఇప్పటివరకు జారీ చేసిన టీడీఆర్ వివరాల్ని వెంటనే సభ్యులకు అందజేయాలని, అవసరమైతే అత్యవసర సమావేశం నిర్వహించాలని మేయర్‌ను ఆదేశించడంతో ప్రతిపక్ష సభ్యులు శాంతించారు. వెలగని వీధి దీపాలతో విశాఖలో చీకట్లు అలుముకున్నాయని, రాత్రయితే ప్రజల నుంచి పెద్ద ఎత్తున ఫిర్యాదులొస్తున్నాయని అనేకమంది కార్పొరేటర్లు సభలో లేవనెత్తారు. కమిషనర్ సాయికాంత్ వర్మ వివరణ ఇస్తూ... జీవీఎంసీ పరిధిలోని ఒక లక్షా 18వేల వీధి దీపాలు ఉండగా, 5517 సీసీఎంఎస్ బాక్సులు ఉన్నాయి. వీటిలో 5,700లైట్లు వెలగడం లేదని, చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. గతంలో ఉన్న ఏజెన్సీ ని తప్పించి బ్రీడ్జ్ అండ్ రూఫ్ కంపెనీకి అప్పగిస్తే వాళ్లు సరిగా చేయలేకపోవడంతో నోటీసులిచ్చామని... త్వరలో అన్ని లైట్లు వెలిగేలా చేస్తామని హామీ ఇవ్వడంతో సభ్యులు శాంతించారు. నీటి సరఫరా విభాగంతో పాటు అనేక విభాగాల్లో అవుట్ సోర్సింగ్ విధానంలో ఉద్యోగాల భర్తీకి ఏర్పాట్లు చేస్తున్నట్టు సీతా రవి కృష్ణ రాజు చెప్పగా, సీపీఐ, సీపీఎం కార్పొరేటర్లు ఏజే స్టాలిన్, బీ గంగారావు మాట్లాడుతూ కరోనా సమయంలో మృతి చెందిన వారి కుటుంబాల్ని పట్టించుకోకుండా కొత్త పోస్టుల్ని భర్తీ చేయడం సబబు కాదన్నారు. కాంట్రాక్ట్ పారిశుధ్య కార్మికుల నియామకాలు, మలేరియా సీజనల్ వర్కర్ల నియమకాల్లో పారదర్శకంగా వ్యవహరించాలని వామపక్ష పార్టీ కార్పొరేటర్లు పాలకవర్గాన్ని నిలదీశారు. కొన్ని ప్రాంతాల్లో అజెండాలో లేకపోయినా, విస్తరణలో పరిహారం చెల్లించకుండా ఏరియా డెవలప్ మెంట్ పేరిట పనులకు ముందుకు వెళ్తే ఊరుకునేది లేదని ప్రతిపక్ష కార్పొరేటర్లు హెచ్చరించారు. ఇంత జరుగుతున్నా అవేమీ పట్టించుకోకుండా అన్ని అంశాల్నీ వరసగా ఆమోదించు కుంటూ వెళ్లిపోవడంతో విపక్ష టీడీపీ సభ్యులు చెవిలో పూలు పెట్టుకుని నిరసన వ్యక్తం చేశారు. ప్ల కార్డులు ప్రదర్శిస్తూ ఆందోళనకు దిగారు. జీవీఎంసీ కౌన్సిల్ రాటిఫికేషన్ మీటింగ్‌లా తయారైందని సీపీఐ కార్పొరేటర్ ఏజే స్టాలిన్ ధ్వజమెత్తారు. అన్ని అంశాలపై రాటిఫికేషన్ అంటూ చెప్పడాన్ని ఆయన తప్పుబట్టారు.

వైసీపీ నేతలకు భూమార్పిడిపై అభ్యంతరం

జీవీఎంసీ పరిధిలోని 6 వార్డులోని ఎంఎస్ఆర్ లేఅవుట్‌లో గల లేబెట్ 5/87 ఖాళీ స్థలంలో సీతాకోకచిలుకల పార్క్ అభివృద్ధి పనులకు జీవీఎంసీ రూ. 1.94 లక్షలతో పనులు చేపట్టింది. ఈ స్థలాన్ని ఆనుకుని ఉన్న సర్వేనెంబర్ 192, 12పి లో ప్రైవేట్ స్థలంలో ఉన్న 484.39 చదరపు గజాల స్థలాన్ని జీవీఎంసీకి బదలాయింపు చేసి, పార్కులో వాయువ్య దిక్కున ఉన్న 484.39 స్థలాన్ని వైసీపీ నాయకులుగా ఉన్న పిల్లా లక్ష్మణ పాత్రుడు, పోతిన అప్పారావుకు భూ బదలాయింపు చేయడంపై కౌన్సిల్ ఆమోదం కోసం టేబుల్ అజెండాలో 11 అంశంగా చేర్చడంతో దీనిపై చర్చ తీవ్రంగానే సాగింది. రహదారి కోసం విలువైన పార్కు స్థలాన్ని వైసీపీ నేతలకు కట్టబెట్టి, ఆయనకు ఉపయోగపడని, విలువ లేని స్థలాన్ని పార్కులో కలుపుకోవడం పై విపక్షాల సభ్యులు తీవ్ర అభ్యంతరం తెలిపారు.

ప్రజలకు గతుకుల రోడ్లు...నేతల లేఔట్లకు రూ.10కోట్లతో కొత్త రోడ్ల నిర్మాణమా?

విశాఖలో నిత్యం ప్రజలదో రద్దీగా రోడ్లన్నీ గతుకుల మయంగా ఉంటే... వైసీపీ నేత కు చెందిన లేఅవుట్‌కు భారీగా నిధులు వెచ్చించి రోడ్లు వేస్తారా అంటూ విపక్ష కార్పొరేటర్లు ప్రశ్నించారు. భీమిలి నియోజకవర్గం 4వ వార్డు పరిధిలో ఒకే చోట రూ.10కోట్ల మేర ఖర్చు చేసి రోడ్ల ఏర్పాటుకు అనుమతి ఇచ్చేందుకు కౌన్సిల్ లో ఆమోదం తెలపడంపై 22వ వార్డు జనసేన కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ అభ్యంతరం తెలిపారు. అధికార పార్టీ నేత బంధువు నిర్మిస్తున్న లే అవుట్‌కు లబ్ధి చేకూర్చేందుకే ఒకేసారి ఇంత మొత్తం ఖర్చు చేస్తున్నారన్నారు. ఇతర పార్టీల సభ్యులు కూడా దీనిని వ్యతిరేకించారు. కనీసం స్థానిక ప్రజాప్రతినిధుల ప్రతిపాదన కూడా లేకుండానే డబ్బు ఖర్చుకు సిద్ధం కావడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో స్థానిక ఎమ్మెల్యే ముత్తం శెట్టి శ్రీనివాసరావు వివరణ ఇస్తూ నగరాభివృద్ధి అక్కర్లేదా ? విశాఖ పాలనా రాజధాని కానున్నందున అన్నీ అభివృద్ధి చెందాలన్నారు. ఉదయం 11 గంటలకు ప్రారంభమైన కౌన్సిల్ సమావేశం సాయంత్రం 6 గంటల వరకు వాడీవేడిగా కొనసాగింది. విపక్షాల నిరసనల మధ్యే అజెండాలోని 57 అంశాలను, తర్వాత మరో 11 సప్లమెంటరీ అంశాలు, ఇంకో 7 టేబుల్ అజెండా అంశాలను అధికార వైసీపీ సభ్యులు ఆమోదింపజేసుకున్నారు. ఈ సమావేశంలో భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాస రావు, ఎమ్మెల్సీలు వంశీకృష్ణ శ్రీనివాస్ యాదవ్, వరుదు కళ్యాణి తోపాటు కార్పొరేటర్లు, అధికారులు పాల్గొన్నారు.



23న విజ్ఞాన్ యూనివర్సిటీ స్నాతకోత్సవం

విశాలాంధ్ర-గుంటూరు: విజ్ఞాన్ యూనివర్సిటీ 11వ స్నాతకోత్సవాన్ని ఈ నెల 23వ తేదీన నిర్వహిస్తున్నట్లు విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ పీ నాగభూషణ్ తెలిపారు. విజ్ఞాన్స్ యూనివర్సిటీలో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ 11వ స్నాతకోత్సవానికి ముఖ్యఅతిథిగా కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్, గౌరవ అతిథులుగా హైదరాబాద్‌లోని అనంత్ టెక్నాలజీస్ ఫౌండర్ డాక్టర్ సుబ్బారావ్ పావులూరి, విమ్‌టా ల్యాబ్స్ లిమిటెడ్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ డాక్టర్ ఎస్‌పీ వాసిరెడ్డి, ప్రముఖ చదరంగ క్రీడాకారిణి కోనేరు హంపి హాజరవుతారని వెల్లడించారు. స్నాతకోత్సవం సందర్భంగా తమ యూనివర్సిటీ 1800 మందికి పైగా విద్యార్థులకు డిగ్రీలు ప్రదానం చేయనుందని... అదేవిధంగా అత్యుత్తమ ప్రతిభ చూపిన 24 మంది విద్యార్థులకు బ్రాంచ్‌ల వారీగా బంగారు పతకాలు అందజేస్తామన్నారు. వీటితో పాటు బెస్ట్ అవుట్ గోయింగ్ స్టూడెంట్ మెడల్, ఎండోమెంట్ అవార్డులు, బహుముఖ ప్రతిభ కనబరిచిన విద్యార్థికి చైర్మన్ బంగారు పతకం, బెస్ట్ ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ, సోషల్ ఎంగేజ్‌మెంట్ అవార్డు, బెస్ట్ లీడర్ మెడల్స్ బహూకరిస్తామన్నారు. వివిధ విభాగాలలో అద్భుత ప్రతిభ చూపిన విద్యార్థులకు కూడా ప్రత్యేక బహుమతులు ఇస్తున్నట్లు తెలిపారు. అంతేకాకుండా వివిధ రంగాలలో వారు అందించిన సేవలు, కృషికి గాను డాక్టర్ సుబ్బారావ్ పావులూరి, డాక్టర్ ఎస్‌పీ వాసిరెడ్డి, కోనేరు హంపిలకు గౌరవ డాక్టరేట్‌లను యూనివర్సిటీ ప్రదానం చేయనుందని వివరించారు. ఈ స్నాతకోత్సవ కార్యక్రమంలో విజ్ఞాన్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ లావురత్తయ్య, రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్ తదితరులు పాల్గొంటారని వెల్లడించారు.

సంపాదకీయం

సుప్రీం గుప్పెట్లో మోదీ!

కనీసం అయిదు ప్రధానమైన కేసులలో మోదీ ప్రభుత్వ భవిష్యత్తు సుప్రీంకోర్టు విచారణలు, తీర్పులమీద ఆధారపడి ఉంది. సుప్రీంకోర్టు న్యాయమూర్తులు సాధారణంగా విచారణాక్రమంలో ప్రస్తావిత అంశాలపేర చాలా ఉత్తేజకరమైన, స్ఫూర్తిదాయకమైన వ్యాఖ్యలు చేస్తుంటారు. తీర్పుల దగ్గరికి వచ్చే సరికి అనేక సందర్భాలలో ఆ వేడి కనిపించదు. కోర్టు కేసుల్లో అధికభాగం ప్రభుత్వ ప్రమేయం ఉన్నవో, ప్రభుత్వమే కక్షిదారు అయినవో ఉంటాయి. ప్రస్తుతం అయిదు అలాంటి కేసులలో సుప్రీంకోర్టులో కీలక విచారణ జరగబోతోంది. ఈ కేసుల్లో తీర్పులు ఎలా ఉంటాయి అన్న అంశం మీద మోదీ ప్రభుత్వ ప్రతిష్ఠ ఆధారపడి ఉంటుంది. ఎన్నికల బాండ్ల కేసు, రాజ్యసభ సభ్యుడు రాఘవ చడ్డా కేసుపై 30న విచారణ జరగనుంది. అలాగే మహారాష్ట్ర స్పీకర్ రాహుల్ నార్వేకర్ సుప్రీంకోర్టు ఆదేశాలను కూడా పాటించకుండా వ్యవహరించడంపై ఇప్పటికే సుప్రీంకోర్టు కటువైన వ్యాఖ్యలు చేసింది. ప్రభుత్వ లోపాలను ఎత్తిచూపే కొందరు పత్రికా రచయితలను అక్టోబర్ మూడున విచారణ పేరుతో నిర్బంధించి, వారి లాప్‌టాప్‌లను, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను స్వాధీనం చేసుకోవడం పెద్ద వివాదానికి దారితీసింది. ఇందులో భాగంగానే న్యూస్‌క్లిక్ అధిపతి, సంపాదకుడు, ప్రబీర్ పురకాయస్థను, ఆ సంస్థ మానవ వనరుల విభాగం అధిపతి అమిత్ చక్రవర్తిని అరెస్టు చేశారు. వారు ఇంకా విడుదల కానేలేదు. వారిని ఎందుకు అరెస్టు చేస్తున్నారో పోలీసులు తెలియ జేయలేదు. చివరకు వీరు సుప్రీంకోర్టును ఆశ్రయించవలసి వచ్చింది. అలాగే దిల్లీ మద్యం కేసులో ఆమ్ ఆద్మీ పార్టీ ప్రభుత్వంలో ఉప ముఖ్యమంత్రిగా ఉన్న మనీశ్ సిసోడియాను అరెస్టుచేసి నెలలు గడుస్తోంది. ఇటీవలే ఆమ్ ఆద్మీ పార్టీ మరో సీనియర్ నాయకుడు, రాజ్యసభ సభ్యుడు సంజయ్ సింగ్‌ను కూడా ఈ కేసులోనే అరెస్టు చేశారు. వీరి మీద సరైన ఆరోపణలు మోపడంలో ప్రభుత్వం విఫలమైందని అత్యున్నత న్యాయస్థానం ఎత్తి చూపింది. మరో ముఖ్యమైన అంశం ఎన్నికల బాండ్లు. ఎన్నికల నిధులు సమకూర్చుకోవడం, కార్పొరేట్ సంస్థలు వివిధ రాజకీయ పార్టీలకు ఎన్నికల నిధులు సమకూర్చడం చాలా కాలంగా వివాదాస్పదంగానే ఉంది. ఎవరు ఏ పార్టీకి ఎంత మేర నిధులు సమకూరుస్తున్నారో తద్వారా వారు ఎలాంటి లబ్ధి పొందుతున్నారు అనేది దీర్ఘకాలంగా ప్రశ్నార్థకంగా ఉంది. రాజకీయ పార్టీలకు ఎన్నికల నిధులు సమకూర్చడం వివాదాస్పదంగా ఉంది కనక ఎన్నికల సంస్కరణల్లో భాగంగా దాపరికం లేకుండా నిధులు సమకూర్చడానికి, బాధ్యతాయుతంగా ఉండడానికి అరుణ్ జైట్లీ ఆర్థికశాఖ మంత్రిగా ఉన్నప్పుడు 2017లో ఎన్నికల బాండ్ల విధానాన్ని ప్రవేశ పెట్టారు. విచిత్రం ఏమిటంటే 2018 నుంచి విడుదలవుతున్న ఎన్నికల బాండ్ల ద్వారా సమకూరే మొత్తంలో 85శాతం బీజేపీకే దక్కుతున్నాయి. రాజకీయ పార్టీలకు విరాళాలు ఇవ్వాలనుకునే వారు ఈ బాండ్లు జారీచేసే సమయంలో బాండ్లు కొని తమకు నచ్చిన రాజకీయ పార్టీలకు వాటిని అందజేయవచ్చు. అయితే దాపరికం లేకుండా పోవడానికి బదులు మరింత దాపరికం అమలులోకి వచ్చింది. రాజకీయ పార్టీలు ఈ బాండ్లు తమకు ఎక్కడి నుంచి అందాయో చెప్పక్కర్లేదు. ఈ వ్యవహారం 2019 ఏప్రిల్ నుంచి సుప్రీంకోర్టు పరిశీలనలో ఉన్నా ఇప్పటిదాకా తెమలలేదు. 2019లోనే సుప్రీంకోర్టు అన్ని రాజకీయ పక్షాలను తమకు ఎన్ని విరాళాలు అందాయో ఎన్నికల కమిషన్‌కు "తక్షణం" తెలియజేయాలని ఆదేశించింది. దీనివల్ల అధికారంలోఉన్న పార్టీకే అధిక మొత్తంలో నిధులు ఎందుకు అందుతున్నాయో తెలిసే అవకాశమేలేదు. ఈ బాండ్లు జారీ చేసేది ఎస్.బి.ఐ. లాంటి షెడ్యూల్డ్ బ్యాంకులు కనక ఏ పార్టీకి ఎన్ని నిధులు అందాయో ప్రభుత్వం తెలుసుకోవచ్చు. కానీ ప్రతిపక్షాలకు, జనానికి తెలిసే అవకాశమే లేదు. ఈ కేసును ఈ నెల 30వ తేదీన సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి డి.వై. చంద్రచూడ్‌తో కూడిన అయిదుగురు న్యాయమూర్తుల రాజ్యాంగ పీఠం విచారించవలసి ఉంది. ఎన్నికల బాండ్లకు అవకాశం కల్పించే బిల్లును ఆర్థిక బిల్లుగా ప్రతిపాదించడమే తప్పు అన్న వాదనాఉంది. దీన్ని అత్యున్నత న్యాయస్థానం పరిశీలించవచ్చు. అంతమాత్రాన అధికారంలో ఉండే రాజకీయ పార్టీకే అధికమొత్తం నిధులు అందడానికి అడ్డుకట్ట వేయడం కుదరదు. ఈ అంశాన్ని సుప్రీంకోర్టు ఏ దృక్పథంతో చూస్తుందో చూడాల్సిందే.

దిల్లీ ఉన్నతాధికారుల నియామక బిల్లును సెలెక్ట్ కమిటీకి నివేదించాలని కోరుతూ ఆమ్ ఆద్మీ పార్టీ నాయకుడు రాజ్యసభలో ఓ తీర్మానం ప్రవేశ పెట్టారు. ఈ తీర్మానం ప్రతిపాదించడానికి ముందు తమ అంగీకారం తీసుకోలేదని ముగ్గురు బీజేపీ సభ్యులు, ఒక బిజూ జనతాదళ్ సభ్యుడు ఫిర్యాదు చేశారు. ఇలాంటి సందర్భాలు మునుపూ ఉన్నాయి. అభ్యంతరం చెప్పిన వారి పేర్లను తొలగించేవారు. ఈ సారి మాత్రం రాఘవ చడ్డాను నిరవధికంగా సభనుంచి సస్పెండ్ చేశారు. ఎంపీలను సస్పెండ్ చేయడం కొత్తకాదు. మహా అయితే అత్యధికంగా ఆ సమావేశాల కాలం దాకా సస్పెండ్ చేస్తారు. కానీ రాజ్యసభ అధ్యక్షుడు జగదీప్ ధన్‌కర్ హయాంలో ఈ నియమాన్ని పాటించకుండా నిరవధికంగా సస్పెండు చేశారు. రాజ్య సభ నియమాల ప్రకారం ఇలా సస్పెండ్ చేయడానికి వీలులేదు అని చడ్డా సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ కేదు కూడా అక్టోబర్ 30న తేలవచ్చు. దిల్లీ మద్యం కుంభకోణంలో మనీశ్ సిసోడియా నెలల తరబడి జైలులో మగ్గిపోతున్నారు. ఆయనకు కనీసం బెయిలు కూడా మంజూరు కావడం లేదు. సంజయ్ సింగ్ పరిస్థితీ అదే. అయితే ఈ కేసు విచారణా క్రమంలో మద్యం కుంభకోణంలో డబ్బు ఎవరికి అందింది అన్న సమాధానం మాత్రం ప్రభుత్వం దగ్గరలేదు. ఈ డబ్బు ఆమ్ ఆద్మీ పార్టీకి అందింది కనక ఆ పార్టీ మీద కూడా కేసు పెడ్తామని సుప్రీంకోర్టు నిలదీసిన తరవాత ఎన్‌ఫోర్స్‌మెంటు డైరెక్టొరేట్ చెప్తోంది. న్యూస్ క్లిక్ సంపాదకుడిని అరెస్టయితే చేశారు కానీ ఎందుకు అరెస్టు చేశారో మాత్రం చెప్పరు. ఈ అంశాన్ని మీడియా సంస్థలు రాష్ట్రపతికి రాసిన లేఖలో ఫిర్యాదు చేశాయి. రక్షణ దళాల త్యాగాలను, పరాక్రమాన్ని ఎన్నికల ప్రయోజనం కోసం వాడుకోవడం ప్రధాన మంత్రి మోదీకి అలవాటైన వ్యవహారమే. తాజాగా కేంద్రప్రభుత్వ కీలక పథకాలను ప్రచారంచేసే బాధ్యతను సైతం మోదీ సర్కారు సేనలకు అప్పగించింది. దీనికోసం కొన్ని సెల్ఫీ పాయింట్లు ఏర్పాటు చేస్తారట. ఆ సెల్ఫీ పాయింట్లలో ప్రభుత్వ పథకాల సమాచారంతోపాటు మోదీ ఫొటోలు కూడా ఉంటాయి. అంటే ఆ సెల్ఫీ పాయింట్ల దగ్గర ఫొటోలు దిగి తరించామని సంతృప్తి పడేవారికి మోదీ ఫొటోలను ఉచితంగా తమ కెమెరాల్లో బంధించే అవకాశం కల్పించారు. కేంద్ర ప్రభుత్వ వ్యవహారం చూస్తుంటే అదే పనిగా నేరంచేసే వారిలా వ్యవహరిస్తోంది. సుప్రీంకోర్టు త్వరలో విచారించనున్న కేసులలో తీర్పులు ఎలా ఉంటాయన్న దాని మీద మోదీ ప్రభుత్వం బోనులో నిలబడుతుందో లేదో తేలిపోతుంది. బాలవర్థి రాజు ప్రాణం చిలకలో ఉన్నట్టు మోదీ భవిత ఇప్పుడు సుప్రీంకోర్టు చేతిలో ఉంది.

భారత్-శ్రీలంక మధ్య మళ్లీ పడవప్రయాణం!

-తీర్థాంకర్ మిత్ర

శ్రీలంక-భారత్ దేశాల మధ్య చాలాకాలంగా నిలిచిపోయిన పడవ ప్రయాణం తిరిగి పునరుద్ధరణ చేయాలని నిర్ణయించారు. రెండు దేశాలమధ్య ద్వైపాక్షిక సంబంధాలను పడవప్రయాణం ద్వారా పునరుద్ధరించారు. ఈ ప్రయాణం ద్వారా టూరిజం పెరుగుతున్నది. రెండు దేశాల ప్రజల మధ్య సంబంధాలు పెరుగుతాయి. పడవ ప్రయాణాన్ని తమిళనాడులోని నాగపట్నం దగ్గర నుంచి ప్రారంభమవుతుంది. అలాగే చుగ్ నుండి కూడా కంకేశన్‌తురయ్ వరకు పడవలు తిరుగుతాయి. శ్రీలంక ఉత్తరప్రాంతంలో జాఫ్నాలో ఈ కంకేశన్‌తురయ్ ఉంది. అక్టోబరు 18వ తేదీ నుంచి అత్యంత వేగంగా నడిచే పడవ ప్రయాణం ప్రారంభమైంది. మొదటి పడవ పేరు చెరియపణి. ప్రథమంగా చెరియపణిని నడపడం ద్వారా రెండు దేశాల మధ్య సంబంధాలు ఏర్పడ్డాయి. గతంలో తూతుక్కుడి, కొలంబో మధ్య అప్పటి మద్రాసు మీదుగా ఇండో సిలోన్ ఎక్స్‌ప్రెస్ పడవ ప్రయాణం చేసేది. ప్రాంతీయ అనుసంధానం, పరస్పర సహకారానికి ఇది చిహ్నంగా ఉండింది. అయితే ఆకస్మికంగా ఇండియా-శ్రీలంక మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. 1982లో పౌరుల మధ్య అంతర్యుద్ధంలో పడవప్రయాణం నిలిచిపోయింది. తుపాకికాల్పులు, సాయుధ ఘర్షణలతో జనం చెల్లాచెదురై తీవ్రంగా గాయపడిన సందర్భంలోనే రవాణా ఆగింది. మన పొరుగుదేశంలో జరిగిన అంతర్యుద్ధం వందలు, వేలమంది మరణాలకు దారితీసింది. ధనుష్కోటి, తలైమన్నార్ మధ్య ఎక్కువగా ప్రయాణీకుల రవాణా జరిగింది. బొగ్గుతో నడిచే పడవ రెండు గంటలు మాత్రమే పనిచేసేది.

వలసపాలనా కాలంనాటి రెండు దేశాల మధ్యగల బంధం అంతర్యుద్ధంతో ఆగిపోయింది. తాజాగా పడవప్రయాణం పునరుద్ధరణ జరిగినందున వాణిజ్య లావాదేవీలు కూడా వృద్ధి చెందుతాయి. రెండు దేశాల మధ్య తీరప్రాంతాలు, ఆలయాల సందర్శన యాత్రలు బాగాపెరగనున్నాయి. వాస్తవంగా టూరిజం ద్వారా ఆదాయాలు బాగా పెరగనున్నాయి. చారిత్రక ప్రదేశాలను, సాంస్కృతిక వారసత్వ ప్రదేశాల సందర్శననిమిత్తం ఎక్కువగా రెండు దేశాల మధ్య ప్రయాణాలు అధికమవుతాయి. ఈ సారి కూడా యాత్రికుల రాకపోకలు అలాగే వ్యాపార సంబంధాలు చాలాకాలం కొనసాగుతాయని ఆశిస్తున్నారు. రెండు దేశాల్లో ఉన్న ప్రకృతి అందాలు తమ పూర్వీకులు నిర్మించిన కట్టడాల అవశేషాలు సందర్శనీయంగా ఉంటాయి. స్థానికజాతుల ప్రజల ప్రయాణాలు కూడా అధికమవుతాయి. హోటళ్లు, రెస్టారెంట్లు యాత్రల నిర్వాహకులు విరివిగా తమ కార్యకలాపాలను సాగించనున్నారు. రెండు దేశాలలోనూ వ్యక్తిగతంగా ఉన్న బలమైన సంబంధాల పునరుద్ధరణ జరుగుతాయి. రెండు దేశాల మధ్యసంబంధాల పునరుద్ధరణ నిర్వహణ కీలకంగా ఉంటుంది. ముందుగా పదిరోజులు మాత్రమే పడవులు నడపాలని, ఆ తర్వాత వారానికి మూడురోజులు నడపాలని ప్రణాళిక వేశారు. చాలాకాలం పడవ ప్రయాణాలు నిలిచిపోయి ఏర్పడిన కొరత ఇప్పుడు తీరుతుంది. ద్వైపాక్షిక సంబంధాలు శాశ్వతంగా కొనసాగే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి.

5రాష్ట్రాల్లో రేగుతున్న ఎన్నికల దుమ్ము

మక్కెన సుబ్బారావు



ఐదు రాష్ట్ర అసెంబ్లీల ఎన్నికలకు భారత ఎన్నికల కమిషన్ నగారా మ్రోగించటంతో రాజకీయ పార్టీల హడావుడి పెరిగింది. రాత్రింబవళ్లు ఉరుకుల పరుగులతో నిద్రలేని రాత్రులు మొదలైనాయి. ఎన్నికల షెడ్యూలు ప్రకారం మిజోరంలో నవబరు 7న, చత్తీస్‌ఘడ్‌లో నవంబరు 7,11తేదీల్లో, మధ్యప్రదేశ్‌లో నవంబరు 17న, రాజస్థాన్‌లో నవంబరు 25న, తెలంగాణలో చివరగా నవంబరు 30న పోలింగ్ జరుగుతుంది. ప్రస్తుతం రాజస్థాన్, చత్తీస్‌ఘడ్‌లు కాంగ్రెస్ పాలనలో, మధ్యప్రదేశ్ బీజేపీ ఏలుబడిలో, మిజోరం మిజో నేషనల్ ఫ్రంట్, తెలంగాణ భారత రాష్ట్ర సమితి (బిఆర్ఎస్) పాలనలో ఉన్నాయి. రాజస్థాన్ అసెంబ్లీలో 200 సీట్లు, ఛత్తీస్‌ఘడ్‌లో 90, మధ్యప్రదేశ్‌లో 230, తెంగాణలో 119, మిజోరంలో 40 అసెంబ్లీ సీట్లున్నాయి. ఐదు అసెంబ్లీల ఓట్ల లెక్కింపు డిసెంబరు 3. మొత్తం 16.14 కోట్ల ఓటర్లతో 2024 లోకసభ ఎన్నికలకు సూచిక కానున్నాయి. అయితే 2018 ఎన్నికల్లో అసెంబ్లీలో బీజేపీ వెనుకబడిన రాష్ట్రాల్లో కూడా ఆ పార్టీ అత్యధిక లోకసభ స్థానాలు గెలుచుకుంది. ప్రధాని మోదీ ఆకర్షకశక్తి, పుల్వామాలో జవాన్‌ల వాహనాలపై టెర్రరిస్టు దాడి ఇందుకు కారణంగా ఎన్నికల పండితులు అంచనా వేశారు. ఈ పర్యాయం మోదీ ప్రభావం వెనకపట్టులో ఉందని, ఆసేతు హిమాచలం భావోద్వేగాలను ప్రేరేపించే సమస్యలేదని, ప్రజలుతామ బతుకు భారం గూర్చి ఆలోచనలో ఉన్నారని, అన్నిటికీ మించి 28 ప్రతిపక్ష రాజకీయపార్టీలు 'ఇండియా' కూటమిగా ఏర్పడటంవల్ల పెక్కు స్థానాల్లో ముఖాముఖి పోటీలు బీజేపీకి నష్టదాయకంగా (గత ఎన్నికల్లో 39శాతం ఓట్లతో 303 సీట్లు గెలుచుకుంది బీజేపీ) పరిణమించవచ్చునని పరిశీలకులు భావిస్తున్నారు. ఈ అసెంబ్లీ ఎన్నికలకను 'మినీ కురుక్షేత్రం'గా పరిగణిస్తున్నప్పటికీ ఈ ఈక్వేషన్ పనిచేయదు. ఎందుకంటే, ఈ రాష్ట్రాల్లో కాంగ్రెస్, బీజేపీ మధ్యనే ముఖాముఖీ పోటీ. 'ఇండియా' కూటమి భాగస్వామ్య పక్షాల ఉనికి నామమాత్రం.

ఈ ఎన్నికల్లో ఆయా రాష్ట్రాల్లో పరిపాలన, స్థానిక సమస్యలు, భవిష్యత్‌కు పార్టీల వాగ్దానాలతోపాటు ఓటర్లను ప్రభావితంచేసే సార్వత్రిక అంశాలు మతం, కులం, డబ్బు. బీజేపీ-ఆర్ఎస్ఎస్ మతవాదానికి వ్యతిరేకంగా కాంగ్రెస్ కులజనగణన సమస్యలను రాజకీయాస్త్రంగా ముందుకు తెచ్చారు. ఇది మొత్తంగా ఇండియా కూటమి వైఖరికూడా. సామాజిక న్యాయసాధన నిమిత్తం దేశజనాభా లెక్కలతోపాటు వెనకబడిన తరగతులు (ఓబీసీ) జనగణన చేపట్టాలనే డిమాండ్ చాలాకాలంగా ఉంది. విద్య, ఉద్యోగాల, అభివృద్ధి వనరుల పంపిణీలో జనాభా నిష్పత్తినిపాటించి ప్రాధాన్యత ఇవ్వకపోతే మరో ఏడు దశాబ్దాలు గడిచినా జనాభాలోని మెజారిటీని వెనకబాటుతనం నుంచి బైటకు తీసుకురావటం సాధ్యం కాదనేది ఈ డిమాండ్ వెనుకఉన్న తార్కికత. అయితే అగ్రవర్ణాలవారి నాయకత్వాలు ఇందుకు వ్యతిరేకం. కాంగ్రెస్ రాజకీయావసరంగా కావచ్చు, వాస్తవికతను గ్రహించికావచ్చు బీసీ కులాల జనగణనను బలపరుస్తున్నది. బీజేపీ దీన్ని వ్యతిరేకిస్తోంది. బిహార్ రాష్ట్ర ప్రభుత్వం కులగణన నిర్వహించి, స్థూల విశ్లేషణను ప్రకటించాక ఆ డిమాండ్ మరింత బలం పుంజుకుంది. అనేక రాష్ట్రాల్లో ఈ డిమాండ్ ముందుకొచ్చింది. ప్రజల పురోభివృద్ధితో ముడిపడి ఈ అంశాన్ని హిందుత్వవాదం, మోదీ ఆకర్షణ, వ్యక్తిపూజ పూర్వపక్షం చేయడం సాధ్యంకాదు. బీజేపీ భయపడుతోంది. ప్రభుత్వాలు పేదల ఉద్ధరణకు ప్రకటించే ఉచితాలవల్ల ఆర్థికవ్యవస్థలు గుల్లఅవుతాయని, ఒక్కొక్క రాష్ట్రం మరో శ్రీలంకలాగా చిప్పచేత పట్టుకునే పరిస్థితి దాపురిస్తుందని హెచ్చరికలు చేసిన ప్రధానమంత్రి ఇప్పుడు అసెంబ్లీ ఎన్నికల్లో ప్రతిపక్షాలు తలదన్నేలా తమ పార్టీ "రేవడీలు" (మిఠాయిలు) ప్రకటించడాన్ని అనుమతిస్తుండటం దానికి సూచిక. బీజేపీ ధనశక్తిని తట్టుకోవడం ప్రతిపక్షాల ముందున్న మరో సవాలు.

రాజకీయ పార్టీలకు అజ్ఞాత విరాళాలుగాక, గోప్యత విరాళాలను 'ఎన్నికల బాండ్ల' పేరుతో చట్టబద్ధం చేసిన ఈ 8 సంవత్సరాల్లో కార్పొరేట్‌లు ఇచ్చిన అటువంటి వేల కోట్ల విరాళాల్లో దాదాపు 90శాతం బీజేపీకే దక్కాయి. ఆ ధనప్రవాహాన్ని ఎన్నికల్లో భారీగా వ్యయం చేయటానికేగాక, ప్రజలు మెజారిటీ ఇవ్వనప్పుడు ప్రతిపక్ష ఎమ్మెల్యేలను కొనుగోలుచేసి అధికారం గెహ్లాత్ చేజిక్కించుకునేందుకు విరివిగా వెచ్చిస్తోంది.

రాజస్థాన్‌లో 1998 నుంచి ప్రతి ఎన్నికల్లో బీజేపీ-కాంగ్రెస్ మధ్య అధికారం చేతులు మారుతోంది. ఈ పర్యాయం ఓటర్లు ఆ సాంప్రదాయాన్ని మార్చుతారా లేక కేరళలాగా పాలకపక్షానికి వరుసగా రెండవసారి అధికారం ఇస్తారో వేచిచూడాలి. ప్రధానంగా ముఖ్యమంత్రి గెహ్లాత్ అమలుచేసిన సంక్షేమ కార్యక్రమాలు గెలిపిస్తాయని కాంగ్రెస్ విశ్వసిస్తోంది. ఇక కాంగ్రెస్, బీజేపీలు రెండింటిలో గ్రూపులు, అంతర్గత కుమ్ములాటలు మామూలే. కాంగ్రెస్‌లో మాజీ పీసీసీ అధ్యక్షుడు, మాజీ ఉపముఖ్యమంత్రి సచిన్‌పైలెట్ అసమ్మతి గ్రూపును పార్టీ అధిష్టానం ముందుగానే చల్లబరిచింది. గతంలో తిరుగుబాటు చేయకుండా ఉన్నట్లయితే ఉప ముఖ్యమంత్రిగా కొనసాగుతుండేవాడు. అయితే మధ్యప్రదేశ్‌లో లాగా జ్యోతిరాదిత్య సింధియాలాగా సచిన్ బీజేపీలోకి వెళ్లకపోవడం కాంగ్రెస్‌ను రక్షించింది. బీజేపీ ముగ్గురు కేంద్ర మంత్రులు సహా ఏడుగురు ఎంపీలకు అసెంబ్లీ ఎన్నికల్లో దించడం ఏదిఏమైనా అధికారం దక్కించుకోవాలనే తాపత్రయాన్ని సూచిస్తున్నది. వసుంధర రాజే ప్రాధాన్యతను తగ్గించిన పార్టీ మోదీకి, పార్టీ గుర్తుకు ఓటును కోరుతోంది. ప్రత్యర్థి పార్టీలు రెండు ఉచిత పథకాలను ఉదారంగా ప్రకటించాయి.

మధ్యప్రదేశ్, గుజరాత్ తదుపరి హిందూత్వ ప్రయోగశాల. 2018 ఎన్నికల తదుపరి ఓ ఏడాదిపాటు మినహా బీజేపీ అధికారంలో ఉంది. శివరాజ్ సింగ్ చౌహాన్ 18సంవత్సరాలుగా ముఖ్యమంత్రిగా ఉన్నారు. ఈ ఎన్నికల తదనంతరం పార్టీకి అధికారం లభిస్తే ముఖ్యమంత్రిని మార్చవచ్చు. పీసీసీ అధ్యక్షుడు కమల్‌నాథ్ నాయకత్వంలో కాంగ్రెస్ అధికారంకోసం తీవ్రంగా ప్రయత్నిస్తోంది. మధ్యప్రదేశ్ నుండి వేరుపడి 2000 సంవత్సరంలో ఏర్పడిన ప్రత్యేక గిరిజన ప్రధాన రాష్ట్రం చత్తీస్‌ఘడ్. గత ఎన్నికల్లో 90 సీట్లలో 29 ఎస్‌టీలకు, 10 ఎస్‌సీలకు రిజర్వుడు. గత ఎన్నికల్లో కాంగ్రెస్ తొలిసారి అధికారంలోకి వచ్చింది. ముఖ్యమంత్రి భూపేష్ భగెల్ గిరిజనులకు, ఇతర పేదలకు చేయూతనిచ్చే నగదు బదిలీ పథకాలు అమలుచేస్తూ పార్టీ పునాదిని పటిష్టం చేశాడు. పోటీ ప్రధానంగా కాంగ్రెస్, బీజేపీ మధ్యే ఉంటుంది.

రాజస్థాన్, మధ్యప్రదేశ్, చత్తీస్‌ఘడ్ హిందూత్వం బలంగా పనిచేసే హిందీ భాషా ప్రాంతం కింద లెక్క కె.చంద్రశేఖరరావు నాయకత్వంలోని బిఆర్ఎస్ అందరికన్నాముందు రంగంలోకి దిగింది. అయితే వచ్చే ఎన్నికల్లో తమదే అధికారం అని గంభీరోపన్యాసాలు చేసిన బీజేపీ ఆ హుషారు కోల్పోయి ఎన్నికలకు ముందే మూడవ స్థానానికి జారిపోవటం ఈ ఎన్నికల విశిష్టత. చచ్చుపడినట్లుండిన కాంగ్రెస్ పార్టీ కర్నాటకలో కాంగ్రెస్ విజయం తదుపరి జవసత్వాలు కూడదీసుకుని నూతనోత్సాహంతో ఉరకలు వేయటం, అసమ్మతినేతల చేరికలు బీజేపీవైపు వెళ్లకుండా గాంధీభవన్‌వైపు మరలటం విశేషం. కాంగ్రెస్ పార్టీ రెండు కమ్యూనిస్టు పార్టీలతోపాటు మరికొన్ని చిన్న పార్టీలతో పొత్తుకు కృషిచేస్తోంది.

ఈశాన్య భారత్‌లో అతి తక్కువ జనాభా కలిగిన అతిచిన్న రాష్ట్రం మిజోరం. 2023 ప్రకారం జనాభా 12లక్షలు. ఇక్కడ ఎన్నికల్లో పౌరసమాజ సంస్థలు ప్రాధాన్యం వహిస్తాయి. పాలక మిజోనేషనల్ ఫ్రంట్ (ఎంఎన్‌ఎఫ్), కాంగ్రెస్ సాంప్రదాయక ప్రత్యర్థులు కాగా, ఈ పర్యాయం జోరం పీపుల్స్ మూవ్‌మెంట్ (జడ్‌పీఎం) మూడవపక్షంగా సవాలు విసురుతోంది. పొరుగు మణిపూర్‌లో జాతుల సంఘర్షణతో కుకి-మిజో ప్రజలకు ఎంఎన్‌ఎఫ్, జడ్‌పీఎం సంఘీభావం తెలియజేస్తున్నాయి. కేవలం జాతి సంబంధ సమస్యలపనేగాక అభివృద్ధి సమస్యలపై దృష్టి పెట్టడంపైనే ఈ సరిహద్దు రాష్ట్రం అభివృద్ధి ఆధారపడి ఉంటుంది.

సీనియర్ జర్నలిస్టు
ఫోన్ : 9390683756

అమెరికా సామ్రాజ్యవాదాన్ని నిలువరించాలి



సంగిరెడ్డి హనుమంతరెడ్డి

ప్రతి దేశం శతాబ్దాల నుండి సొంత చరిత్రతో, సంస్థలతో, సంప్రదాయాలతో, జీవన మార్గాలతో, తాత్వికతలతో పరిణామం చెందింది. ప్రపంచ దేశాల మధ్య జ్ఞానమార్పిడి వంటి నిరంతర పద్ధతుల ద్వారా ఈ పరిణామం సాధ్యపడింది. అయినా ప్రతి దేశం తన లక్షణాలతోనే అభివృద్ధి చెందింది. ఒకరి నుండి మరొకరు తెలుసుకోడమనే ధారావాహిక ప్రక్రియ సమాజాల అభివృద్ధికి, స్వశక్తీకరణకు ఉపకరించింది. సమాజాలు కొత్త విషయాలను గ్రహించి, సొంత లక్షణాలను నిలబెట్టుకున్నాయి. వినూత్న సమ్మిళిత ఆవిష్కరణలతో సృజనాత్మక విజయాలను సాధించాయి. ఒక సమాజంపై మరొక సమాజం ఆధిపత్యం వహించలేదు.

పరస్పర గౌరవంలేని సమాజాలలో అనేక అంశాల ఫలితాలు నకారాత్మకంగా ఉన్నాయి. ఆఫ్రికా దేశాల ప్రజల బానిసత్వం, మానవ హననాలు, నల్లమందు యుద్ధాలు వగైరా విషయాల్లో సాధారణ సారూప్యత కనిపిస్తుంది. ఒక సమాజ ప్రజలు మరొక సమూహ ప్రజల కంటే అధికులు, ఉన్నతులు అన్న ఊహాజనిత భావజాలం ఆధారంగా ఉత్పన్నమైన తీవ్ర అమర్యాద, అణచివేత సంప్రదాయ లక్షణాలే ఆ సారూప్యత. ఎదుటివారి విలువల గుర్తింపు ఆధారంగా జరిగిన జ్ఞాన మార్పిడి, అనుభవాల, కొత్త విషయాల పంపకం శాశ్వత ప్రయోజనాలను చేకూర్చాయి. విభిన్న విధానాలు ఆచరణలో ఘర్షణతో సమాజాలు మానవ హక్కులను సాధించలేవు. ఒకరి విధానం మరొకరి దాని కంటే ఉన్నతమైందని నిరూపించడానికి చర్చలను, వాదనలుగా మార్చిన సందర్భాలలో మానవ హక్కులకే విరుద్ధమైన ఫలితాలు లభించాయి. మానవ హక్కుల సాధనకు భిన్న సమాజాలు విభిన్న విధానాలను ఎందుకు పాటించాయన్న విషయం పరస్పర గౌరవ మర్యాదలతో జరిగే చర్చలతోనే అర్థమవుతుంది. వివిధ దేశాలు విభిన్న మానవ వ్యవహార పద్ధతులను ఆచరిస్తాయి. ఒక సమాజ విధానాలు మరో సమాజానికి ఆచరణ సాధ్యం కాదు. సమాజాల మధ్య ప్రాధాన్యతల, సంప్రదాయాల, చరిత్ర, సంస్కృతుల తేడాలతో ఏకరూప ఆచరణ అసాధ్యం. సమస్యల అవగాహన, అనుభవాలు పంచుకోడం, ఒకరినొకరు అర్థంచేసుకోడం చర్చల లక్ష్యం కావాలి. చర్చల ఫలితంగా ప్రజలు విడిపోరాదు, సమాజం చీలిపోకూడదు. పాలకులు మత ప్రాతిపదికన ఒకరిపై ఒకరిని రెచ్చగొట్టరాదు. కార్పొరేట్ల కొమ్ముకాసి సామాన్యులను బాధలకు గురిచేయరాదు. దేశాల మధ్య సంపద సమీకరణ పోటీ ఉండరాదు.

శాంతి, అభివృద్ధి, సహజీవనం, సహాయ సహకారాలు, ప్రపంచ భాగస్వామ్య లక్ష్యాలు. అంతర్జాతీయ సంబంధాల నిర్వహణలో మత, దాత్రుత్వ సంస్థలకు చోటుండరాదు. ప్రపంచ కూటములు పొరుగు దేశాల, వెనుకబడ్డ దేశాల అభివృద్ధికి ఏర్పడాలి, కృషిచేయాలి. ఒక దేశాన్ని కిందకు లాగడానికి, అనారోగ్య పోటీతో దాని అభివృద్ధిని అడ్డుకోడానికి చిత్రమైన పేర్లతో గుమికూడరాదు. చతుష్టయం (క్వాడ్), త్రయోదశం (ఇండొ-పసిఫిక్ తడిక) ఈ దుష్ట లక్ష్యంతోనే ఏర్పడ్డాయి. జి-7, జి-20 కూటములను పక్షపాత పక్షాలుగా మార్చారు. ఐక్యరాజ్యసమితి (ఐరాస), బ్రెటన్‌వుడ్ సంస్థలైన ప్రపంచ బ్యాంకు, అంతర్జాతీయ ద్రవ్యనిధి అగ్రరాజ్య కనుసన్నల్లో, దానికి అనుకూలంగా, ఇతర దేశాలకు వ్యతిరేకంగా పనిచేస్తున్నాయి. ఈ సంస్థల ఎన్నికల విధానాన్ని మార్చాలి. వీటిని 78 ఏళ్ల అమెరికా, పాశ్చాత్య దేశాల ఆధిపత్యం నుండి రక్షించాలి. ఐరాస స్థిరాభివృద్ధి లక్ష్యాలు నెరవేరాలంటే ప్రపంచ ప్రజలందరికీ, ప్రత్యేకించి వెనుకబడ్డ, అభివృద్ధి చెందుతున్న దేశాల ప్రజలకు, ప్రయోజనాలు చేకూరాలి. ఐరాసను అగ్రరాజ్య బంధం నుండి విముక్తిచేయాలి. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ఐరాస సాధారణసభ సంపన్న దేశాల కోసం కాక సామాన్య ప్రజలకోసం క్రియాశీలకంగా పనిచేయాలి.ప్రపంచీకరణ వ్యవస్థాగత సంస్కరణల అవసరాలకు, సమ్మిళిత విశ్వపాలనకు, ఆధిపత్య దేశాల రహస్య కుట్రల, రాజకీయ ముఠాల అంతానికి, 1945 వరకు ప్రపంచాన్ని ఏలిన వాణిజ్య సంస్థల ప్రయోజనాలకు అడ్డుకట్ట వేయడానికి అన్నబాచితో ప్రపంచ వాణిజ్య సంస్థ దేశాల మధ్య ఆమోదం కుదిరింది. ప్రపంచ వాణిజ్య సంస్థను అమెరికా పాశ్చాత్య దేశాలు స్వలాభానికి స్థాపించుకున్నాయి. చైనా పట్టుబట్టి దానిలో చేరింది. అమెరికాకు కళ్ళెంవేసి ప్రపంచ వాణిజ్య సంస్థను చక్కగా వాడుకుంది. తమ అవసరంతీరి, చైనాను వాణిజ్య పోటీలో ఎదుర్కోలేని అమెరికా ఇప్పుడు దాని అవసరం లేదంటోంది. అమెరికా సామ్రాజ్యవాదాన్ని నిలువరించడం అత్యవసరం. దానికి చైనా-రష్యాల కూటమి బలపడాలి. ఇండియా అమెరికా పంచనచేరి చైనాకు

మోకాలు అడ్డే చర్యలు మానాలి. ప్రపంచ ప్రజలందరికీ ప్రత్యక్షంగా, న్యాయబద్ధంగా ప్రపంచ వనరులు, ప్రయోజనాలు, అభివృద్ధి అందాలి. అసమతుల్య, అసమగ్ర బహుళజాతి సంస్థలవృద్ధి స్థానంలో సమగ్ర, సహకార, సమ్మిళిత ప్రజాప్రగతి జరగాలి. అంతర్జాతీయ పెత్తనం పోవాలి. ప్రభావశీల బహుళపక్ష యంత్రాంగం, ప్రాంతీయ క్రియాశీల సహకారం, ప్రజాబలం పెరగాలి. మానవ హక్కుల రక్షణ జరగాలి. మానవాళి బంగారు భవిష్యత్తుకు వివిధ సామాజిక వ్యవస్థల, చరిత్రల, సంస్కృతుల, ప్రగతిశీల భావజాలాల శక్తులు కలిసి పనిచేయాలి. ఉమ్మడి అభివృద్ధిని, ఆసక్తులను, హక్కులను కాపాడు కోవాలి. బాధ్యతలను పంచుకొని సమన్వయశక్తితో నూతన ప్రగతిశీల ప్రపంచ సాధనకు కృషిచేయాలి.

బహుళరంగ, బహుముఖ అభివృద్ధి ప్రపంచ సామాజిక సంపద ఏ దేశానికీ గుత్త సొత్తు కాదు. అభివృద్ధిచెందిన దేశాలు తమ సాంకేతిక సంగణీకరణ (డిజిటల్) అభివృద్ధిని ఇతర ప్రపంచ దేశాలకు పంచాలి. అంతర్జాతీయ సంగణీకరణ సమాజాన్ని నిర్మించాలి. ఆధునిక, యాంత్రీకరణ ప్రపంచానికి సాంకేతిక సాధికారత అత్యవసరం. పర్యావరణ కాలుష్యాన్ని అరికట్టాలి. ప్రజలకు విద్య, వైద్యం ఉచితంగా అందించాలి. ప్రజారోగ్య వ్యవస్థను పెంపొందించాలి. జీవవైవిధ్యాన్ని కాపాడాలి. కర్బన ఉద్గారాల తగ్గింపుతో భూతాపాన్ని తగ్గించాలి. కార్పొరేట్ సంస్థల కొమ్ముకాసే ప్రభుత్వాలు ఈ పనులు చేయవు.

మానవ హక్కుల ఉల్లంఘనలలో పేదరికం ప్రధానమైంది. ఉపాధిరాహిత్యం, జీవన సమస్యల పరిష్కారంలో సంఘర్షణతో ప్రజలు తీవ్ర వత్తిడికి గురవుతున్నారు. విద్య కార్పొరేటీకరణ సామాన్యులను చదువుకు దూరం చేసింది. విద్యారాహిత్యం ఆలోచనాశక్తిని, ప్రశ్నించే తత్వాన్ని, వివేక విచక్షణలను తగ్గించింది. కార్పొరేట్ వైద్యం ప్రజలను పేదరికానికి నెట్టింది. ఆకలిదప్పులతో పోరాడుతున్న ప్రజలు పాలక పొరపాట్లను పట్టించుకోలేరు. సామాజికమార్పు వారి బుర్రకు అందని అంశం. పాలకులు అధికార పునఃసంపాదన ప్రయత్నాల్లో మునిగారు. వారికి ప్రజాసమస్యలు, మానవ హక్కులు పట్టవు. మతవాద ప్రభుత్వాల పెరుగుదల నేటి ప్రపంచానికి పట్టిన కొత్త పీడ. చీడ. ఈ ప్రభుత్వాధినేతలు మానవత్వం మరిచిన మతోన్మాదులు. పౌరసంఘాలు, ప్రగతిశీల సామాజిక సంస్థలు, ప్రజాపక్ష రాజకీయ పార్టీలు స్వీయ సంస్కరణలతో నూతన పద్ధతులలో ప్రజలను చైతన్యపరచాలి.

సహజ సంపదల, ప్రకృతి వనరుల దోపిడీకి, ప్రపంచ వాణిజ్య ఆధిపత్యానికి, అధిక లాభాల కోసం సామ్రాజ్యవాద దేశాలు యుద్ధాలను ప్రోత్సహిస్తాయి. ఇరు పక్షాలకు ఆ దేశాల కార్పొరేట్ సంస్థలు తమయుద్ధ సామగ్రిని, ఆయుధాలను అమ్ముతాయి. అభివృద్ధికి శాంతి ముందస్తు అవసరం. యుద్ధాలలో పేదలు, స్త్రీలు, పిల్లలు, వలస కార్మికులు, శరణార్థులు ప్రధాన బాధితులు. యుద్ధాలు మానవ హక్కులను హరిస్తాయి. మానవవాద పాలకులను, ప్రజాహిత పార్టీలను ఎన్నుకోడమే మానవ హక్కుల రక్షణ మార్గం.

ఆల్ ఇండియా ప్రోగ్రెసివ్ ఫోరం జాతీయ కార్యదర్శి,
సంచారవాణి: 9490 20 4545

ఎట్టకేలకు రాష్ట్రపతి స్వస్థలానికి ప్యాసింజర్ రైలు

భువనేశ్వర్: భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము స్వస్థలం ఒడిశాలోని రాయ్‌రంగ్‌పూర్, బాదంపహార్ రూట్‌లో మొట్టమొదటిసారిగా ప్యాసింజర్ రైలు సేవలు అందుబాటులోకి రాబోతున్నాయి. టాటా-బాదంపహార్ రూట్‌లో మెయిల్, ఎక్స్‌ప్రెస్ రైళ్లను ప్రారంభిస్తున్నట్టు రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. అనేక సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న స్థానికుల డిమాండ్‌ను నెరవేర్చామని ఆయన చెప్పారు. రాష్ట్రపతి సొంత జిల్లా మయూర్‌భంజ్‌కు మూడు కొత్త రైళ్లను కేటాయించినట్టు తెలిపారు. ప్రతి శనివారం షాలిమార్‌లో బయల్దేరే వీక్లీ ఎక్స్‌ప్రెస్, బాదంపహార్‌కు అదే రోజు సాయంత్రం 5.40కు చేరుకుంటుంది. బాదంపహార్-రూర్కెలా వీక్లీ ఎక్స్‌ప్రెస్ ప్రతి ఆదివారం ఉదయం బాదంపహార్ నుంచి బయల్దేరుతుంది.

బీజేపీతో పొత్తుపై తిరుగుబాటు

జేడీఎస్ రాష్ట్ర అధ్యక్షుడిపై వేటు
కుమారస్వామికి తాత్కాలిక పగ్గాలు
వర్కింగ్ కమిటీ రద్దు చేసిన దేవెగౌడ

బెంగళూరు: బీజేపీతో పొత్తు జేడీఎస్‌లో ముసలం పుట్టించింది. జేడీఎస్ సీనియర్ నేతలు తిరుగుబాటు బావుటా ఎగురవేస్తున్నారు. బీజేపీతో పొత్తును జేడీఎస్ కర్నాటక రాష్ట్ర అధ్యక్షుడు సీఎం ఇబ్రహీం బహిరంగంగా వ్యతిరేకించారు. దీంతో ఆయనపై జేడీఎస్ వ్యవస్థాపకుడు, మాజీ ప్రధాని హెచ్‌డీ దేవెగౌడ వేటు వేశారు. పార్టీ రాష్ట్ర అధ్యక్ష పదవి నుంచి గురువారం తొలగించారు. దీంతోపాటు రాష్ట్ర వర్కింగ్ కమిటీని సైతం రద్దు చేశారు. జేడీఎస్ రాష్ట్ర శాఖ తాత్కాలిక అధ్యక్షుడిగా తన కుమారుడు, మాజీ సీఎం హెచ్‌డీ కుమారస్వామిని నియమించారు. దేవెగౌడ ఇక్కడ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పార్టీ నిబంధనావళి ప్రకారం సీఎం ఇబ్రహీంను తొలగించినట్లు ప్రకటించారు. ఇబ్రహీంను తొలగించి ఆయన స్థానంలో కుమారస్వామిని నియమించినట్లు చెప్పారు. రెండుసార్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన కుమారస్వామి శాసనసభాపక్ష నేతగా కూడా పనిచేస్తున్నారు. రానున్న లోకసభ ఎన్నికల కోసం బీజేపీతో జేడీఎస్ పొత్తు నిర్ణయాన్ని ఇబ్రహీం బహిరంగంగా వ్యతిరేకించడంతో దేవెగౌడ ఈ నార్ణయం తీసుకున్నారు. బీజేపీతో పొత్తు నేపథ్యంలో జేడీఎస్‌లో భావసారూప్యత గల నాయకులతో అక్టోబరు 16న ఇబ్రహీం సమావేశమయ్యారు. జేడీఎస్ పార్టీ తనదేనని ప్రకటించారు. బీజేపీతో జేడీఎస్ పొత్తు పెట్టుకోవడం లేదని తెలుపుతూ వినతిపత్రం ఇవ్వాలని, త్వరలో కోర్ కమిటీ ఏర్పాటు చేయనున్నట్లు ఇబ్రహీం ప్రకటించారు. తమిళనాడు, మహారాష్ట్ర, కేరళ సహా అన్ని రాష్ట్రాల జేడీఎస్ కమిటీలు బీజేపీత పొత్తుకు సమ్మతించాయని దేవెగౌడ వివరించారు. 'కేరళలో మేము ప్రభుత్వంలో భాగస్వాములం. అక్కడ మా ఎమ్మెల్యే మంత్రి. బీజేపీతో పొత్తుకు దారితీసిన పరిణామాలను అన్ని రాష్ట్ర శాఖలు అర్థం చేసుకున్నాయి. మా నిర్ణయానికి మద్దతిచ్చాయి. కేరళలో లెఫ్ట్‌ఫ్రంట్ ప్రభుత్వంలో మంత్రిగా పనిచేస్తున్న కె.కృష్ణన్‌కుట్టి మాకు మద్దతి ప్రకటించారు' అని దేవెగౌడ తెలిపారు. కర్నాటకలో పార్టీని కాపాడుకోవడం కోసం బీజేపీతో పొత్తును కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ అర్థం చేసుకున్నారని చెప్పారు. జేడీఎస్‌లో గల చాలామంది ముస్లిం నేతలు సైతం బీజేపీతో పొత్తుపై పార్టీ నిర్ణయాన్ని సమర్థించినట్లు పేర్కొన్నారు.

మిజోరంలో 4స్థానాల్లో ఆప్ పోటీ

ఐజ్వాల్: మిజోరం అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి ఆమ్‌ఆద్మీ పార్టీ (ఆప్) గురువారం నాలుగు స్థానాలకు అభ్యర్థులను ప్రకటించింది. అందులో కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడిని పోటీ చేస్తున్న స్థానాలున్నాయి. ఆప్ ఈశాన్య ప్రాంత ఇన్‌చార్జి రాజేశ్ శర్మ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ... నామినేషన్ పత్రాల దాఖలుకు చివరి తేదీ శుక్రవారం మరో ఒకట్రెండు స్థానాలకు కూడా పార్టీ అభ్యర్థులను ప్రకటించవచ్చని తెలిపారు. మిజోరాం సర్వతోముఖాభివృద్ధికి ఆప్ కృషి చేస్తుందని, అవినీతి రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దుతామని చెప్పారు. ఆప్ రాష్ట్ర అధ్యక్షుడు ఆండ్రూ లాల్రెంకిమా ఐజ్వాల్ నార్త్-3 స్థానంలో అధికార ఎంఎన్‌ఎఫ్ అభ్యర్థి సీ లాల్‌మువాన్పుయా, రాష్ట్ర కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు లాల్ తంజారా, జెడ్‌పీఎం వర్కింగ్ చైర్మన్ కె సప్దంగతో పోటీపడనుడగా... ఇక ఆప్ రాష్ట్ర కార్యదర్శి జోసెఫ్ బియాక్థియాంగ్లిమా ఐజ్వాల్ వెస్ట్-3 సీటులో రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షురాలు లాల్సవ్తా, జెడ్‌పీఎం ఎమ్మెల్యే వీఎల్ జైతంజామా, ఎంఎన్‌ఎఫ్ అభ్యర్థి కే సవమ్‌వేలాపై పోటీ చేస్తున్నారు. కాగా ఐజ్వాల్ వెస్ట్-1 స్థానం నుండి వన్‌లాల్మావియా వాంఛాంగ్‌ను ఆప్ బరిలో దింపుతోంది. ఐజ్వాల్ సౌత్-1 సీటులో లాల్‌గైహావ్మా పచావును ఆప్ ఎంపిక చేసింది. ఎంఎన్‌ఎఫ్, జెడ్‌పీఎం, కాంగ్రెస్ పార్టీలు మొత్తం 40 స్థానాల్లోనూ తమ అభ్యర్థులను పోటీ పెడుతుండగా... బీజేపీ 23 స్థానాల్లో పోటీచేస్తోంది. రిటైర్డ్ పాస్టర్ జైచావ్నా ఖ్లోవాన్డో నేతృత్వంలోని జోరంథార్ గ్రూప్ 18 స్థానాల్లో పోటీ చేస్తోంది. మిజోరంలో నవంబర్ 7న ఒకే దశలో పోలింగ్ జరగనుంది. డిసెంబర్ 3న ఓట్ల లెక్కింపు జరుగుతుంది.

ఉద్యోగాలిప్పిస్తామని రూ.12 లక్షలు స్వాహా

థానే: మహారాష్ట్రలోని నవీ ముంబైలో ఇద్దరు ఉద్యోగార్థులను మోసగించి రూ.12 లక్షలకు పైగా కొట్టేసిన నలుగురు వ్యక్తులపై పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితులు జవహర్‌లాల్ నెహ్రూ పోర్ట్ ట్రస్ట్ (జేఎన్‌పీటీ)లో ఉద్యోగం ఇప్పిస్తామని నమ్మబలికి... సెప్టెంబర్ 2021- అక్టోబర్ 2023 మధ్య కాలంలో కొల్హాపూర్ నివాసితులైన ఫిర్యాదుదారుల నుండి మొత్తం రూ.12.35 లక్షలు వసూలు చేశారు. నలుగురూ వాట్సాప్ ద్వారా నియామక లేఖలు, ఎంపిక జాబితాను కూడా పంపారు. అనికేత్ అథవాలే, అభిజిత్ సాలుంకే, అలియాస్ అభిజిత్ కోర్, సచిన్ జాదవ్,మనోజ్ మోహితేలుగా గుర్తించిన నిందితులతో అనేకసార్లు మాట్లాడినప్పటికీ ఉద్యోగాలు రాకపోవడంతో బాధితులు తమ డబ్బును వాపసు చేయాలని డిమాండ్ చేశారు. దీనిపై కూడా వారు స్పందించకపోవడంతో బాధితులు ఇద్దరూ నవీ ముంబైలోని ఖండేశ్వర్ పోలీసులను ఆశ్రయించారు. మోసం, ఫోర్జరీకి సంబంధించి భారతీయ శిక్షాస్మృతి (ఐపిసి) కింద నలుగురిపై ఎఫ్‌ఐఆర్ నమోదు చేశామని, ఇంకా ఎవరినీ అరెస్టు చేయలేదని పోలీసులు తెలిపారు.

అక్రమ తవ్వకాలపై రూ.137 కోట్ల జరిమానా

ఎన్సీపీ ఎమ్మెల్సీ, బీజేపీ ఎంపీకి నోటీసులు

ముంబై: నేషనల్ కాంగ్రెస్‌పార్టీ (ఎన్సీపీ) ఎమ్మెల్సీ ఏక్‌నాథ్ ఖడ్సే, బీజేపీ ఎంపీ అయిన ఆయన కోడలు రక్షా ఖడ్సేకు మహారాష్ట్ర ప్రభుత్వ అధికారులు నోటీసులు జారీ చేశారు. బల్గావ్ జిల్లాలోని తమ భూమిలో అనుమతి లేకుండా అక్రమంగా మట్టి తవ్వకాలు జరిపినందుకు రూ.137 కోట్లు జరిమానా చెల్లించాలని జిల్లా అధికారులు ఆదేశించారు. ఈ మేరకు జలగావ్‌లోని ముక్తైనగర్ తాలూకా తహసీల్దార్ అక్టోబర్ 6న వారికి నోటీసులు పంపారు. అనుమతి లేకుండానే పెద్ద ఎత్తున ఇత్తడి లోహం గల మట్టి, నల్లరాయిని అక్రమంగా తవ్వించారని అధికారులు పేర్కొన్నారు. తవ్వకం జరిగిన భూమి ఏకనాథ్ ఖడ్సే, ఆయన భార్య మందాకిని ఖడ్సే, కూతురు రోహిణి ఖడ్సే, కోడలు రక్షా ఖడ్సేలకు చెందినదని, రూ. 137,14,81,883 జరిమానా మొత్తాన్ని నోటీసు జారీ చేసిన తేదీ నుండి 15 రోజుల్లోగా చెల్లించాలని ఆదేశించారు. దాదాపు నాలుగు దశాబ్దాల పాటు బీజేపీలో ఉన్న ఏకనాథ్ ఖడ్సే, ఆ పార్టీని విడిచిపెట్టి 2020లో శరద్ పవార్ నేతృత్వంలోని నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్సీపీ)లో చేరారు. ప్రస్తుతం ఆయన మహారాష్ట్ర శాసనమండలి సభ్యుడు. ఆయన కోడలు రక్షా ఖడ్సే రావర్ లోకసభ స్థానానికి ప్రాతినిథ్యం వహిస్తున్నారు.

జీఈఎం ద్వారా లక్ష్యాన్ని మించి బొగ్గు సేకరణ

న్యూఢిల్లీ: ఈ ఏడాది ప్రభుత్వ ఇ-మార్కెట్‌ప్లేస్ (జీఇఎం) ద్వారా బొగ్గు సేకరణ ప్రస్తుత సంవత్సరం లక్ష్యాన్ని మించిందని బొగ్గు మంత్రిత్వ శాఖ గురువారం వెల్లడించింది. 'మొత్తం బొగ్గు సేకరణ లక్ష్యం రూ.39,607 కోట్లలో రూ.28,665 కోట్లకు చేరుకోవడం ద్వారా బొగ్గు మంత్రిత్వ శాఖ అక్టోబర్ 15, 2023 నాటికి ప్రస్తుత సంవత్సరానికి జీఈఎమ్ సేకరణ లక్ష్యాన్ని అధిగమించింది. ' అని అధికారిక ప్రకటన తెలిపింది. 2020-21 ఆర్థిక సంవత్సరంలో ఈ వేదిక ద్వారా మొత్తం రూ. 477 కోట్ల బొగ్గు సేకరణ జరగ్గా, అప్పటి నుంచి ఇప్పటివరకు జీఈఎం ద్వారా బొగ్గు సేకరణ నిరంతర వృద్ధిని కనబరుస్తున్నట్లు మంత్రిత్వ శాఖ తెలిపింది.

రామాలయానికి విదేశీ విరాళాలు

కేంద్ర హోం శాఖ అనుమతి

న్యూఢిల్లీ: అయోధ్యలోని రామమందిర నిర్మాణం కోసం విదేశీ విరాళాలు స్వీకరించడానికి కేంద్ర హోం శాఖ అనుమతినిచ్చిందని ఆలయ ట్రస్ట్ జనరల్ సెక్రటరీ చంపత్‌రాయ్ తెలిపారు. విదేశీ భక్తుల నుంచి విరాళాలు స్వీకరించాలంటే ఫారెన్ కంట్రిబ్యూషన్ రెగ్యులేషన్ చట్టం (ఎఫ్‌సీఆర్‌ఏ) అనుమతి తప్పనిసరి అని చెప్పారు. కేంద్ర హోం శాఖ నుంచి ఈ అనుమతి లభించడంతో ఇకపై విదేశీ భక్తుల నుంచి విరాళాలు స్వీకరిస్తామని తెలిపారు. ఎవరైనా విదేశీ భక్తులు విరాళాలు ఇవ్వాలనుకుంటే దిల్లీలోని మెయిన్ బ్రాంచ్‌లో గల ట్రస్ట్ అకౌంట్‌లో జమ చేయవచ్చని సూచించారు.

భూసేకరణకు దేవనహళ్లి రైతుల విముఖత

మరోసారి చర్చిస్తామన్న కర్నాటక మంత్రి

బెంగళూరు: పారిశ్రామిక అవసరాల కోసం భూమి సేకరించడాన్ని దేవనహళ్లి రైతులు వ్యతిరేకిస్తున్నారని, ఈ అంశంపై చర్చించేందుకు అక్టోబర్ 25న సమావేశం కానున్నట్లు కర్నాటక భారీ, మధ్యతరహా పరిశ్రమల శాఖ మంత్రి ఎంబీ పాటిల్ తెలిపారు. బుధవారం ఖనిజా భవన్‌లో రైతులతో ప్రభుత్వం జరిపిన చర్చల్లో ఎలాంటి ఫలితం రాలేదని మంత్రి ఒక ప్రకటనలో తెలిపారు. దేవనహళ్లి తాలూకా చన్నరాయపట్నం హుబ్లీలో కర్నాటక ఇండస్ట్రియల్ ఏరియా డెవలప్‌మెంట్ బోర్డు (కేఐఏడీబీ) కోసం 1777 ఎకరాల భూమిని సేకరించడంపై చర్చించేందుకు అక్టోబర్ 25న మరో సమావేశం నిర్వహించనున్నారు. 13 గ్రామాల ప్రజలు భూసేకరణను వ్యతిరేకిస్తున్నారని పాటిల్ చెప్పారు. సమావేశానికి హాజరైన రైతు నాయకులు బయ్యారెడ్డి, చుక్కి నంజుండస్వామి తదితరులు భూసేకరణను తీవ్రంగా వ్యతిరేకించారు. ఇందుకు సంబంధించి జారీ చేసిన ప్రాథమిక నోటిఫికేషన్‌ను రద్దు చేయాలని, వందలాది రైతు కుటుంబాల జీవితాలు ఈ భూమిపైనే ఆధారపడి ఉన్నాయని వాపోయారు. అక్టోబరు 25న జరిగే సమావేశం విఫలమైతే ముఖ్యమంత్రితో చర్చిస్తామని మంత్రి, రైతు ప్రతినిధులకు తెలిపారు. కేఐఏడీబీ పారిశ్రామికంగా అభివృద్ధి చేసిన ప్రతి ఎకరా భూమికి పరిహారంగా 10,800 చదరపు అడుగుల భూమిని రైతులకు అందించాలనే నిబంధన ఉందని, దానిని వారు వాణిజ్య అవసరాలకు ఉపయోగించవచ్చని పాటిల్ వివరించారు. పరిశ్రమల అభివృద్ధికి అనువుగా ఉన్న దేవనహళ్లి పరిసర ప్రాంతాల్లోనే కాకుండా రాష్ట్రవ్యాప్తంగా బోర్డు భూములను సేకరించే పనిలో ఉందని మంత్రి స్పష్టం చేశారు.

టికెట్లపై భిన్నాభిప్రాయాలు లేవు

రాజస్తాన్ సీఎం అశోక్ గెహ్లాత్ వెల్లడి

న్యూఢిల్లీ: రాష్ట్రంలో అత్యున్నత పదవి వదులుకోవాలని తాను కోరుకుంటున్నానని, అయితే ఆ పదవే తనను వదలడం లేదని రాజస్తాన్ ముఖ్యమంత్రి అశోక్ గెహ్లాత్ గురువారం చెప్పారు. బహుశా భవిష్యత్‌లోనూ ఆ పదవి తనను వదలకపోవచ్చని చెప్పుకొచ్చారు. ఏఐసీసీ ప్రధాన కార్యాలయంలో గెహ్లాత్ విలేకరులతో మాట్లాడుతూ తనలో ఏదో కొత్తదనం ఉందని, అందుకే రాష్ట్రానికి నాయకత్వం వహించడానికి పార్టీ అధిష్ఠానం తనకు మూడుసార్లు అవకాశం ఇచ్చిందని, పార్టీ నాయకత్వం తీసుకున్న ఏ నిర్ణయాన్నైనా అందరూ ఆమోదించాల్సిందేనని చెప్పారు. తన ప్రధాన ప్రత్యర్థి, మాజీ సీఎం వసుంధరరాజెను బీజేపీ తన కారణంగా శిక్షించలేదని, ఆమెకు బీజేపీ అన్యాయం చేస్తోందని వ్యాఖ్యానించారు. 2020లో తిరుగుబాటు కారణంగా తన నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వానికి ముప్పు ఏర్పడినప్పుడు రాజెకు సంబంధించి తాను చేసిన వ్యాఖ్యలను గెహ్లాత్ గుర్తుచేశారు. తమ పార్టీ నేత సచిన్ పైలట్ కారణంగా తమ ప్రభుత్వం తిరుగుబాటును ఎదుర్కొన్నదని, క్షమించు-మర్చిపో సిద్ధాంతాన్ని తాను అవలంబించానని ముఖ్యమంత్రి చెప్పారు. పైలట్ మద్దతుదారులకు పార్టీ టికెట్‌లను తాను వ్యతిరేకించలేదని తెలిపారు. ప్రతిపక్ష పార్టీల నాయకులపై ఈడీ, ఐటీ దాడులను గెహ్లాత్ తీవ్రంగా ఖండించారు. ఎన్నికల నిబంధనావళి అమలులో ఉన్నందున ఈ దాడులు ఆపడంలో జోక్యం చేసుకోవాలని ప్రధాని నరేంద్రమోదీకి విజ్ఞప్తి చేశారు. ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల తేదీలు ప్రకటించినందున ఈ విషయంలో జోక్యం చేసుకోవాలని ఎన్నికలకు కమిషన్‌కు సైతం విన్నవించారు. టికెట్ల కేటాయింపుపై పార్టీలో వైరుధ్యాలు ఏమైనా ఉన్నాయా అని అడుగగా అలాంటి పరిస్థితి ఏమీ లేదని గెహ్లాత్ స్పష్టంచేశారు. నిర్ణయాలన్నీ ఏకగ్రీవంగానే తీసుకుంటున్నామన్నారు. రాజస్తాన్ అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి బీజేపీ ఇప్పటికే అభ్యర్థుల మొదటి జాబితా విడుదల చేసినందున కాంగ్రెస్ పార్టీ ఎప్పుడు ప్రకటిస్తుందని అడుగగా ముఖ్యమంత్రి నేరుగా సమాధానం చెప్పలేదు.

విజృంభిస్తున్న డెంగ్యూ

యూపీలో 24 మంది మృతి

న్యూఢిల్లీ: దేశంలోని వివిధ రాష్ట్రాల్లో డెంగ్యూ, చికున్‌గున్యా కేసులు విపరీతంగా పెరుగుతున్నాయి. దేశ రాజధాని దిల్లీ ప్రాంతంతో పాటు ఉత్తర భారతదేశంలో చాలామంది ఈ వైరస్‌లతో బాధపడుతున్నారు. డెంగ్యూతో ఆసుపత్రుల్లో రోగుల సంఖ్యతో పాటు మరణాలు పెరుగుతుండడంపై సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతున్నది. ముఖ్యంగా దిల్లీతో పాటు ఉత్తరప్రదేశ్, బీహార్, హర్యానా, పంజాబ్‌లో డెంగ్యూ కేసులు ఎక్కువగా నమోదవుతున్నాయి. డెంగ్యూ జ్వరాలు వేగంగా విస్తరిస్తున్న నేపథ్యంలో ప్రజలు దోమలబారినపడకుండా చర్యలు తీసుకోవాలని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు. డెంగ్యూ వ్యాధిని కలిగించే దోమలు ఎక్కువగా పగటిపూట కుడతాయని, శరీర భాగాలను కప్పి ఉంచేలా దుస్తులను ధరించాలని సూచిస్తున్నారు.

ఉత్తరప్రదేశ్, బీహార్‌లో పరిస్థితి దారుణంగా ఉన్నది. ఇతర రాష్ట్రాలతో పోలిస్తే ఇక్కడ డెంగ్యూ ఉధృతమవుతున్నది. ఉత్తరప్రదేశ్‌లో ప్రభుత్వ గణాంకాల ప్రకారం ఇప్పటివరకు డెంగ్యూతో 24 మంది ప్రాణాలు కోల్పోయారు. ప్రైవేటు ఆసుపత్రుల్లోనూ నమోదవుతున్న కేసులను పరిగణలోకి తీసుకుంటే మరింత పెరిగే అవకాశం ఉంది. రాష్ట్రంలో నమోదైన కేసుల సంఖ్య 13వేలు దాటింది. గత 24గంటల్లో కొత్తగా 600పైగా కేసులు నమోదయ్యాయి. బీహార్‌లో గడిచిన 48 గంటల్లో 373 కొత్త కేసులు నమోదయ్యాయి. పాట్నా జిల్లాలోనే అత్యధికంగా 178 కేసులు రికార్డయ్యాయి. ఈ ఏడాది ఇప్పటివరకు రాష్ట్రంలో డెంగ్యూ కేసుల సంఖ్య 11,675 చేరింది. అక్టోబర్‌లోనే 4,940 కేసులు నమోదయ్యాయి. జ్వరంతో వస్తున్న చాలా మందికి డెంగ్యూ నిర్ధారణ అవుతోందని గ్రేటర్ నోయిడా ఎమర్జెన్సీ విభాగానికి చెందిన డాక్టర్ అమీర్ సిద్దిఖీ తెలిపారు. రక్తంలో ప్లేట్‌లెట్స్ వేగంగా పడిపోతున్నాయని, దీంతో తీవ్రమైన హెమరేజిక్ డెంగ్యూకి కారణమయ్యే అవకాశాలున్నాయన్నారు. అలాంటి వారిని ఆసుపత్రిలో చేర్చాల్సి ఉంటుందని.. తీవ్రమైన సందర్భాల్లో చికిత్స ఆలస్యమైతే ఇతర ఆరోగ్య సమస్యలకు దారితీస్తుందని చెప్పారు.

ఇజ్రాయిల్‌పై మోదీ తీరు ఆక్షేపణీయం

కాంగ్రెస్ సీనియర్ నేత కేసీ వేణుగోపాల్

న్యూఢిల్లీ : ఇజ్రాయిల్-పలస్తీనా యుద్ధంపై కేంద్రంలోని మోదీ ప్రభుత్వ వైఖరిపై ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. గాజా ఆస్పత్రిపై దాడిలో పెద్దసంఖ్యలో ప్రజలు ప్రాణాలు కోల్పోవడం పట్ల ప్రధాని నరేంద్ర మోదీ దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన తరువాత రోజు కాంగ్రెస్ సీనియర్ నేత పై కీలక వ్యాఖ్యలు చేశారు. ఇజ్రాయిల్-హమాస్ యుద్ధంపై కేంద్ర ప్రభుత్వం వైఖరి సరైంది కాదని, ఇది తీవ్రంగా నిరుత్సాహపరిచేలా ఉందని వ్యాఖ్యానించారు. ప్రతి దాడుల్లో మహిళలు, చిన్నారులు చిక్కుకుని నిస్తేజంగా మారితే దీనికి వ్యతిరేకంగా భారత్ తీవ్ర వైఖరి తీసుకోకుండా ఉండటం సరైంది కాదని అన్నారు. ఇజ్రాయిల్-పాలస్తీనా వ్యవహారంలో భారత ప్రభుత్వ వైఖరి నిరుత్సాహపరిచేలా ఉందన్నారు. ఈ అంశంపై భారత్ వైఖరి తొలి నుంచీ భిన్నంగానే ఉందని అన్నారు. ఇజ్రాయిల్-హమాస్ యుద్ధంలో పౌరుల మరణాలు ఆందోళన రేకెత్తిస్తున్నాయని, దీనికి పాల్పడిన వారిని బాధ్యులను చేయాలని ప్రధాని మోదీ పేర్కొన్నారు. కాగా, భారత్ పాలస్తీనా వాదానికి మద్దతిస్తుందని, వారి హక్కుల కోసం వారి పక్షాన నిలిచిందని వేణుగోపాల్ గుర్తుచేశారు. భారత్ వైఖరి ప్రస్తుత యుద్ధానికి తెరదించే స్థాయిలో లేదని అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇజ్రాయిల్-పలస్తీనా వ్యవహారంపై గతంలో మాదిరి భారత్ హుందాగా వ్యవహరించాలని అన్నారు. ఇజ్రాయెల్, పాలస్తీనా విధిగా అంతర్జాతీయ మానవతా చట్టాలకు కట్టుబడి ఉండాలన్నారు.

నారీ శక్తి వందన్ సమ్మేళన్ రసాభాస

యూపీలో కొట్టుకున్న బీజేపీ మహిళా కార్యకర్తలు

లక్నో: ఉత్తరప్రదేశ్‌లో బీజేపీ మహిళా కార్యకర్తలు రోడ్డెక్కి ఒకరినొకరు ఇష్టమున్నట్టు కొట్టుకున్నారు. బీజేపీ మహిళా మోర్చా, ఇతర నాయకుల ఆధ్వర్యంలో బుధవారం జలౌన్ జిల్లాలో ఏర్పాటుచేసిన 'నారీ శక్తి వందన్ సమ్మేళన్' కార్యక్రమం రసాభాసగా మారింది. మహిళా కార్యకర్తల్లో కొంత మంది నడిరోడ్డుపైకి వచ్చి ఒకరి జుట్టు మరొకరు పట్టుకొని ఇష్టము న్నట్టు కొట్టుకున్నారు. పురుషులు కూడా మహిళల వీపులపై ఇష్టమున్నట్టు బాదారు. దీనికి సంబంధించిన వీడియో సోషల్‌మీడియాలో వైరల్‌గా మారి ంది. యోగి పాలన ఎంత అధ్వానంగా ఉందో ఈ ఘటన తెలుపుతోందం టూ ప్రతిపక్షాలు ఎస్పీ, కాంగ్రెస్, బీఎస్పీ వ్యాఖ్యానించాయి. యోగి పార్టీ కార్యకర్తలకు క్రమశిక్షణ నేర్పించాలని సమాజ్‌వాదీ పార్టీ సూచించింది.

మణిపూర్ గవర్నర్‌కు నిరసన సెగ

ఇంఫాల్: మణిపూర్ గవర్నర్ అనసూయి యూకీకి కుకీ గిరిజన మహిళల నుంచి తీవ్ర నిరసన ఎదురైంది. బుధవారం ఉదయం చురాచాంద్‌పూర్‌లో గవర్నర్ పర్యటనను గిరిజన మహిళలు అడ్డుకున్నారు. మైతీలు అత్యధికంగా ఉన్న రాజధాని ఇంఫాల్‌లో తాము అడుగుపెట్టే పరిస్థితి లేదని, తమకు ప్రత్యేక పాలనా యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలని వారు గవర్నర్‌ను డిమాండ్ చేశారు. దీంతో అక్కడ ఉద్రిక్త వాతావరణం నెలకొంది. గిరిజనుల డిమాండ్‌ను వివిధ వేదికలపై ప్రస్తావిస్తానని, తనను ముందుకు వెళ్లనివ్వాలని గవర్నర్ వారిని కోరారు. మే 3న మొదలైన మణిపూర్ అల్లర్లలో వేలాదిమంది కుకీ గిరిజనులు శరణార్థులుగా మారారు. ఘర్షణల్లో వందలాది మంది అమాయక పౌరులు ప్రాణాలు కోల్పోయారు.

30లోగా కౌంటరు దాఖలు చేయండి

పురకాయస్థ అరెస్టుపై దిల్లీ పోలీసులకు సుప్రీం ఆదేశం

న్యూఢిల్లీ: ఉగ్రవాద నిరోధక చట్టం 'ఉపా' కింద అరెస్టు చేయడాన్ని సవాల్‌చేస్తూ న్యూస్‌క్లిక్ వ్యవస్థాపకుడు ప్రబీర్ పురకాయస్థ, హెచ్‌ఆర్ హెడ్ అమిత్ చక్రవర్తి వేసిన పిటిషన్లపై సుప్రీంకోర్టులో బుధవారం విచారణ జరిగింది. దీనిపై కౌంటర్ దాఖలు చేయాలని దిల్లీ పోలీసులను అత్యున్నత న్యాయస్థానం ఆదేశించింది. న్యాయమూర్తులు బీఆర్ గవాయ్, జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రాలతో కూడిన ధర్మాసనం ఎదుట పురకాయస్థ, చక్రవర్తి తరఫున సీనియర్ న్యాయవాదులు కపిల్ సిబల్, దేవదత్ కామత్ వాదనలు వినిపిస్తూ... తమ క్లయింట్లు జైలులో ఉన్నారని, ఈ పిటిషన్లపై త్వరిత గతిన విచారణ జరపాలని కోరారు. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ... దిల్లీ పోలీసులకు నోటీసులు జారీ చేస్తూ... అక్టోబర్ 30లోగా కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశం చింది. అక్టోబరు 16న, ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం ముందు సిబల్ ఈ అంశాన్ని ప్రస్తావించడంతో అత్యవసరంగా జాబితా చేయడానికి సుప్రీంకోర్టు అంగీకరించింది. కేసు పత్రాలను సర్క్యులేట్ చేయమని సిబల్‌ను కోరిన ప్రధాన న్యాయమూర్తి, ఈ అంశాన్ని అత్యవసరంగా జాబితా చేయడంపై కాల్ తీసుకుంటానని చెప్పారు. ఈ కేసులో అరెస్టు, తదుపరి పోలీసు రిమాండ్‌కు వ్యతిరేకంగా పురకాయస్థ, చక్రవర్తి వేసిన పిటిషన్‌లను దిల్లీ హైకోర్టు అక్టోబర్ 13న కొట్టివేసింది. వీరిని అక్టోబర్ 3న దిల్లీ ప్రత్యేక పోలీస్ విభాగం అరెస్ట్ చేసింది. అరెస్టుతో పాటు ఏడు రోజుల పోలీసు కస్టడీని సవాలు చేస్తూ వారు హైకోర్టును ఆశ్రయించారు. మధ్యంతర ఉపశమనంగా వెంటనే విడుదల చేయాలని కోరారు. అయితే వారిని అరెస్టు చేయడంలో విధానపరమైన లోపాలు లేవని, చట్టంలోని నిబంధనలను ఉల్లంఘన జరగలేదని పేర్కొంటూ వారికి ఉపశమనం కల్పించేందుకు కోర్టు నిరాకరించింది. ట్రయల్ కోర్టు అక్టోబర్ 10న వారిని 10 రోజుల జ్యుడీషియల్ కస్టడీకి పంపింది. చైనా అనుకూల ప్రచారం కోసం ముడుపులు అందుకున్నారనే ఆరోపణలపై నగర పోలీసులు పురకాయస్థ, చక్రవర్తిపై ఉగ్రవాద కార్యకలాపాల నిరోధక చట్టం 'ఉపా' కింద కేసులు నమోదు చేశారు.

మా సమస్యలు పట్టించుకోరా?

రాజకీయ పార్టీలపై స్వలింగుల ఆగ్రహం

ఇండోర్: తమ సమస్యల గురించి రాజకీయ పార్టీలుగానీ, అభ్యర్థులు గానీ పట్టించుకోవడం లేదని మధ్యప్రదేశ్‌లోని స్వలింగులు వాపోయారు. తమ ఆరోగ్యం, హుందాగా జీవించే హక్కు గురించి ఎవరూ మాట్లాడటం లేదని ఆరోపించారు. మధ్యప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలు నవంబరు 17న జరగనున్నాయి. ఇక్కడ బీజేపీ, కాంగ్రెస్ ప్రధాన ప్రత్యర్థులు. ఎన్నికల ప్రచారంలో రాజకీయ పార్టీలు తమ సమస్యలను పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నాయని ఫిర్యాదు చేశారు. స్వలింగు వర్గానికి చెందిన సంధ్యా ఘవిరీ ఇండోర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిశుభ్రత విభాగం అంబాసిడర్‌గా పనిచేస్తోంది. స్వలింగుల ప్రయోజనాల పరిరక్షణ కోసం ఆమె సామాజిక కార్యకర్తగా వ్యవహరిస్తున్నారు. తమ వర్గంలోని కొంతమంది మాదిరిగా బతుకుదెరువు కోసం భిక్షమెత్తుకోకూడదని చాలాకాలం క్రితమే నిర్ణయించుకున్నట్లు సంధ్య చెప్పారు. సంధ్య గురువారం పీటీఐతో మాట్లాడుతూ పురుషుడు, స్త్రీతో పాటు ప్రభుత్వం తమను మూడో జెండర్ కేటగిరి కింద గుర్తించిందని, కానీ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో ఏ రాజకీయ పార్టీ లేదా పోటీ చేసే అభ్యర్థి తమ సమస్యల గురించి మాట్లాడటం లేదని ఆరోపించింది. ప్రత్యేకించి విద్య, ఆరోగ్యం, హుందాగా జీవించే హక్కు గురించి పట్టించుకోవడం లేదని తెలిపింది. పొరుగున గల చత్తీస్‌గఢ్, ఇతర రాష్ట్రాలలో మాదిరిగా మధ్యప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్రంలోని స్వలింగులకు చేసిందేమీ లేదని విమర్శించింది. కేవలం షో కోసమే ప్రభుత్వ కార్యక్రమాలకు స్వలింగులను ఆహ్వానిస్తున్నారని చెప్పింది. రాష్ట్రంలో స్వలింగుల జనాభాతో పోలిస్తే చాలా తక్కువమందికి మాత్రమే ఓటరు ఐడీ కార్డులు ఉన్నాయని వివరించింది. ప్రభుత్వ డేటా ఈ విషయాన్ని స్పష్టం చేసిందని తెలిపింది. డేటా ప్రకారం 2.88 కోట్లమంది పురుషులు, 2.72 కోట్లమంది మహిళలు ఓటర్లుగా ఉండగా ఇండోర్‌లో 111 మందితో కలిపి రాష్ట్రవ్యాప్తంగా 1,373 మంది స్వలింగులకు మాత్రమే ఓట్లు ఉన్నాయని పేర్కొంది.

దీనిపై రాష్ట్ర ప్రభుత్వ సామాజిక న్యాయశాఖ జాయింట్ డైరెక్టర్ సుచితా టిర్కీ బెక్ స్పందిస్తూ ఓటరు ఐడీ కార్డులు తీసుకోవాలని, ఓటు హక్కు వినియోగించుకోవాలని స్వలింగులను ఎప్పటికప్పుడు చైతన్యవంతం చేస్తున్నామని చెప్పారు. స్వలింగులు తమ కుటుంబాలకు దూరంగా బతుకుతున్నారని, వారికి ఆధార్ కార్డులు వంటి గుర్తింపు పత్రాలేవీ లేవని తెలిపారు. ఓటరు కార్డులు రాకపోవడానికి ఇది కూడా ప్రధాన కారణమని వెల్లడించారు.

'కారుణ్య' టైపిస్టులకు సీపీటీ

ఏపీపీఎస్సీ కార్యదర్శికి ఏపీ జేఏసీ అమరావతి వినతి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) నిర్వహించబోయే కంప్యూటర్ ప్రొఫిషియన్సీ టెస్ట్ (సీపీటీ) పరీక్షకు కారుణ్య నియామక టైపిస్టులనూ అనుమతించాలని ఏపీ జేఏసీ అమరావతి డిమాండ్ చేసింది. ఏపీపీఎస్సీ కార్యదర్శి జె.ప్రదీప్ కుమార్‌కు ఈ మేరకు వినతిపత్రం అందజేసింది. జేఏసీ చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి పలిశెట్టి దామోదరరావు గురువారం ప్రదీప్ కుమార్‌ను కలిశారు. కారుణ్య నియామకాలు పొందిన టైపిస్టులుగా ఉన్న వారికి సీపీటీ ఉత్తీర్ణత అవసరమని చెప్పారు. ఇదే అంశమై ఏపీ జేఏసీ అమరావతి రాష్ట్ర కమిటీ అధ్వర్యంలో 92 రోజుల ఉద్యమం జరిపిందని, తమ డిమాండ్‌కు ప్రభుత్వం అంగీకరించిందని తెలిపారు. జీవో నం.69 ద్వారా ఆ మేరకు ఆదేశాలు ఇచ్చిందని గుర్తు చేశారు. ఇటీవల ఏపీపీఎస్సీ ప్రకటన ద్వారా సీపీటీ పరీక్ష రాసుకునేందుకు గ్రామ వార్డు కార్యదర్శులకు, వీఆర్‌ఓ (గ్రేడ్ 2), పంచాయితీ కార్యదర్శి గ్రేడ్-5కు అవకాశం కల్పించినట్లు తెలిపారు. టైపిస్ట్ విభాగం లేదని, వీరికి సీపీటీ ఉత్తీర్ణత సాధిస్తే తప్ప పదోన్నతులు లభించబోవని ప్రదీప్ కుమార్ దృష్టికి తీసుకెళ్లారు. టైపిస్టులకు సీపీటీ పరీక్షకు అనుమతివ్వాలని నేతలు కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ఆయన చర్చించి నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఏపీపీఎస్సీ కార్యదర్శిని కలిసిన వారిలో ఏపీ మున్సిపల్ ఎంప్లాయిస్ సర్వీసెస్ అసోషియేషన్ రాష్ట్ర అధ్యక్షులు డి.ఈశ్వర్ ఉన్నారు.

మరాఠాలకు కోటా కోసం వ్యక్తి ఆత్మహత్య

ముంబై: మరాఠాలకు కోటా సాధన కోసం ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మరాఠా క్రాంతి మోర్చా కార్యకర్త సునీల్ కవాలే (45) ముంబైలోని బాంద్రా ప్రాంతంలో బుధవారం రాత్రి ఉరివేసుకున్నట్లు పోలీసులు గురువారం తెలిపారు. సునీల్ కవాలేది జల్నా జిల్లా, అంబాద్ మండలంలోని చింకాన్‌గావ్ అన్నారు. బాంద్రా, బాంద్రా కుర్లా కాంప్లెక్స్ (బీకేసీ) మధ్య ఫ్లైఓవర్ నాల్గో స్తంభానికి ఉరివేసుకున్నట్లు వెల్లడించారు. తొలుత ఫ్లైఓవర్‌పై ఉన్న విద్యుత్ స్తంభానికి తాడు కట్టుకొని కిందకు దూకి ప్రాణాలు తీసుకున్నట్లు అధికారి చెప్పారు. అతని వద్ద లభ్యమైన సూసైడ్ నోట్‌లో తాను మరాఠాలకు రిజర్వేషన్ కోసం ఆత్మహత్య చేసుకున్నట్లు ఉందన్నారు. కవాలే ధరించిన తెల్లచొక్కాపైనా ఇదే రాసివుందన్నారు.

సైబర్ నేరాల కట్టడికి

'ఆపరేషన్ చక్ర-2'

దేశవ్యాప్తంగా 76చోట్ల సీబీఐ సోదాలు



న్యూఢిల్లీ: ఆర్థిక నేరాలకు పాల్పడుతున్న వారే లక్ష్యంగా కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) ఆపరేషన్ చక్ర-2 చేపట్టింది. ఇందులో భాగంగా దేశవ్యాప్తంగా 76 చోట్ల సోదాలు నిర్వహించింది. క్రిప్టోకరెన్సీ మోసానికి పాల్పడుతూ దాదాపు రూ.100 కోట్లను దండుకున్న రాకెట్‌కు సంబంధించి సీబీఐ ఇటీవల ఓ కేసు నమోదు చేసింది. ఫైనాన్షియల్ ఇంటలిజెన్స్ యూనిట్ (ఎఫ్ఐయూ) సమాచారంతో ఈ కేసు నమోదైంది. కాల్ సెంటర్లను ఏర్పాటు చేసుకొని సాంకేతిక సహాయ సిబ్బందిగా వ్యవహరిస్తూ విదేశీయులే లక్ష్యంగా కొందరు మోసాలకు పాల్పడుతున్నారంటూ అమెజాన్, మైక్రోసాఫ్ట్ కంపెనీలు ఫిర్యాదు చేయడంతో సీబీఐ రెండు కేసులు నమోదు చేసింది. ఎఫ్ఐయూ, ఎఫ్‌బీఐ, ఇంటర్‌పోల్‌తోపాటు ఇతర అంతర్జాతీయ విభాగాల సమాచారం మేరకు ఆపరేషన్ చక్ర-2ను చేపట్టినట్లు సీబీఐ వర్గాలు వెల్లడించాయి. ఇందులో భాగంగా ఉత్తర్‌ప్రదేశ్, మధ్యప్రదేశ్, కర్నాటక, హిమాచల్ ప్రదేశ్, హరియాణా, కేరళ, తమిళనాడు, పంజాబ్, ఢిల్లీ, పశ్చిమబెంగాల్ రాష్ట్రాల్లో దాడులు జరిపినట్లు పేర్కొన్నాయి. తాజా సోదాల్లో తొమ్మిది కాల్ సెంటర్లలో సోదాలు జరిపినట్లు తెలిపింది. ఆపరేషన్ కొనసాగుతున్నందున మరో రెండు కేసులకు సంబంధించిన సమాచారాన్ని మాత్రం తెలియజేయలేదు. సైబర్ నేరస్థులే లక్ష్యంగా గతేడాది 'ఆపరేషన్ చక్ర' పేరిట సీబీఐ దేశవ్యాప్తంగా 115 ప్రాంతాల్లో సోదాలు నిర్వహించింది. కేవలం రాజస్తాన్‌లోనే రూ.కోటిన్నర నగదు, అరకేజీ బంగారాన్ని అప్పట్లో స్వాధీనం చేసుకుంది.

రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

కేవీవీ ప్రసాద్, జమలయ్య డిమాండ్

ఎన్‌టీఆర్ జిల్లాలో ఎండిన మిర్చి పంట పరిశీలించిన బృందం

విశాలాంధ్ర-విజయవాడ: ఓ వైపు వర్షాభావం... మరోవైపు, సాగర్ నీరు అందక పంటలు ఎండిపోతున్నాయి. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. రైతులను ఆదుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. రైతుకు కనీస భరోసా ఇవ్వడం లేదని ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్, కౌలురైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జమలయ్య విమర్శించారు. పంటలు పండించడానికి భారీగా పెట్టుబడి పెట్టిన రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఎన్‌టీఆర్ జిల్లా పెనుగంచిప్రోలు మండలం ముళ్లపాడు గ్రామంలో సాగర్ కాలువ కింద గల మిర్చి పంట పొలాలను గురువారం కేవీవీ ప్రసాద్, జమలయ్య, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఎన్‌టీఆర్ జిల్లా కార్యదర్శి మల్నీడి యల్లమందారావు సహా సీపీఐ, రైతు నాయకులు పరిశీలించారు. రైతులతో మాట్లాడారు. సాగుకు పెట్టుబడి, పంటనష్టం, ఖర్చులు వంటి వివరాలు అడిగి తెలుసుకున్నారు. నీరు లేక ఎండిపోయిన మిర్చి పంటను రైతు బాబురావు నాయకులకు చూపించి...బోరున విలపించారు. అనంతరం కేవీవీ ప్రసాద్, జమలయ్య మాట్లాడుతూ వర్షాభావంతో రాష్ట్రవ్యాప్తంగా రైతులు నష్టపోయారని చెప్పారు. ఈ ఏడాది సక్రమంగా వర్షాలు లేక ప్రాజెక్టులు సైతం నిండుకున్నాయని తెలిపారు. ఇలాంటి పరిస్థితిలో ప్రభుత్వం ముందుకు రైతులను చైతన్యవంతం చేయాల్సి ఉందని, నీరు తక్కువ ఉపయోగించే పంటలు సాగుచేసుకునేలా ఒప్పించాల్సిందని సూచించారు. మిర్చి తదుపరి వాణిజ్య పంటలకు ఎకరాకు లక్ష రూపాయల వంతున రైతులు ఖర్చు చేశారని చెప్పారు. అటు పంటలు పండక...ఇటు ప్రభుత్వం ఆదుకోక రైతులు అల్లాడుతున్నారని చెప్పారు. కౌలుతో కలిపి లక్షన్నర రూపాయలను రైతులు ఖర్చు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ప్రత్యామ్నాయ పంటల కోసం రైతులకు 90శాతం సబ్సిడీతో విత్తనాలు, ఎరువులు, అందజేయాలని డిమాండ్ చేశారు. వర్షభావ పరిస్థితిని ఎదుర్కోడానికి రాష్ట్ర ప్రభుత్వం వద్ద కనీస ప్రణాళిక లేదని మండిపడ్డారు. ఖరీఫ్ నుండి వర్షాభావ పరిస్థితులు కనిపిస్తున్నా రాష్ట్రప్రభుత్వ చేతకానితనంతో అన్నదాత అన్ని విధాలా నష్టపోయాడని కేవీవీ ప్రసాద్ చెప్పారు. ఉన్న పంటనైనా కాపాడటానికి రాష్ట్ర ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కేంద్రబృందం పర్యటించి...నష్టం గురించి అంచనా వేయాలని సూచించారు. సీపీఐ జగ్గయ్యపేట నియోజకవర్గ కార్యదర్శి వల్లంకొండ బ్రహ్మం, రైతుసంఘం నియోజకవర్గం అధ్యక్షుడు, మాజీ ఎంపీపీ పొన్నం నరసింహారావు, సీపీఐ నందిగామ నియోజకవర్గం కార్యదర్శి చుండూరు. గడ్డం సుబ్బారావు, శ్రీను. చాగంటి రామకృష్ణ, కనకపుడి బాబురావు, కొమ్ము శ్రీను. పద్మాల వెంకటేశ్వర్లు. నూకవరపు వెంకటేశ్వర్లు, జక్కులూరి వెంకటేశ్వర్లు. అంజి. కటారపు కన్నయ్య. మాజీ ఎంపీటీసీ యాదగిరి వెంకటేశ్వర్లు, వల్లంకొండ భూపేశ్ తదితరులు పాల్గొన్నారు.

టీటీడీ నిధులతో తిరుపతి అభివృద్ధి

సీపీఐ కార్యదర్శి నారాయణ డిమాండ్

విశాలాంధ్ర-తిరుపతి: విశ్వప్రఖ్యాతి గాంచిన తిరుమల క్షేత్రానికి వచ్చే భక్తులకు మౌలిక సదుపాయాల కోసం తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) నిధులు కేటాయించాలని సీపీఐ జాతీయ కార్యదర్శి కె నారాయణ డిమాండ్ చేశారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ తిరుమ లకు వచ్చే భక్తులకు అన్ని వసతులు కల్పించే దిశగా సేవ చెయ్యాల్సిన అవసరం ఉందన్నారు. తిరుమల ఆలయానికి దర్శనార్థం రోజుకి సుమారు లక్ష మంది వస్తుంటారన్నారు. వచ్చే భక్తుల సౌకర్యార్థం తిరుపతిలో మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు.భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించినపుడే తిరుమల క్షేత్రానికి అధిక సంఖ్యలో వస్తారన్నారు. టీటీడీ ఆదాయంలో ఒక్క శాతం తిరుపతి అభివృద్ధికి కేటాయించడానికి ఇబ్బందులు ఏంటి అని నారాయణ ప్రశ్నించారు. తిరుమల ఆదాయం 4000 కోట్లు వస్తున్న క్రమంలో ఒక్క శాతం అంటే 40 కోట్ల నిధులు కేటాయించి తిరుపతిలో మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. నిధులు ఒక్క శాతం కాకుండా ఆలయ ఆదాయంలో ఐదు శాతం కేటాయించి తిరుపతి నగరంలో భక్తులకు విడిది, పార్కింగ్, రోడ్లు తదితర సౌకర్యాలు కల్పించాల్సి ఉందన్నారు. టీటీడీ నిధులు తిరుపతిలో అభివృద్ధి పనులు కోసం వినియోగించకూడదని బీజేపీ, విశ్వహిందూ పరిషత్ కలసి గవర్నర్‌కు వినతిపత్రం అందించడం సరికాదన్నారు. మానవ సేవ తర్వాతే మాధవుని సేవ అన్న చందంగా భక్తుల సేవే లక్ష్యంగా టీటీడీ పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. తిరుపతి అభివృద్ధి, భక్తుల సౌకర్యాల గురించి పట్టని బీజేపీ, విశ్వహిందూ పరిషత్ రెండింటికి ప్రజా క్షేత్రంలో సరైన గుణపాఠం తప్పదని నారాయణ హెచ్చరించారు.

జగనన్న ఆరోగ్య సురక్షకు మంచి స్పందన: విజయసాయి రెడ్డి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: జగనన్న ఆరోగ్య సురక్ష పథకానికి ప్రజల నుంచి అద్భుత స్పందన లభిస్తోందని వైసీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి విజయసాయిరెడ్డి తెలిపారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని ప్రజలు పెద్ద ఎత్తున వైద్య సేవలు వినియోగించుకుంటున్నారన్నారు. సామాజిక మాధ్యమం వేదికగా గురువారం వివిధ అంశాలపై ఆయన స్పందించారు. రాష్ట్రంలో ఎవరూ నివారించదగ్గ ఆరోగ్య సమస్యలతో బాధపడ రాదన్నదే ఈ పథకం ముఖ్యఉద్దేశమన్నారు. రక్తహీనత, పౌష్టికాహార లోపం బాధితులను గుర్తిస్తూ గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు ప్రతినెలా హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహిస్తున్నారని తెలిపారు. జీవనశైలి వ్యాధుల కట్టడికి నెలకొకసారి వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నారని వెల్లడించారు. జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులతో ప్రతి ఇంటినీ జల్లెడ పడుతున్నారన్నారు. రక్తహీనత, పౌష్టికాహార లోపం బాధితులను గుర్తిస్తూ నివారణ చర్యలు చేపడుతున్నారని తెలిపారు. వరుసగా నాలుగో ఏడాది జగనన్న చేదోడు పథకం కింద అర్హులైన బీసీ లబ్దిదారులకు సీఎం జగన్ ప్రభుత్వం రూ.10వేల సాయం అందించినట్లు విజయసాయిరెడ్డి తెలిపారు.

చంద్రబాబు ఏ జాతి రత్నమో!

టీడీపీ అధినేత చంద్రబాబును జాతి రత్నం, దేశ రత్నం అంటూ పచ్చపార్టీ నేతలు నినాదాల చేస్తున్నారని విజయసాయి రెడ్డి అన్నారు. అయితే ఆయన ఏ జాతి రత్నమో, ఏ గ్రహానికి రత్నమో ఎవరూ చెప్పడం లేదని ఎద్దేవా చేశారు. కనీసం టీడీపీకి రత్నమని చెప్పుకోలేని స్థితిలో ఆ పార్టీ నేతలు ఉన్నారని ఆయన వ్యాఖ్యానించారు.

21న ఆక్రందన దీక్షలు

జయప్రదానికి ఎస్టీయూ పిలుపు

వాల్‌పోస్టర్ ఆవిష్కరించిన నేతలు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్ర వ్యాప్తంగా రెండు లక్షల మంది ఉపాధ్యాయులకు రూ.800 కోట్ల ఆర్థిక బకాయిలు తక్షణమే చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఎస్టీయూ డిమాండ్ చేసింది. తమ డిమాండ్ సాధన కోసం ఈనెల 21న కలెక్టరేట్ల ఎదుట తలపెట్టిన ఆక్రందన దీక్షలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చింది. ఇందుకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఎస్టీయూ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎల్.సాయి శ్రీనివాస్, హెచ్.తిమ్మన గురువారం విజయవాడలోని ఎస్టీయూ రాష్ట్ర కార్యాలయంలో ఆవిష్కరించారు. అనంతరం సాయి శ్రీనివాస్, తిమ్మన్న మాట్లాడుతూ, ఉపాధ్యాయులకు రావాల్సిన ఆర్థిక, ఆర్జిత, జీవిత బీమా, భవిష్యనిధి, కరవు భత్యం, 11వ పీఆర్సీ బకాయిలు దాదాపు రూ.1500 కోట్లకుపైగా ఉన్నట్లు తెలిపారు. కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం (సీపీఎస్) ఉపాధ్యాయుల మ్యాచింగ్ గ్రాంట్ రూ.500 కోట్లు కాగా సీపీఎస్ ఉపాధ్యాయుల నుంచి సేకరించిన కాంట్రిబ్యూషన్ రూ.500 కోట్లు, ఇంతవరకు ఎన్ఎస్డీఎల్ కంపెనీకి జమ కాలేదన్నారు. దసరా కానుకగా ఒక విడత కరువు భత్యం (డీఏ) చెల్లిస్తామని సీఎం జగన్ ఇచ్చిన హామీ నెరవేరలేదని చెప్పారు. అధికారంలోకి వచ్చిన వారంలోగా పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరిస్తామన్న హామీని అమలు చేయలేదన్నారు. గ్యారెంటీ పెన్షన్ స్కీమ్ (జీపీఎస్) పేరుతో కొత్త నాటకానికి తెరదీశారని విమర్శించారు. జీవో 117 ప్రకారం, 3, 4, 5 తరగతుల విలీనంతో పాఠశాల విద్యను నిర్వీర్యం చేశారని, ప్రతినెలా ఒకటో తేదీన జీతాలివ్వడంలేదన్నారు. రాష్ట్ర అత్యున్నత నిర్ణాయక మండలి 'జాయింట్ స్టాఫ్ కౌన్సిల్'లో ఇచ్చిన హామీలు సైతం అమలు కావలేదని గుర్తుచేశారు. ఎస్టీయూ తరపున అనేక వినతులు చేసినా ఫలితం శూన్యమన్నారు. ఈనెల 21వ తేదీన 26 జిల్లా కలెక్టరేట్ల ఎదుట ఆక్రందన దీక్షల పేరుతో నిరసనల ద్వారా ప్రభుత్వంపై ఉపాధ్యాయుల తిరుగుబాటు ప్రారంభమవుతుందన్నారు. దీక్షలను విజయవంతం చేయాలని ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎస్టీయూ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి గాజుల నాగేశ్వరరావు, మల్లు రఘునాథరెడ్డి, రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి సి.నాగరాజు, కృష్ణాజిల్లా ప్రధాన కార్యదర్శి పీకా ఇమ్మాన్యుయేల్, విజయవాడ నగర శాఖ ప్రధాన కార్యదర్శి మస్తాన్ రావు పాల్గొన్నారు.

అంగరంగ వైభవంగా శ్రీవారి గరుడవాహన సేవ

విశాలాంధ్ర - తిరుమల: తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామివారి సాలకట్ల బ్రహ్మోత్సవాలలో భాగంగా గురువారం రాత్రి శ్రీమలయప్పస్వామి వారు తనకెంతో ప్రీతిపాత్రమైన గరుడవాహనంపై లక్ష్మీకాసుల హారం ధరించి తిరుమల మాడ వీధుల్లో విహరిస్తూ భక్త కోటికి దర్శనమిచ్చారు. గజరాజులు, అశ్వాలు ఠీవిగా గరుడ వాహనం ముందు నడుస్తుండగా.. భక్తుల కోలాటాలు, డప్పు వాయిద్యాలు, చెక్క భజనలు, దేవతా మూర్తుల కళా రూపాలతో మంగళవాయిద్యాల నడుమ స్వామివారి వాహనసేవ కోలాహలంగా జరిగింది. గ్యాలరీల్లోనే రెండు లక్షల మంది భక్తులు ఉండగా, వెలుపల మాడవీధుల కూడళ్లలో మరో 50వేల మంది భక్తులకు గరుడ వాహన దర్శనం కల్పిం చారు. గోవిందనామస్మరణతో తిరువీధులు మార్మోగాయి. భక్తులు అడుగడుగునా కర్పూరహారతులు సమర్పించి శ్రీవారిని దర్శించు కున్నారు. ఉదయం నుంచి భక్తుల రద్దీ కాస్త సాధారణంగానే ఉన్నప్పటికీ మధ్యాహ్నం తర్వాత భక్తుల రద్దీ పెరిగింది. లక్షలాది

భక్తులు తిరుమలకు తరలి వచ్చారు. సాయంత్రానికి గ్యాలరీలన్నీ భక్తులతో నిండిపోయాయి. గ్యాలరీలలో వేచి ఉన్న భక్తులకు టీటీడీ అన్నదానం విభాగం అధ్వర్యంలో అల్పా హారాలను నిరంతరం అందజేశారు. పోలీసులు భారీ భద్రత ఏర్పాట్లు చేపట్టారు. అంతకుముందు గరుడ వాహనంపై ఊరేగనున్న శ్రీ మల్లయ్యప్ప స్వామి వారికి అలంకరించే లక్ష్మీకాసుల హారాన్ని టీటీడీ ఈవో ఏవీ ధర్మారెడ్డి దంపతులు శ్రీవారి ఆలయం నుంచి వాహన మండపానికి శోభయాత్రగా తీసుకొచ్చి సమర్పించారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను గద్దె దించుదాం

సీపీఐ కార్యాలయం ప్రారంభోత్సవంలో అక్కినేని వనజ

విశాలాంధ్ర-వేలేరుపాడు: ప్రజా వ్యతిరేక విధానాలతో అనుసరిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను గద్దె దించాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఏలూరు జిల్లా వేలేరుపాడులో నూతనంగా నిర్మించిన సీపీఐ కార్యాలయాన్ని అక్కినేని వనజ, జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య గురువారం ప్రారంభించారు. ముందుగా రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు డేగా ప్రభాకర్ ఎర్రజెండా ఆవిష్కరించారు. అనంతరం అక్కినేని వనజ మాట్లాడుతూ ప్రజలకు నిత్యం అందుబాటు ఉండేందుకు కమ్యూనిస్టు పార్టీలకు కార్యాలయాలు అవసర మన్నారు. అనేక సమస్యలతో వచ్చే ప్రజలకు కార్యాలయం అండగా ఉండాలన్నారు. అతితక్కువ సమయంలో పార్టీ కార్యాలయం నిర్మించడం సంతోషంగా ఉందన్నారు. రానున్న రోజుల్లో దీనిని మరింత అభివృద్ధి చేయాలని ఆకాంక్షించారు. ప్రభుత్వాల నిర్ణయాలు పేదలను మరింత పేదలుగా చేస్తున్నాయని విమర్శించారు. పేదవారి జీవితాల్లో మార్పు కోసం నాడు ఇందిరాగాంధీ బ్యాంకులను జాతీయం చేస్తే.. మోదీ సర్కారు వాటిని నిర్వీర్యం చేస్తోందని మండిపడ్డారు. కార్పొరేట్ కంపెనీలు బ్యాంకులను వేల కోట్ల రూపాయలకు మోసం చేస్తున్నా పాలకులు పట్టించుకోవడం లేదన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేస్తున్న మోదీ సర్కారుకు గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. కుల, మత, జాతి విద్వేషాలు రెచ్చగొడుతూ బీజేపీ పబ్బం గడుపుకుంటుం దన్నారు. మణిపూర్‌లో మహిళలపై అంతఘోరం జరిగినా కేంద్ర ప్రభుత్వం ఏ మాత్రం నోరు మెదపలేదన్నారు. అమరావతి రైతులను జగన్ ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. విశాఖ ఉక్కును ప్రైవేటుపరం చేస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం నోరు మెదపడం లేదన్నారు. జగన్ హయాంలో ఇంజినీర్లు వలం టీర్లుగా మారడం దారుణమని వ్యాఖ్యానించారు. ప్రతిపక్షాల ఇండియా కూటమితో మోదీ ప్రభుత్వానికి తగిన గుణపాఠం తప్పదన్నారు. పోలవరం నిర్వాసితులకు పూర్తి ప్యాకేజీ ఇవ్వాలని, పునరావాసం కల్పించి, ఉపాధి చూపించిన తర్వాతే నిర్వాసితులను తరలించాలని డిమాండ్ చేశారు. బీకేఎంయు రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండి వెంకటేశ్వరరావు, ఏపీజీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కారం దారయ్య, జిల్లా నాయకులు సన్నేపల్లి సాయిబాబు, మైసాక్షి వెంకటాచారి, జమ్మి శ్రీనివాసరావు, బీకేఎంయు జిల్లా కార్యదర్శి కుంచే వసంతరావు, ఉపాధ్యక్షుడు బాలయేసు, జంగారెడ్డిగూడెం మండల కార్యదర్శి జేవీ రమణరాజు, జిల్లా సమితి సభ్యులు రాజు, ఐతా సురేశ్, కూరాకుల బాబురావు, పిట్ట ప్రసాద్, వర్క శ్యామల, కరటం సీతామహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బంగ్లాపై టీమిండియా అలవోక విజయం

విరాట్ కోహ్లీ సెంచరీ

పూనే: ప్రపంచకప్‌లో భాగంగా భారత్-బంగ్లాదేశ్ క్రికెట్ జట్ల మధ్య గురువారం మహారాష్ట్ర క్రికెట్ అసోసియేషన్ స్టేడియంలో జరిగిన లీగ్ మ్యాచ్‌లో టీమిండియా 7 వికెట్ల తేడాతో బంగ్లాపై అలవోకగా గెలుపొందింది. మరోసారి ఆల్‌రౌండ్ ప్రదర్శనతో 41.3 ఓవర్లలోనే జయభేరి మోగించింది. ప్రపంచకప్‌లో టీమిండియాకు వరుసగా ఇది నాలుగో విజయం. 257 పరుగుల లక్ష్యంతో బ్యాటింగ్ చేసిన టీమిండియాకు రోహిత్ శర్మ (40 బంతుల్లో 48), శుభ్‌మన్ గిల్ (55 బంతుల్లో 53) రూపంలో అదిరే ఆరంభం దక్కగా.... విరాట్ కోహ్లీ అజేయ సెంచరీతో చెలరేగి టీమిండియా విజయంలో కీలక పాత్ర పోషించాడు. తొలుత రోహిత్, శుభ్‌మన్ వీరిద్దరూ మొదటి వికెట్‌కు 88 పరుగులు జోడించారు. ఈ తరుణంలో తౌహిద్ బౌలింగ్‌లో రోహిత్ హసన్ మహమూద్‌కు చిక్కాడు. అనంతరం శభ్‌మన్‌కు విరాట్ కోహ్లీ జత కలిశాడు. తొలుత ఆచి తూచి బ్యాటింగ్ చేసిన విరాట్ కోహ్లీ క్రీజులో కుదురుకున్నాక బంగ్లా బౌలర్లపై విరుచుపడ్డాడు. ఈ తరుణంలో స్కోరు 132 పరుగుల వద్ద ఉండగా రెండో వికెట్‌గా శుభ్‌మన్ గిల్ హసన్ మిరాద్ బౌలింగ్‌లో ఔటయ్యాడు. ఈ దశలో శ్రేయాస్ అయ్యర్ (25 బంతుల్లో 19)తో కోహ్లీ భారత ఇన్నింగ్స్‌ను నడిపించాడు. 30వ ఓవర్‌లో జట్టు స్కోరు 178 పరుగుల వద్ద ఉండగా శ్రేయాస్ హసన్ మిరాజ్‌లో బౌలింగ్‌లో మహ్మదుల్లాకు క్యాచ్ ఇచ్చాడు. ఆ తర్వాత కేఎల్ రాహుల్ (34 బంతుల్లో 34)తో కలిసి కోహ్లీ భారత్‌ను విజయతీరాలకు చేర్చాడు. ఈ క్రమంలో సెంచరీ పూర్తి చేసుకున్నాడు. 97 బంతుల్లో 103 పరుగులు చేసిన విరాట్ కోహ్లీ ఇన్నింగ్స్‌లో నాలుగు సిక్సర్లు, ఆరు ఫోర్లు బాదాడు. తొలుత ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న బంగ్లాదేశ్ జట్టు ఎప్పటిలాగే తడబడినా నిలబడింది. మధ్య ఓవర్లలో తడబడ్డా ఆఖర్లో పుంజుకంది. ఓపెనర్లు శివాలెత్తినా ఆ తర్వాత భారత బౌలర్లు జోరు పెంచి ఆ జట్టు దూకుడుకు అడ్డుకట్ట వేయగలిగినా ఆఖర్లో మళ్లీ చేతులెత్తేయడంతో నిర్ణీత 50 ఓవర్లలో ఆ జట్టు 8 వికెట్లు కోల్పోయి 256 పరుగులు చేసింది. లిటన్ దాస్ (82 బంతుల్లో 66 , 7 ఫోర్లు), తాంజిద్ హసన్ (43 బంతుల్లో 51, 5 ఫోర్లు, 3 సిక్సర్లు) మాత్రమే రాణించగా... వికెట్ కీపర్ ముష్ఫికర్ రహీమ్ (46 బంతుల్లో 38, 1 ఫోర్, 1 సిక్సర్) ఫర్వాలేదని పించాడు. ఆఖర్లో మహ్మదుల్లా (36 బంతుల్లో 46, 3 ఫోర్లు, 3 సిక్సర్లు) ధాటిగా ఆడి బంగ్లా స్కోరును 250 మార్కును దాటించాడు. షకిబ్ అల్ హసన్ గైర్హాజరీలో బంగ్లాదేశ్‌కు నజ్ముల్ హొసెన్ శాంతో సారథిగా వ్యవహరించాడు. తొలి ఐదు ఓవర్లలో పరుగులు చేయడానికి తంటాలు పడ్డ ఓపెనర్లు తాంజిద్, లిటన్ దాస్ లు తర్వాత జూలు విదిల్చారు. సిరాజ్, శార్దూల్ లక్ష్యంగా ఓపెనింగ్ జోడీ వీర విహారం చేసింది. 41 బంతుల్లో అర్థ సెంచరీ చేసుకున్న తాంజిద్.. కుల్‌దీప్ వేసిన 14.4వ ఓవర్లో ఎల్బీగా నిష్క్రమించాడు. దీంతో 93 పరుగుల తొలి వికెట్ భాగస్వామానికి తెరపడింది. కెప్టెన్ శాంతో (8)ను జడేజా పెవిలియన్‌కు పంపగా క్రీజులో కుదురుకుంటే ప్రమాదకరంగా మారే మెహిది హసన్ మిరాజ్‌ను సిరాజ్ తన రెండవ స్పెల్ లో తొలి బంతికే ఔట్ చేశాడు. బ్యాట్‌ను తాకి లెగ్ స్టంప్ దిశగా వెళు తున్న బంతిని రాహుల్ పక్కకు డైవ్ చేస్తూ అద్భుత క్యాచ్ అందుకున్నాడు. లిటన్ దాస్‌ను కూడా జడ్డూ పెవిలియన్‌కు పంపడంతో బంగ్లా ఆత్మరక్షణలో పడింది. తౌహిద్ హృదయ్ (16)తో కలిసి ఐదో వికెట్ కు 42 పరుగులు జోడించిన ముష్ఫికర్ బంగ్లా ఇన్నింగ్స్‌ను చక్కదిద్దేయత్నం చేశాడు. కానీ శార్దూల్ ఠాకూర్ వేసిన 37వ ఓవర్ రెండో బంతికి తౌహిద్... గిల్ చేతికి చిక్కాడు. ముష్ఫికర్ కూడా బుమ్రా బౌలింగ్‌లో జడ్డూకు క్యాచ్ ఇచ్చి నిష్క్రమించాడు. ఆఖర్లో మహ్మదుల్లా ధాటిగా ఆడి బంగ్లాకు గౌరవ ప్రదమైన స్కోరును అందించాడు. మిడిల్ ఓవర్స్‌లో లైన్ అండ్ లెంగ్త్‌తో బౌలింగ్ వేసిన భారత బౌలర్లు.. చివర్లో మళ్లీ చేతులెత్తేయడంతో బంగ్లా పోరాడగలిగే స్కోరును భారత్ ముందు నిలిపింది. టీమిండియా బౌలర్లలో బుమ్రా, సిరాజ్ జడేజా రెండు వికెట్లు పడగొట్టారు. కుల్‌దీప్ యాదవ్, శార్దూల్ ఠాకూర్‌లు తలా ఒక వికెట్ తీశారు.

నేటి నుండి తెనాలిలో జాతీయ నాటక పోటీలు

విశాలాంధ్ర- తెనాలి : కళల కాణాచి, తెనాలి - వేద గంగోత్రి ఫౌండేషన్ విజయవాడ వారి సంయుక్త ఆధ్వర్యంలో తృతీయ జాతీయ స్థాయి పద్య నాటక, సాంఘిక నాటిక పోటీలు ఈ నెల 20 (శుక్రవారం)నుంచి ప్రారంభమవుతాయని సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు, సినీ రచయిత సాయిమాధవ్ బుఱ్ఱా తెలిపారు. ఇక్కడి సీపీఐ కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశంలో ఆయన పోటీల వివరాలను ప్రకటించారు. నాటక రంగం పురోభివృద్ధికి తమ సంస్థ నిర్విరామ కృషి చేస్తుందని, సంవత్సరం పొడవునా కార్యక్రమాలను నిర్వహిస్తూనే వున్నామని చెప్పారు. బుఱ్ఱా సుబ్రహ్మణ్య శాస్త్రి, ఎ.ఆర్.కృష్ణ జాతీయ రంగస్థల పురస్కారాలు కూడా ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. వీణా అవార్డ్స్ -2023 అవార్డులు తెనాలి కొత్తపేట రామకృష్ణ కవి కళాక్షేత్రంలో 20వ తేదీ నుంచి 24వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆ రోజు సాయంత్రం 6 గంటలకు బుఱ్ఱా సుబ్రహ్మణ్య శాస్త్రి జాతీయ రంగస్థల పురస్కార మహోత్సవ సభ, బహుమతి ప్రదానం జరుగుతుందని, పురస్కారం ప్రముఖ రంగస్థల, పౌరాణిక నటులు పొన్నాల రామ సుబ్బారెడ్డికి అందజేస్తారని సాయిమాధవ్ వివరించారు. కార్యక్రమంలో భవాని, బొమ్మదేవర వెంకటేశ్వరరావు, జానీబాషా, రమేష్, అయినాల మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.